తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
26-3-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 53 పేజీలు: 8+16 వెల: 6.50


# GALGOTIAS UNIVERSITY
## REVOLUTIONISING LEARNING PEDAGOGY IN INDIA THROUGH "ACTIVE LEARNING"
IN CONSULTANCY COLLABORATION WITH

InsPIRE at NANYANG TECHNOLOGICAL UNIVERSITY SINGAPORE

LEADING TO SET BENCHMARKS GLOBALLY

## TOP RANKED IN QS ASIA & THE WORLD UNIVERSITY RANKINGS 2025

QS World University Rankings

Galgotias University 187 Southern Asia — ASIA RANKED 2025

ASIA RANKED 2025 — Galgotias University 621-640 ASIA 2025

THE World University Rankings 2025

45th Among Top Indian Universities - both Govt. & Private
in 1000-1200 Band - Worldwide



"I have **never** seen a university so committed to adopting what **contemporary research** shows to be the **most effective** conditions for student learning. **Galgotias University** has taken the **bold step** to pioneer **active learning** in all of its programs."

Prof. Richard James
Emeritus Professor,
The University of Melbourne, Australia
Advisor, Galgotias University



Her Excellency Smt. Anandiben Patel, Hon'ble Governor Of Uttar Pradesh felicitating Dr Dhruv Galgotia, CEO, Galgotias University for the University's exceptional performance in the QS Asia-World University Rankings 2025.

### AN HONOUR BEYOND WORDS. A LEGACY BEYOND BOUNDARIES.

We are steadfast in our commitment to realizing the visionary mission of our Hon'ble Prime Minister, Shri Narendra Modi Ji, to establish India as a Vishwaguru and propel it toward Viksit Bharat. With unwavering dedication, we also pledge to fulfill the ambitious vision of our dynamic leader, Hon'ble Chief Minister of Uttar Pradesh, Shri Yogi Adityanath Ji, to transform Uttar Pradesh into a global powerhouse of knowledge and innovation.

## G-SCALE
GALGOTIAS STUDENT CENTERED ACTIVE LEARNING ECOSYSTEM
• Critical Thinking • Collaboration • Engagement • Experiential Learning

- Record Breaking Placements
- Facilitating more Learning through Active/Collaborative Engagement
- Fostering Entrepreneurial Spirit. Cultivating Job Creators over Job Seekers
- Being in NCR and in close proximity with major industrial, corporate and aviation hubs, our students get the best of the faculty and industry exposure that enable our students to have a distinct edge over other universities

### The Edge That Sets Us Apart

Amongst #98 in India (Management Category)
#50 in India (Pharmacy Category)
By NIRF Ranking 2024 — nirf NATIONAL INSTITUTIONAL RANKING FRAMEWORK — शिक्षा मंत्रालय Ministry of Education Government of India

TOP 3 in India for filing MAXIMUM PATENTS

NAAC A+ — Accreditation in First Cycle
Ranked Platinum+ Band: Institution of Prominence OBE Rankings 2024
NBA Accredited — for Computer Science Engineering, Mechanical Engineering, Electronics & Communications Engineering, B.Pharm and MBA
School of Business — AACSB Business Education Alliance

5th Ranked Amongst the Top Private Universities by Times B School Survey 2025

### Apply Today for Career Focussed 2025-26 UG/PG/DIPLOMA/Ph.D. Programmes

Engineering | Computer Applications | Biosciences & Technology | Clinical Healthcare | Forensic Science | Design | Education | Nursing | Liberal Education
Media and Communications Studies | Law | Agriculture | Basic Sciences | Finance & Commerce | Pharmacy | Allied & Health Sciences | Business | Aviation
Logistics & Supply Chain Management | Hospitality & Tourism | Polytechnic | Vocational Education




India's 1st and Finest
**AI led Active Learning Campus**
@ Galgotias University

GALGOTIAS INCUBATION CENTRE
For Research Innovation Startup and Entrepreneurs

GALGOTIAS UNIVERSITY

For the complete list of programmes offered and to apply online visit
www.galgotiasuniversity.edu.in
+91 9582847072 / +91 9717300418
+91 9810162221 / +91 120 4370000



మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన రోడ్డు భద్రత కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి గడ్కరి

# ఫిరాయింపులకు వార్షికోత్సవమా?

>> చలేదని.. నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ తరఫున లోకసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారని దానం నాగేందర్ గురించి న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆ తర్వాత కూడా బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని తెలిపారు. ఫిర్యాదులపై ఏం చేస్తారో... నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయమని మాత్రమే హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని.. అయినప్పటికీ స్పీకర్ పార్టీ మారిన వారికి నోటీసులు ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రిప్లై ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చారన్నారు. ఇప్పటికి మూడు వారాలు అయ్యిందని.. ఆ మూడు వారాలు, నోటీసులు ఎటువెళ్లాయో తెలీదని కౌశిక్ రెడ్డి న్యాయవాది తెలిపారు. తాము ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని.. ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని న్యాయవాది సుందరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా అని న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నవ్వుతూ చెప్పారు.స్పీకర్ క్వాషి జ్యూడిషియరీ అధికారాలతో ఉన్నారని.. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని న్యాయవాది సుందరం తెలిపారు. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అలాంటి సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. స్పీకర్ క్వాషీ జ్యూడిషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరించాలన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన వీధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని... కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామన్న న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు కూడా స్పీకర్‌ను తగిన సమయం అని స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని.. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేం కదా అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం అభిప్రాయపడింది.

న్యాయవాది సుందరం మాట్లాడుతూ...

తగిన సమయం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయన్నారు. కానీ, మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుందని... కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని తెలిపారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదని.. నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో.. అనర్హత వేటు పడిందని అరియామా సుందరం వెల్లడించారు. మరో కేసులో... తగిన సమయం అంటే నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుందనిని చెప్పిందని చెబుతూ.. పాడి కౌశిక్ రెడ్డి తరఫున న్యాయవాది అరియామా సుందరం వాదనలను ముగించారు. అనంతరం తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. అనంతరం సుప్రీంకోర్టు తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. ఏప్రిల్ 2న స్పీకర్,అసెంబ్లీ సెక్రటరీ తరపు న్యాయవాదులు కౌంటర్ వాదనలు వినిపించనున్నారు.

# విద్యా వ్యవస్థలో మార్పులు తెస్తాం

>> ర్లంతా మెరిటోరియస్.. వారు తాము పనిచేసే విద్యా సంస్థలను ఓన్ చేసుకోవాలని సూచించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను రూ.11,600 కోట్లతో ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు.ఎడ్యుకేషన్ కమిషన్ సూచనల మేరకు విద్యా వ్యవస్థను బాగుచేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహా స్పష్టం చేశారు. 11వేలకు పైగా టీచరను భర్తీ చేశామని ఉద్ఘాటించారు. 12 యూనివర్సిటీలకు వీసీలను నియమించామని గుర్తుచేశారు. కొత్త కోర్సులను పరిచయం చేశామని తెలిపారు. పిల్లల పాఠశాలలను పెంచేందుకు, ఎంఎస్ఎంఈ కంపెనీలు,వివిధ యూనివర్సిటీలతో తెలంగాణ స్కిల్ యూనివర్సిటీలు ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. యూనివర్సిటీల్లో డిజిటల్ గ్రాఫ్వుల్స్, మల్టిపుల్ ఎంట్రీస్, మల్టిపుల్ ఎగ్జిట్స్, కామన్‌సిలబస్, అంశాలపైచర్చించేందుకు ఇదివరకే కమిటీ వేశామని చెప్పారు.

# త్రిబులార్‌పై రగడ..రగడ

>> ఉంటాయి మంత్రి ఒక్క సిఐ ఇచ్చిన గణాంకాల ఆధారంతో విమర్శలుచేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. స్టేట్‌రోడ్ అండ్ సిఆర్ఎన్ అనే ఒక విభాగం అందులో ప్లాన్ నాన్‌ప్లాన్ అనిరెండు ఉంటాయి. సింగిల్‌రోడ్లు డబుల్‌రోడ్లుగా మార్చడం కొత్తరోడ్లు వేయడం,నాలుగేళ్ల రహదారిగా విస్తరణచేయడం ప్లాన్ వర్క్‌గా ఉంటుంది. రినివల్స్,రిపేర్లు, చిన్నకల్వర్టులు కట్టడం నాన్‌ప్లాన్‌వర్క్ అంటారని ప్రశాంత్‌రెడ్డి సభకు వివరించారు. స్టేట్ రోడ్ ప్లాన్‌లో మేం పరిపాలించిన 2014నుంచి 2024వరకు ఫైనాన్స్ డిపార్టుమెంట్ నుంచి ఖర్చుచేసి రిలీజైన డబ్బు రూ.8821 కోట్లు అని ఆయన తెలిపారు. ఆర్ఐసి కింద లోన్ తీసుకొని ప్లాన్ కింద రూ.4167కోట్లు ప్రత్యేకంగా ఖర్చుపెట్టాం ఈరెండు కలిపి రూ.12,988 కోట్లను పదిసంవత్సరాల కాలంలో రిలీజ్ అయినవని తెలిపారు. నాన్ ప్లాన్‌లో రిపేర్లు, రినివల్స్ కల్వర్టులకోసం రూ.3375 కోట్లు డైరెక్టు బడ్జెట్ ఖర్చుచేశాం మరో డిఎంఎఫ్టీ కింద 257 మొత్తం కలిసి 3632 కోట్లు రిలీజ్ అయినవి అని తెలిపారు.స్టేట్ రోడ్ అండ్ సిఆర్ఎన్‌లో రెండు కలుపుకుంటే 16621కోట్లు ఆ ఒక్క విభాగం నుంచి రిలీజయ్యాయని తెలిపారు. రూరల్ రోడ్ విభాగంలో సింగిల్‌రోడ్ డబుల్ చేయడానికికొత్త రోడ్డు వేయడానికి రూ.1022 కోట్లు విడుదలైనాయి. సిఆర్ఎఫ్ పద్దుకింద రూ. 2519కోట్లు మేం మొత్తం రూ.22,180 కోట్ల నిర్మాణం విడుదల చేశామని ఇవి అన్నీ వందశాతం పనులు పూర్తైన రోడ్లకు సంబంధించిన గణాంకాలే అని ఆయన తెలిపారు. బిల్డింగ్ విభాగం కోస్తే రూ.2650కోట్లు ఖర్చుచేశాం రోడ్డు బిల్డింగ్‌లు కలుపుకుంటే బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో చేసిన మౌలికవసతుల ఆస్తుల విలువ రూ. 24832కోట్లు అని ఆయన సభకు వివరించారు. ఇందులో 4167కోట్లు రూపాయలు మాత్రమే అప్పుతెచ్చినం ఇందులో 20వేల 40కోట్లు బడ్జెట్ నుంచి పెట్టామని ప్రశాంత్‌రెడ్డి చెప్పారు.నేషనల్ హైవేలో 8వేలకోట్లరూపాయలు ఖర్చుచేశాం. రోడ్ల నిధిపై కూడా రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఒక గంట కూడా పడ్డేలో పూర్తిచేసిన 6686కిమి రిపేర్లు చేశారని విమర్శలు చేశారని ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. కెసిఆర్ ప్రభుత్వహయాంలో తుమ్మలనాగేశ్వర్‌రావు, నేను ఆర్ అండ్‌బి మంత్రిగా ఉంటూ 8439 కి.మి సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చినామని తెలిపారు. అంతకు ముందు 60ఏళ్ళపానలో 6093కిమి నిడివితో డబుల్ రోడ్లుతెలంగాణలో మాత్రమే ఉండేవని మొత్తగా ఇప్పుడు 14.5వేల కి.మి డబుల్‌రోడ్లు తెలంగాణ ప్రస్తుతం ఉన్నాయని తెలిపారు.ఇక ఫోర్‌లైన్లు 669కి.మి ఉంటే మేం వచ్చాక మరో 485కి.మి నిడివిగల రోడ్లను విస్తరణ చేశామని చెప్పారు. నేషనల్ హైవేను మేం నిర్లక్ష్యం చేశారనే కొమటిరెడ్డి ఆరోపణలోకూడా వాస్తవంలేదని ఆయన గణాంకాలతో వాటిలో జరిగిన అభివృద్దిని వివరించారు.ఉమ్మడిరాష్ట్రంలో తెలంగాణలో నేషనల్ హైవేలు 2511 కిమి ఉంటే పదేళ్ళలో దానికి అదనంగా 2472 కి.మి వాటి నిడివిగల రోడ్లను విస్తరణ చేశామని చెప్పారు. ఉమ్మడిరాష్ట్రంలో తెలంగాణలో ఆర్‌అండ్‌బి 30లక్షల చదరపు అడుగులు భవనాలు కట్టారని బిఆర్ఎస్ హాయాంలో ఒక కోటి రెండువేల స్క్వేర్ ఫీట్‌ల భవనాలు కట్టమని తెలిపారు. తెలంగాణలో ఇప్పుడు ఒక కోటి 32 చదరపు అడుగుల భవనాలు ఉన్నాయని ఆయన సభకు తెలిపారు. 30జిల్లాలో సమీకృత కలెక్టరేట్ భవనాలు ఉన్నాయి.అందులో 25 పూర్తిగా కంప్లీట్ అయ్యాయి,94 ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులు నిర్మించాం. బ్రహ్మాండమైన సెక్రటేరియట్, తెలంగాణ అమరవీరుల స్మారకం, అంబెద్కర్ విగ్రహం, కృష్ణశిలతో ప్రపంచంలో కట్టిన ఒకే ఒక ఆలయం యాదాద్రి ని కట్టుకున్నాం దానిపైచర్చకూడా జరిగింది. అనిసుల్ ఖుర్బా అనాథ ఆశ్రయం కట్టినాం జామియానిజాంలో ఆడిటోరియం,విశ్రాంతభవనాలు,న్యాక్‌బిల్డింగ్‌లు ఆర్‌అండ్‌బి నిధులతోనే నిర్మించాం అని తెలిపారు. కమాండ్ కంట్రోల్,ఎడెనిమది మెడికల్ కాలేజిలు, ఆసుపత్రులు, కోర్టులు, వరంగల్‌లో పెద్ద ఆసుపత్రి కట్టినాం. సిఐఆర్ఎఫ్ పద్దునుంచి డబ్బులు తేలేదని అన్నారు కానీ 2369 కోట్లు తీసుకొచ్చాం అని తెలిపారు.ఉప్పల్ ఫ్లై ఓవర్ పట్టించుకోలేదని అసత్య ప్రచార చేశారు. కొమటిరెడ్డి వెంకటరేడ్డి లేచి ప్రశాంత్‌రెడ్డి సభను తప్పుదారి పట్టిస్తున్నారు సిఆర్‌వ్ఐ కింద మేం అధికారంలోకి వచ్చాక 850కోట్ల రూపాయలు తెచ్చాం దానిని 250కోట్లు అనడం విత్‌డ్రా చేసుకోవాలని కోరారు.చివరికి ఈ లెక్కలన్ని చెప్పుతా 32వేల కోట్లా? నాలుగువేల ఒకవంత కోట్ల అనేది చెపుతా ఈ లెక్కలన్ని నావద్ద ఉన్నాయి మీరైనానేనైనా అధికారుల నుంచితీసుకొన్నవే అనిఅన్నారు.సిఐఆర్ఎఫ్ 283కోట్లు కొత్త ప్రభుత్వం ఖర్చుచేసిందని మాత్రమే అధికారుల నుంచితీసుకొన్నాను మంజూర్లు 800కోట్లు చేస్తే మంచిదే అని అన్నారు. కాంట్రాక్టర్ లెస్ రేట్‌కు వేసి ఇంట్రస్ట్ లేక ఈ డబ్బులు వేరే దిక్కుకుతీసుకెళ్ళుతున్నాడని తెలియడంతో అప్పుడు మేం ఎస్క్రో ఎకౌంట్ 2022లో మే 28లోనే ఓపెన్ చేశామని తెలిపారు.15నెలలు అయింది మరి పని మొదలైందా అని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలో 279.5కోట్ల రూపాయల పనులు మంజూరు చేస్తే అందులో 166కోట్ల పనులుపూర్తిగా జరిగాయని అందులో రూ. 113కోట్ల పనులు వివిధ దశల్లో నేటికి పనిజరుగుతోందని ప్రశాంతరెడ్డి వివరించారు.

# కొన్ని శాఖలు అటు..ఇటు!

>> సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఆశావాహులు మాత్రం తమకే మంత్రి పదవి వస్తుందని ఎంతో భరోసాతో ఉన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో పలువురు ఎమ్మెల్యేలు మంత్రి వర్గ విస్తరణపై చర్చిస్తున్నారు. ఇదే సమయంలో ప్రస్తుతం మంత్రుల్లో ఒకరిద్దరిని తొలగించి వారి స్థానంలో ఇతరులకు చాన్స్ ఇవ్వవచ్చునని ప్రచారం కూడా జరుగుతోంది. మంత్రులను ఎవ్వరినీ తొలగించకుండా వారి శాఖల్లో మార్పులు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు, మంత్రివర్గ విస్తరణలో ఎవరెవరికి అవకాశం కల్పించాలన్న విషయాలతోపాటు ఏప్రిల్ 24 నుంచి 26 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'భారత్ సంవిధాన్' అంతర్జాతీయ సదసుపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. భారత సంవిధాన్ సమావేశాలకు సుమారు 80 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నారు. అయితే, ప్రస్తుత భేటీలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపైనే ఎక్కువగా చర్చించినట్లు సమాచారం. ఆరుగురికి చోటు కల్పించడానికి అవకాశం ఉండగా, ప్రస్తుతం నాలుగు స్థానాలను భర్తీ చేసి, రెండు ఖాళీలనుమరోసారి భర్తీ చేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. గతంలో కోర్ కమిటీతో జరిగిన చర్చల్లోనే నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినందున, ప్రస్తుత సమావేశంలో ఆయా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొన్నట్లు తెలిసింది. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ఆయనకు తాజా విస్తరణలో అవకాశం కల్పించాలనే విషయమై చర్చ జరిగినట్లు సమాచారం.

చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ పేరును సైతం పరిగణనలోకి తీసుకొన్నట్లు సమాచారం. ఈయనకు కూడా ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు.నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి పేరును కూడా చర్చించినట్లు సమాచారం. ఎందుకంటే ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుంచి మంత్రివర్గంలో ఎవరూ లేరు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఇప్పటికే ఆయన సోదరుడు వెంకట్ రెడ్డి మంత్రివర్గంలో ఉన్నందున మళ్లీ రాజగోపాల్ రెడ్డికి అవకాశం కల్పించడంపై గతంలో విస్తృతంగా చర్చ జరిగింది. అయినా ఎన్నికల ముందు మంత్రి పదవి ఇస్తామనే హామీ మేరకు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఒకవేళ కేబినెట్‌లో ఆరు ఖాళీలను భర్తీ చేసే అవకాశం వస్తే ఎస్టీ, మైనార్టీవర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది. మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఐలయ్య,ఆది శ్రీనివాస్, బాలూ నాయక్, మురళీ నాయక్, రాంచంద్రునాయక్, ప్రేమ్‌సాగర్‌రావు తదితర పేర్లపైన కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. డిప్యూటీ స్పీకర్‌గా లంబాడా వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు అవకాశం కల్పించే అవకాశం ఉంది. చీఫ్‌విప్ పదవికి ఆదిశ్రీనివాస్‌కు అవకాశం ఉన్నట్లు సమాచారం. మైనారిటీలకు అవకాశమిస్తే ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తీసుకొన్న నిర్ణయాలు అధికారికంగా వెల్లడి కాకపోయినా, ఏప్రిల్ 3న లేదా అదే వారంలో కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# బంగ్లాలో మళ్లీ సైనిక తిరుగుబాటు?

>> రోజుల్లో తీవ్రపరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపాయి. ఈ దేశంలో స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో ఆర్మీ పాత్ర ఎక్కువగా ఉంటుందనే దానిపై అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో దేశంలో అత్యవసరపరిస్థితిని ప్రకటించాలని యూనస్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆర్మీ అధికారులు నిర్ణయించారు. అంతేకాకుండా సైన్యం పర్యవేక్షణలోనే జాతీయ ఐక్యతా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనియోచిస్తోంది. ఇటీవల బంగ్లాలో సైన్యానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు విద్యార్థి నాయకులు స్వరం వినిపించారు. యూనస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరుగుతోందన్న నిర్ణయానికి సైనిక అధికారులు రావడంతో వెంటనే అప్రమత్తం అయ్యారు. ఢాకాఅంతటా కట్టుదిట్టమైన గస్తీని ఏర్పాటుచేయడంతోపాటు పలుప్రాంతాల్లో చెక్ పోస్టులు పెట్టింది. ఇక హసీనాకుచెందిన అవామీలీగ్‌పార్టీ తిరిగిపుంజుకునేలాచేసేందుకు సైన్యం ఒకప్రణాళికను రూపొందిస్తున్నదని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. వీటిని సైన్యం ఖండించింది. రాజకీయ గందరగోళం నేపథ్యంలోయూనస్ త్వరలోనే చైనాలో పర్యటించనున్నారు. చైనా బంగ్లాలమధ్య సంబంధాల్లో మార్పునకు ఈపర్యటన దోహదపడుతుందని ఢాకా అధికారులు భావిస్తున్నారు.

## హోం శాఖ అంటే నాకు ఇష్టం: రాజగోపాల్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి25:** తనకు మంత్రి పదవి వస్తుందని మునుగోడు ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణ ఓ కొలిక్కి వస్తున్న సమయంలో ఆయన మంగళవారం అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. హోంమంత్రిత్వ శాఖ అంటే తనకు ఆసక్తి ఉన్నప్పటికీ, అధిష్ఠానం ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడతానని అన్నారు. ఢిల్లీలో సీరియస్‌గానే కేబినెట్ విస్తరణపై చర్చ జరిగినట్లు ఉంది అని పేర్కొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 26-03-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
ద్వాదశి రా.1.44
ధనిష్ఠ రా.2.29
వర్జ్యం ఉ.7.35-9.06
దు.ఉ.11.57-12.46
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**వృషభం:** బంధువుల నుంచి విలువైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు లభిస్తాయి.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన విద్యలపై ఆసక్తి చూపుతారు.

**సింహం:** అనుకోని సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కన్య :** సన్నిహితులతో ఏర్పడిన తగాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**తుల:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. వివాదాలకు దూరంగా వుండండి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**వృశ్చికం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ఉద్యోగాలలో స్వల్ప మార్పులు.

**ధనుస్సు:** మిత్రులు కలసి సహాయ సహకారాలు అందిస్తారు. విలువైన పత్రాలు, వస్తువులు జాగ్రత్త అవసరం..

**మకరం:** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు

**కుంభం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. ఉద్యోగాలలో ప్రమోషనులు పొందుతారు.

**మీనం:** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. ఆకస్మిక ధనలాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పిఎఫ్ విత్‌డ్రా!

>> తున్నారని తెలి పారు. కేవలం నగదు విత్‌డ్రా మాత్రమే కాకుండా పిఎఫ్‌లో ఎంతమొత్తం ఉందోకూడా యుపిఐ ద్వారా చూసుకోవచ్చని చెప్పారు. ఆటోమేటెడ్ సిస్టమ్ విధానంలో లక్ష రూపా యలవరకూ విత్‌డ్రా చేసుకోవచ్చని చెప్పారు. కోరుకున్నఅకౌంట్‌కు ఆనగదును బదలీ చేసుకునే అవకాశం ఉంది. డిజిటైజ్ చేయడంలో ఇపిఎఫ్ఒ గణనీయమైన పురోగతి సాధించిందని దాన్వాపేర్కొన్నారు. విత్‌డ్రా సదుపాయం క్రమబద్ధీకరించడానికి 120కిపైగా డేటాబేస్‌లను ఏకీకృతంచేసిందని చెప్పారు. క్లెయిమ్‌ప్రాసెసింగ్ సమయంకూడా కేవలం మూడురోజులకు తగ్గిందని చెప్పారు. 95శాతం క్లెయిమ్‌లు ఆటోమేటెడ్ ప్రాసెస్ రూపంలో జరుగుతున్నాయని చెప్పారు. యుపిఐ, ఎటిఎంద్వారా పిఎఫ్ విత్‌డ్రా ఆప్షన్ అనేది ఒక మైలురాయి అని లక్షలాదిమంది ఉద్యోగులకు దీనివల్ల ప్రయోజనం కలగనుందని చెప్పారు.


## రైలులో యువతిపై అత్యాచార యత్నం జరిపిన నిందితునికి కోసం గాలింపు

**కంటోన్మెంట్,మార్చి 25 ప్రభాతవార్త:** ఎంఎంటిఎస్ రైల్‌లో ప్రయాణం చేస్తున్న ఒంటరి యుతిపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితున్ని ఎస్ఒటీ, జి.ఆర్.పి. 14 పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. యువతిపై అత్యాచారం జరిపేందుకు వచ్చిన నిందితుని నుంచి తప్పించుకునేందుకు రైల్‌లో నుంచి దూకిన యువతి తీవ్రగాయాలపాలై సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఎంఎంటిఎస్ రైల్‌లో యువతిపై అత్యాచార యత్నానికి పాల్పడ్డ వ్యక్తి సిసి ఫుటేజీల ఆధారాలతో మేడ్చెల్ గౌడవల్లి ప్రాంతానికి చెందిన పాత నేరస్థుడు మహేశ్ అయిఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# ఉద్రిక్తం

>> య్యింది. అతి కష్టంపై న్యాయవాదులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని సముదా యించి సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ముట్టడి చేబట్టిన న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదులకు రాష్ట్రంలో రక్షణ కరువ య్యిందని తెలిపారు.

ఎవరిని ఇబ్బంది పెట్టని వ్యక్తిగా పేరొందిన ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని మహిళను వేధించిన కేసులో నిందితుడుగా వున్న దస్తగిరి అనే వ్యక్తి నడిరోడ్డుపై కత్తితో పొడిచి చంపడం దారుణమని వారు తెలిపారు. దస్తగిరిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమల్లోకి తేవాలని వారు డిమాండ్ చేశారు.



మంగళవారం న్యూఢిల్లీలోని పార్లమెంటు వద్ద సెంట్రల్ ఆర్మ్డ్ ఫోర్స్ రిటైర్డ్ ప్రతినిధులతో భేటీ అయిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

# కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి25:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు,మున్సి పాలిటీల్లో ఆస్తి పన్నుపై వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. జిహెచ్ఎంసీ తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీ ఇవ్వాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను బకాయిలపై 10శాతం వడ్డీ చెల్లించిన వారికి ఓటిఎస్ వర్తిస్తుందని మున్సిపల్ శాఖ ఉత్తర్వులో పేర్కొంది.

# పంజాబ్‌కింగ్స్ విజయం

## పోరాడి ఓడిన గుజరాత్ టైటాన్స్



**అహ్మదాబాద్, మార్చి 25:** ఐపిఎల్ 18వ సీజన్‌లోఐదో మ్యాచ్ చివరివరకూ ఉత్కంఠ భరితంగానే సాగింది. తొలుత బ్యాటింగ్‌చేసిన పంజాబ్‌కింగ్స్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 20 ఓవర్లలో 243 పరుగులుచేస్తే తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన గుజరాత్ టైటాన్స్ జట్టు ఐదు వికెట్లనష్టానికి గాను 20 ఓవర్లలో 232 పరుగులుమాత్రమే చేయగలిగింది. ఒకదశలో గుజరాత్ జట్టు విజయం ఖాయం అనుకున్న దశలో పంజాబ్‌జట్టు అప్రమత్తం కావడంతో గుజరాత్‌కు సాధ్యంకాలేదు. చివరకు పంజాబ్ కింగ్స్ 11 పరుగుల తేడాతో గెలిచింది. కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 97 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మెరుపు అర్ధసెంచరీతో చెలరేగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయ్యర్ మెరుపులతో డీలాపడిన గుజరాత్ టైటాన్స్ బౌలర్లను యువచిచ్చరపిడుగు శశాంక్‌సింగ్ 44 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. రబాడా, సిరాజ్‌లు వేసిన ఆఖరి ఓవర్లలో బౌండరీలతో విరుచుకుపడ్డాడు. 20వ ఓవర్‌లో ఐదు ఫోర్లతో 23 రన్స్ పిండుకున్న శశాంక్ గుజరాత్‌కు కష్టసాధ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించడంలో కీలకంగా నిలిచాడు. టాస్ ఓడిన పంజాబ్‌కింగ్స్ కొండంత స్కోరుచేసి గుజరాత్‌కు 244 పరుగుల టార్గెట్ విదించింది. నేటిమ్యాచ్‌లో అహ్మదాబాద్ స్టేడియం బౌండరీలతో మోతమోగింది. శ్రేయస్ అయ్యర్, శశాంక్‌సింగ్‌లు ఇద్దరూ కూడా 28 బంతుల్లోనే 81 పరుగులుజోడించి పంజాబ్‌స్కోరును 240 దాటించి తమ సత్తాచూపించారు. గుజరాత్ బౌలర్లలో సాయికిశోర్ మూడు వికెట్లు తనఖాతాలో వేసుకుంటే రబాడ, రషీద్‌ఖాన్‌లు తలో వికెట్‌తీసారు. తదుపరి బ్యాటింగ్‌కువచ్చిన గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 232పరుగులకే పరిమితం అయింది.జట్టులోసాయిసుదర్శన్ 41 బంతుల్లో ఐదుఫోర్లు ఆరుసిక్స్‌లతో 74 పరుగులుచేసాడు. శుభ్‌మన్‌గిల్ 14 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 33 పరుగులుచేసాడు. జోస్ బట్లర్ 33 బంతుల్లో నాలుగుఫోర్లు రెండు సిక్స్‌లుతో 54 పరుగులుచేస్తే రూథర్‌ఫోర్డ్ 27 బంతుల్లో నాలుగుఫోర్లుమూడు సిక్స్‌లతో 46 పరుగులుచేసి దూకుడుగా ఆడినప్పటికీ భారీ లక్ష్యం కావడంతో పోరాడి ఓటమి పాలయిందనే చెప్పాలి.

# మరో మృతదేహం లభ్యం

>> ఏజెన్సీలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి. 700మంది సిబ్బంది ఈ ఆపరేషన్‌లో నిమగ్నమై, సొరంగంలో కూలిన రాళ్లు, టిబిఎం విడిభాగాలను వెల్డింగ్ చేసి బయటకు తీస్తున్నారు. ఎప్పటికప్పుడు అక్కడ పేరుకున్న మట్టి, రాళ్ల దిబ్బలు, పూడిక, ఊట నీటిని బయటకు తొలిగిస్తున్నారు. రెస్క్యూ ఆపరేషన్ కళ్లకు కట్టించేలా ప్రమాదం జరిగిన రోజున, ఇప్పుడున్న పరిస్థితుల ఫొటోలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ప్రదర్శిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30మీటర్లు అత్యంత ప్రమాదకర జోన్‌గా గుర్తించారు. ఇదిలా ఉండగా ఎస్ఎల్‌బిసి ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తెచ్చేందుకు అవసరమైన సహాయక చర్యలను కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఇప్పటికే ఆదేశించారు. సహాయక చర్యలను నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఐఎఎస్ అధికారి శివశంకర్ లోతేటిని ప్రత్యేకాధికారిగా నియమించిన సంగతి తెలిసిందే.

# డిప్యూటీ సిఎంను కలిసిన మల్లారెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి25:** హైదరాబాద్ నగర శివారులో ఉన్న ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ వంతెన పనులు ప్రారంభించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కోరారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం ఇచ్చారు. సుమారు 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులు పెండింగ్ లో ఉన్నాయని మల్లారెడ్డి చెప్పారు. వంతెన పనులు ప్రారంభించేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. పనులు వేగవంతమయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

# మరో భారీ ఎన్‌కౌంటర్

>> రని పదుల సంఖ్యలో లొంగుబాట్లు జరిగాయని తెలిపారు.నక్సల్స్ వ్యతిరేఖ కార్యకలాపాలలో ప్రభుత్వం పోలీస్ శాఖ అదేశాల మేరకు బస్తర్ ప్రాంతంలో డిఆర్జీ ఎస్టీఎఫ్ బస్తర్ ఫైటర్స్ కోబ్రా సిఆర్పీఎఫ్ బిఎస్ ఎఫ్ ఐటిబిటి సిఎఎఫ్ బలగాలు మోహరించడం జరిగిందని ఈ ప్రాంతంలో శాంతియుత వాతావరణాన్ని కల్పించేందుకు అవి కృషిచేస్తున్నాయని ఐజీ సుందర్ రాజ్ మరోమారు స్పష్టంచేసారు.

ముగిసిన "సారయ్య" ఉద్యమ ప్రస్థానం..దంతెవాడ బీజాపూర్ జిల్లాల సరిహద్దు గీధం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్సాపర నెల్గోడ బొడ్గా ఇకెలి అటవి ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్ కౌంటర్ లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు.మృతుల్లో మావోయిస్టు అగ్రనేత వరంగల్ వాసి అంకేశ్వరపు సారయ్య ఆలియాస్ సుధీర్ సుధాకర్ (మురళీ) ఉన్నాడు.వరంగల్ లోని మడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని తారలపల్లి గ్రామానికి చెందిన ఆకేశ్వరపు వెంకటయ్యకు రవి సారయ్య ఇద్దరు కొడుకులు కాగా సారయ్య ముప్పై ఏళ్ల క్రితం ఆ ప్రాంతంలో రజాకార్లు భూస్వాములు పెద్దదార్లపై పోరాడుతున్న నక్సల్స్ పట్ల ఆకర్షితుడై ఉద్యమబాట పట్టాడు.మావోయిస్టు ఉద్యమంలో అంచెలంచెలుగా ఎదిగిన ఆయన ప్రస్తుతం దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడుగా పనిచేస్తున్నాడు.ఇతని తలపై ఇరవై ఐదు లక్షల రివార్డు ఉంది.తాజాగా జరిగిన ఎన్ కౌంటర్లో మృతిచెందటంతో గ్రామంలో కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# న్యాయవాదిని హత్య చేసిన నిందితుడి అరెస్టు

**హైదరాబాద్ (సైదాబాద్), మార్చి 25 ప్రభాతవార్త:** న్యాయవాది ఎర్రబాపు ఇజ్రాయిల్(56)ను దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఐఎస్ సదన్ పోలీసులు అరెస్టు చేశారు. చంపాపేట ఈస్ట్‌మారుతీనగర్‌లో నివాసముంటున్న న్యాయవాది ఇజ్రాయిల్‌ను సోమవారం ఉదయం కత్తితో పొడిచి దారుణంగా హత్య చేసిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. హత్యకు పాల్పడిన నిందితుడు గులాం దస్తగిర్(49)ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈస్ట్‌మారుతీ నగర్‌లో నివాసముంటున్న న్యాయవాది ఇజ్రాయిల్‌కు చంపాపేటలోని యాక్సిస్ బ్యాంకు సమీపంలో గల శ్రీనివాస అపార్ట్‌మెంటులో ఒక ఫ్లాట్ ఉంది. తమ ఇంట్లో ఏదైనా కరెంటు పని ఉన్నప్పుడు స్థానికంగానే ఉండే ఎలక్ట్రీషియన్ గులాం దస్తగిర్‌ను పలిపించి రిపేరు చేయించేవాడు. శ్రీనివాస అపార్ట్‌మెంటులో కూడా ఏదైనా కరెంటు పని ఉంటే దస్తగిరే వెళ్లి రిపేరు చేసేవాడు. ఈ క్రమంలో అదే అపార్ట్‌మెంటులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి భార్యతో దస్తగిరి అక్రమ సంబంధాన్ని ఏర్పరుచుకున్నాడు. ఈ విషయం తెలియడంతో వాచ్‌మెన్ తన భార్యతో కలిసి తమ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. అయితే ఇజ్రాయిలే వాచ్‌మెన్‌ను అతని భార్యను నగరం నుంచి పంపించి వేశాడని దస్తగిర్ ఊహించుకుని, తరచుగా ఇజ్రాయిల్ ఇంటికి వెళ్లి వాచ్‌మెన్‌ను అతని భార్యను ఇక్కడికి తిరిగి పిలిపించాలని బెదిరిస్తూ గొడవ పడ్డాడు. ఇజ్రాయిల్‌పై దస్తగిర్ పగను పెంచుకున్నాడు. ఈ నెల 24వ తేదీన ఉదయం 8.50 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న ఇజ్రాయిల్‌పై పథకం ప్రకారం కత్తితో ఛాతిపై పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఇజ్రాయిల్ కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరిపిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సాహితీ
సాహిత్యానికి పెద్దపీట
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-3-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 53 పేజీలు: 8+16 వెల: 6.50

అక్రమ వలసదారుల ఏరివేతకు చర్యలు

కెనడా ఎన్నికల్లో భారత్, చైనాల జోక్యం

5లో

## పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవమా?



### నోటీసులు ఇవ్వడానికి స్పీకరుకు ఇంకెంతకాలం?

### కీలక వ్యాఖ్యలు చేసిన 'సుప్రీం' ధర్మాసనం

### తదుపరి విచారణ ఏప్రిల్ 2కు వాయిదా


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి25:** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఫిరాయింపుల వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు తగిన సమయం అని చెప్పలేదని.. అలాంటప్పుడు వాటిని కాదని తామెలా వెళ్లగలమని సుప్రీం ప్రశ్నించింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి ఎలా రాయగలం అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడానికి ఇంకా ఎంతకాలం పడుతుంది? ఆలస్యం చేసే ఎత్తుగడలు అనుసరించొద్దు, రిజినబుల్ టైం అంటే గడువు ముగిసేవరకా? నాలుగు వారాలైనా షెడ్యూల్ ఫిక్స్ చేయలేదా? అదృష్టవశాత్తూ... ఎమ్మెల్యేలు 4 ఏళ్లు ఆగలేదు అని పేర్కొంది. అంతకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరవున సీనియర్ న్యాయవాది అరియామా సుందరం వాదనలు వినిపించారు. పార్టీమారిన ఎమ్మెల్యేలపై వేరువేరుగా ఫిర్యాదుచేసినా స్పీకర్ స్పందిం >>2

# కొన్ని శాఖలు అటు..ఇటు!

### మంత్రివర్గ విస్తరణలో కొందరి పోర్టుఫోలియోలు మారే అవకాశం

### 16 నెలలుగా ఖాళీగా ఉన్న ఆరు పదవులు

### నలుగురు లేదా ఐదుగురు కొత్త మంత్రులు రాక!



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి25:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం కేబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో కేవలం నాలుగు లేదా ఐదు స్థానాలను భర్తీ చేయనున్నట్లు తెలుస్తున్నది. ఇదే సమయంలో శాఖల మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కేబినెట్ విస్తరణపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర కోర్ కమిటీ నుంచి ఏఐసిసి వివరాలు సేకరించింది. కొత్త మంత్రులు ఏప్రిల్ 3న లేదా మొదటి వారంలో ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. మంత్రివర్గంలో కొత్తగా ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీకి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశాలున్నాయి. బీసిల్లో శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్‌కు చోటు లభించే ఛాన్స్ ఉన్నది. ఎస్సీల్లో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మైనారిటీల్లో అవకాశం ఇస్తే ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌ను మంత్రి పదవి వరించే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గంలో రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది. భవిష్యత్తులో మరో ఇద్దరితో మంత్రివర్గాన్ని విస్తరించనున్నారు. తెలంగాణలో 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

ఆ తర్వాత డిసెంబర్‌లో సిఎంగా సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎంగా మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులుగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహా, శ్రీధర్‌బాబు,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు గవర్నర్ ప్రమాణం చేయించారు. అప్పటి నుంచి మళ్లీ మంత్రివర్గ విస్తరణ జరుగలేదు. దాదాపు 16 నెలలుగా మంత్రి వర్గంలో ఖాళీలు ఉన్నాయి. తాజాగా మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గంలోకి ఎవరెవరిని తీసుకోవాలనే దానిపై పార్టీ అధిష్టానంతో సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చర్చించారు.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే,పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో ఢిల్లీలో తాజాగా కీలక సమావేశం నిర్వహించగా.. రాష్ట్రనేతలు హాజరైన విషయం తెలిసిందే. రాష్ట్ర కీలక నేతలతో ఢిల్లీ పెద్దలంతా విడివిడిగా >>2



## జూన్ నుంచి ఎటిఎంలలో పిఎఫ్ విత్‌డ్రా!

**న్యూఢిల్లీ, మార్చి 25:** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ కీలక సంస్కరణలు అమలుకు సిద్ధం అవుతోంది. ఇపిఎఫ్‌నుంచి నిధుల ఉపసంహారణను సులభతరం చేయనుంది. త్వరలో యుపిఐ నగదు విత్‌డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులోకి వస్తున్నది. ఇందుకు సంబంధించి నేషనల్‌పేమెంట్స్ కార్పొరేషన్ ప్రతిపాదనలకు కార్మికశాఖ ఆమోదం తెలిపిందని ఆ శాఖ కార్యదర్శి సుమిత్రా దావ్రా తెలిపారు. ఈ ఏడాది మేలేదా జూన్‌నుంచి ఉద్యోగులు పిఎఫ్ మొత్తాలను ఎటిఎం, యుపిఐద్వారా విత్‌డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానున్నదని వెల్లడించారు. ప్రావిడెంట్‌ఫండ్స్ నిధులు పొందే విషయంలో చందాదారులు అనూహ్యమార్పులు చూడబో >>2

# త్రిబులార్‌పై రగడ..రగడ



### కష్టం మాకు.. గొప్పలు మీకా?

### కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించిన ప్రశాంత్ రెడ్డి

VS

### మీరు వేసిన రోడ్లకు డబ్బు మేం కడుతున్నాం.. ఎన్నికలముందు రోడ్లు అమ్ముకునే దుస్థితికి వెళ్లారు..

### - మంత్రి కోమటిరెడ్డి ఘాటు జవాబు



**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిల మధ్య మాటల యుద్ధం జరిగింది. ట్రిపుల్ ఆర్‌పై కాంగ్రెస్‌ది అసత్య ప్రచారమంటూ ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ట్రిపుల్‌ఆర్ కోసం కష్ట పడింది బిఆర్ఎస్సే... 15 నెలల్లో మీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి ప్రశ్నించారు. ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండి పడుతూ ట్రిపుల్‌ఆర్‌పై మాట్లాడేహక్కు బిఆర్ఎస్‌కు లేదన్నారు. మేం ఆర్ఆర్ఆర్ కడితే మీరు అమ్ముకున్నారు. ఎన్నికల ముందు రోడ్లు అమ్ముకునే పరిస్థితి తెచ్చారు. 2014 నుంచి మీరు వేసిన రోడ్లకు డబ్బు మేం కడుతున్నామని కోమటిరెడ్డి అన్నారు. భారత రాష్ట్ర సమితి తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో తెలంగాణలో రోడ్లు, బ్రిడ్జిలు, భవనాల నిర్మాణం కోసం రూ.32,832కోట్లు వ్యయం చేసి అభివృద్ధి చేశామని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. శాసనసభలో మంగళవారం బడ్జెట్ పద్దులపై ప్రశాంతరెడ్డి మాట్లాడారు. మంత్రులు దామోదర రాజనర్సింహా, శ్రీధర్‌బాబు, కొమటిరెడ్డి వెంకటరెడ్డి విద్య, పర్యాటకం, ఆర్ అండ్‌బి బడ్జెట్ తదితర పద్దులు ప్రతిపాదించారు. బిఆర్ఎస్ హయాంలో రూ.8,112కోట్లు వ్యయం చేశారని అందులో రూ.4,167కోట్ల అప్పుచేసి చేశారని రోడ్ల గుంతలు కూడా పూడ్చలేదని ఆర్‌అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి చేస్తున్న ప్రచారం సత్యదూరమని ప్రశాంతరెడ్డి సభకు వివరణ ఇచ్చారు. ప్రశాంతరెడ్డి మాట్లాడుతున్నప్పుడు డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క అడ్డు పడి "పద్దుల డిమాండ్‌పై చర్చ జరుగాలని గత చరిత్ర కోసం కాదు భవిష్యత్ కార్యచరణకు సూచనలు ఇవ్వండి" అన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బెల్ట్‌షాపులు తీసుకొచ్చి ప్రోత్సహించినవారు దయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడటం బాధకరం అంటూ నిష్ఠూరాలు పలికారు. మరోవైపు ఆర్‌అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి పలుమార్లు వివరణ ఇవ్వడానికి ప్రశాంతరెడ్డి ప్రసంగానికి అడ్డుపడి నప్పటికి గంటపాటు బడ్జెట్‌పద్దులపై మాట్లాడారు. ఆర్ అండ్ బిలో నాలుగైదు విభాగాలు >>2

## విద్యా వ్యవస్థలో మార్పులు తెస్తాం

### - మంత్రి దామోదర

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి25:** విద్యాశాఖ బడ్జెట్ పద్దుపై అసెంబ్లీలో ఇవాళ(మంగళవారం) చర్చ జరిగింది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సమాధానం ఇచ్చారు. గత ఏడెనిమిదేళ్లుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని.. ఇది మంచి పరిణామం కాదని చెప్పారు. 662 రెసిడెన్షియల్ స్కూళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని అన్నారు. సుమారు 2 లక్షల మంది విద్యార్థులు అరకొర వసతులతోనే చదువుకొంటున్నారని చెప్పారు. స్కూళ్లు మంజూరు చేయడం మంచిదే.. కానీ వసతులు కూడా కల్పించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతూ పాఠశాలలకు పంపించే పరిస్థితి ఉండకూడదని మంత్రి దామోదర రాజనర్సింహా తెలిపారు.

స్కూల్‌లో ఉన్న పిల్లల గురించి ఇంటిదగ్గర ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందే పరిస్థితులు ఉండకూడదని మంత్రి దామోదర రాజనర్సింహా చెప్పారు. అన్ని స్కూళ్లలో అవసరమైన దిద్దుబాటు చర్యలు ప్రారంభించామని అన్నారు. విశాల తరగతి గదులు, ల్యాబులు, తాగునీటి వసతి, క్లీన్ వాష్ రూమ్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ టీచ >>2

## బంగ్లాలో మళ్లీ సైనిక తిరుగుబాటు?

### అత్యవసర సమావేశం జరిపిన సైన్యాధికారులు

**ఢాకా, మార్చి 25:** ప్రధానిపదవికి షేక్ హసీనా రాజీనామా చేసిన అనంతరం బంగ్లాదేశ్‌లో శాంతిపురస్కారగ్రహీత మహ్మద్‌యూనస్ నేతృత్వంలో ఏర్పాటయిన తాత్కాలిక ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధం అవుతోంది. అక్కడి ఆర్మీ వర్గాలు అత్యవసరసమావేశం నిర్వహించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బంగ్లా ఆర్మీచీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్ నేతృత్వంలో ఈ అత్యవసర సమావేశంజరిగింది. ఇందులో ఐదుగురు లెఫ్టినెంట్‌ఝనరల్స్, ఎనిమిది మంది మేజర్ జనరల్స్‌తో సహా ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. యూనస్ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి బంగ్లాప్రజల్లో అశాంతి, అప నమ్మకంపెరిగిందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. దీనితో దేశంలో రానున్న >>2



పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టు డెడ్‌బాడీలు, ఆయుధాలు

## దండకారణ్యంలో మరో భారీ ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు హతం

### మృతుల్లో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సారయ్య వరంగల్‌వాసి

**చర్ల,మార్చి 25,ప్రభాతవార్త :** దండకారణ్యం మారోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది.వరుస ఎన్‌కౌంటర్లతో అటవి ప్రాంతంలో నెత్తురు ఏరులై పారుతుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విధించిన డెడ్ లైన్ కల్లా మావోల ఏరివేత ఇక షూరా...?అనిపిస్తుంది. తాజా సంఘటనలు బట్టి చూస్తే ఒక వైపు ఎన్ కౌంటర్లు మరోవైపు లొంగుబాట్లు భారీగా పట్టుబడుతున్న ఆయుధాలతో మావోయిస్టుల మనుగడ ప్రశ్నార్థంగా మారింది. చత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ బీజాపూర్ జిల్లా సరిహద్దులోని గీధం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్సా పర నెల్గోడ బొడ్గా ఇకేలి గ్రామాల సరిహద్దు ప్రాంతాలలో నక్సల్స్ ఉనికిని కనిపెట్టిన నిఘా వర్గాల సూచనలతో దంతెవాడ డిఆర్జీ బస్తర్ ఫైటర్స్ నక్సల్స్‌కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టంది.ఈ క్రమంలో మంగళవారం ఉదయం మావోల స్థావరాన్ని గుర్తించి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు సారయ్య ఆలియాస్ సుధీర్ సుధాకర్ (మురళి) ఉన్నట్లు పోలీసులు గుర్తిం చారు. ఇతని తలపై చత్తీస్ ఘడ్‌లో 25 లక్షల రివార్డు ఉంది. ఎకె 47 ఆయుధం కలిగిఉన్నాడు ఇతని స్వస్థలం తెలంగాణా రాష్ట్రం వరంగల్ వాసిగా గుర్తించారు. మరో ఇద్దరు ఎస్ఎస్‌జడ్ సిఎం కమిటీ సభ్యులు మన్ను బర్సా పండరు అటరా ఇరువురిపై 4 లక్షల రివార్డు కలిగిఉన్నారని బస్తర్ రేంజి ఐజీ పి.సుందర్ రాజ్ దంతెవాడ డిఐజీ కమలోచన్ కశ్యప్ తెలిపారు.

ఈ ఎన్ కౌంటర్ అనంతరం వారు మాట్లాడుతూ మావోయిస్టులపై నిషేధం కొనసాగుతుందని మావోయిస్టు కార్యకలపాలను అణిచివేసేందుకు భద్రతా బలగాలు చురుగ్గా పనిచేసిస్తున్నాయి.83రోజుల వ్యవధిలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 100మంది మావోయిస్టులు మృతిచెందా >>2



మంగళవారం హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడికి యత్నించిన లాయర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

## అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

### న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా లాయర్ల రాష్ట్రవ్యాప్త ఆందోళన, పలువురి అరెస్టు

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో సీనియర్ న్యాయవాది ఎర్రబాబు ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా న్యాయవాదులు మంగళవారం నాడు చేబట్టిన అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తలకు దారితీసింది. చంపాపేట్‌లో నివసించే ఇజ్రాయిల్‌ను దస్తగిరి అనే వ్యక్తి సోమవారం ఉదయం నడిరోడ్డుపై దారుణంగా హత్య చేయడం తెలిసిందే. ఈ హత్యకు నిరసనగా మంగళవారంనాడు న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేబట్టగా ఇదే సమయంలో పెద్ద సంఖ్యలో అడ్వకేట్లు ఛలో అసెంబ్లీ పేరిట శాసనసభను ముట్టడించారు. ఓవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో నల్లకోట్లు ధరించి అసెంబ్లీ వైపుకు దూసుకు రావడంతో వారిని అదుపు చేయడం పోలీసులకు ఒకింత కష్టమ >>2

### న్యాయవాదిని హత్య చేసిన నిందితుడి అరెస్టు 2లో

## టన్నెల్ విషాదం

# మరో మృతదేహం లభ్యం



టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్ ) మనోజ్ కుమార్ (ఫైల్)

### బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం

### కొనసాగుతున్న రెస్క్యూ చర్యలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త:** నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమల పెంట గ్రామంలోని ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మందిలో మార్చి 9వ తేదీ ఆదివారం రాత్రి పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహం లభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ కంపెనీలో ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ ప్రసాద్, జమునదేవి దంపతుల కుమారుడు మనోజ్ కుమార్ మృతదేహంగా గుర్తించినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా వారి కుటుంబ సభ్యులకు అందించనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా వైద్య పరీక్షల అనంతరం మృతదేహాన్ని వారి స్వగ్రామానికి తరలించనున్నట్లు తెలియజేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉన్నావ్ జిల్లా బంగార్మొ గ్రామానికి చెందిన మనోజ్ కుమార్‌కు భార్య స్వర్ణలత, కుమారుడు ఆదర్శ్, కుమార్తె శైలజ ఉన్నారు. కేంద్ర, రాష్ట్రా లకు చెందిన వివిధ విభాగాలతో పాటు ప్రైవేటు సంస్థలన్నీ కలిపి 25 >>2

వార్త

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.

-స్వామి వివేకానంద

# మాటల్లోనే మహిళా భద్రత!

ఎన్ని చట్టాల చేసినా, కఠిన చర్యలు తప్పవని ఎన్నిసార్లు ఎందరు నేతలు హెచ్చరించినా మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. వికృతరూపం దాలుస్తున్నాయి. చట్టాలన్నా, అధికారులన్నా పాలకులన్నా ఏమాత్రం భయభక్తులు లేకుండాపోతున్నాయి. సాంకేతికంగా అభివృద్ధిచెంది విజ్ఞానం ఆర్జించే కొద్దీ ఏది మంచో ఏది చెడో గ్రహించే విచక్షణాజ్ఞానం పెరగాలి. మనుషుల ప్రవర్తనలో మార్పురావాలి. సభ్యతాసంస్కారాలు పెంపొందాలి. కానీ దురదృష్టవశాత్తు అందుకు విరుద్ధంగా పయనిస్తున్నామనిపిస్తున్నది. జరిగిన, జరుగుతున్న సంఘటనలు ఆవేదనే కాదు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఎమ్ ఎమ్‌టిఎస్ రైలులో ఒక యువతిపై అత్యాచారానికి యత్నించిన సంఘటన దిగ్భ్రాంతి కలిగిస్తున్నది. ఆగంతకుడి బారి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో వేగంగా వెళుతున్న రైలు నుంచి బాధితురాలు కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడింది. రక్తసిక్తమైన ఆ అమాయకురాలిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చావుబతుకుల మధ్య మృత్యువుతో పోరాడుతున్నది. ఇరవైమూడేళ్ల ఆ యువతి ఒక ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నది. మొన్న శనివారం మధ్యాహ్నం మూడుగంటల సమయంలోనే సికింద్రాబాద్‌కు వచ్చి తన మొబైల్ ఫోన్‌ను రిపేర్ చేయించుకొని తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తెల్లాపూర్ మేడ్చల్ ఎమ్ ఎమ్‌టిఎస్ రైలు ఎక్కింది. ఆమె ఎక్కిన లేడీస్ కోచ్‌లో ఉన్న మహిళలు రాత్రి ఎనిమిది గంటల సమయంలో అల్వాల్ స్టేషన్‌లో దిగిపోవడంతో ఆ బోగిలో బాధితురాలు ఒక్కరే మిగిలిపోయింది. అది గమనించినఆగంతకుడు బోగిలోకి ప్రవేశించి బాధితురాలిపై అఘాయిత్యం చేయబోయాడు. తన శక్తిమేరకు అడ్డుకొని భయాందోళనకు గురై పరిస్థితి చేయిదాటుతుందని గ్రహించిన ఆ యువతి కొంపల్లి రైల్వేబ్రిడ్జి సమీపంలో నడుస్తున్న రైలు నుంచి కిందికి దూకింది. తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ యువతిని గుర్తించిన స్థానికులు అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవల కాలంలో మహిళలపై అఘాయిత్యాలు అంతకంతకు పెరుగుతున్నాయి. మరోపక్క మహిళల రక్షణ కోసం చట్టాల మీద చట్టాలు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా కేసులు నమోదు చేసి నేరస్తులను జైళ్లకు పంపుతున్నారు. అయినా ఇవేమీ ఆగడం లేదు. వాస్తవంగా ఢిల్లీలో నిర్భయపై ప్రైవేట్ బస్సులో జరిగిన అత్యాచార సంఘటన ఒక్క భారత్‌లోనే కాదు అప్పట్లో యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. స్వచ్ఛందంగా పార్టీలకు అతీతంగా యువత ముందుకు వచ్చి ఆందోళనలు, నిరసనల కార్యక్రమాలు చేపట్టడంతో దిగి వచ్చిన ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతంకాకుండా పటిష్టమైన చట్టాన్ని రూపొందించారు. ఆ చట్టానికి 'నిర్భయ' చట్టంగా నామకరణం చేశారు. నేరం రుజువు అయితే జీవితకాలంపాటు నేర తీవ్రతను బట్టి మరణశిక్ష విధించే విధంగా చట్టానికి పదునుపెట్టారు. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో కొంతమేరకు మహిళలపై నేరాలు తగ్గుతాయని ఆశించారు. కానీ ఆ తర్వాత కూడా ఏ మాత్రం తగ్గలేదు కదా అంతకంతకు పెరిగిపోతున్నాయి. మాతృమూర్తిగా అర్ధాంగిగా, సోదరిగా, కన్నకూతురిగా, సమున్నత గౌరవ మర్యాద, మన్ననలు అందుకోవలసిన మహిళలపై హింస పెరిగిపోవడం దురదృష్టకరం. బాలికలపై లైంగిక హింస, వేధింపులు, అత్యాచారాలు, సైబర్ నేరాలు లాంటి దాష్టీకాలు ఎన్నో జరుగుతున్నాయి. ఆ వేధింపులను భరించలేక, మరో దారిలేక దేశవ్యాప్తంగా యేటా వేలాదిమంది బాలికలు, మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇంకొకపక్క ఎన్నోనేరాలు వెలుగు చూడడానికి కూడా నోచుకోవడం లేదు. అందుకు రకరకాల కారణాలున్నాయి. పోలీసు స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల్లో కూడా అధికశాతం న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయి. మరికొన్ని ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇక యావత్ దేశాన్ని నిర్ఘాంతపరిచిన కోల్‌కతా వైద్యవిద్యార్థిని హత్యాచార సంఘటన. ఆనాడు ఉలిక్కిపరిచింది. ఆందోళనలు కూడా జరిగాయి. చివరకు న్యాయస్థానం ఆదేశం మేరకు సిబిఐ కూడా విచారణ చేపట్టింది. ఇక ప్రేమించడం లేదని కోపంతో యువతులను దారుణంగా హత్యచేస్తున్న సంఘటనలు ఇటీవల పెరిగిపోతున్నాయి. మొన్న ఆంధ్రప్రదేశ్‌లో తల్లీకూతురు ఇద్దరిని ఒక కామాంధుడు పొట్టన పెట్టుకున్నాడు. చాలా సంఘటనల్లో నేరస్తులు అంతోఇంతో చదువుకున్నవారే. విద్యావంతులే ఈ దారుణాలకు పాల్పడుతున్నారు. జరుగుతున్న సంఘటనలు సభ్యసమాజం తలవంచుకునేలా చేస్తున్నాయి. సంఘటనలు జరిగినప్పుడల్లా ఖండించడం పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పాలకులు చెప్తూనే ఉన్నారు. ఈ విషసంస్కృతి పెరిగిపోతుందనేందుకు జరుగుతున్న సంఘటనలు అద్దంపడుతున్నాయి. మరొకపక్క మహిళలపై హింసకు చరమగీతం పాడాలన్న ఉద్దేశంతో ఎంతో కృషి జరుగుతున్నది. మన దేశంలోనే కాదు ఇతర దేశాలు కూడా చట్టాలు చేస్తున్నాయి. ఏదిఏమైనా మాటల్లోనే కాక మహిళా రక్షణ చేతల్లో చూపాలి. అవసరమైతే చట్టాలకు మరింత పదును పెట్టాలి. అప్పుడే నేరస్తుల్లో చట్టమన్నా, పోలీసులన్నా భయభక్తులు ఏర్పడతాయి.

మీ ఆలోచనలు సదాచారమార్గం నుంచి మిమ్మల్ని దూరం చేసే సంకేతాలను ఇస్తున్నాయంటే దురదృష్టం మీకై కాచుకు కూర్చుంది అని భావించండి.



తిరుక్కురళ్

ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.



ఎల్లెన్ గ్లాస్గో

## ప్రజావాక్కు



### సెలవు దినంగా ప్రకటించాలి

**మహాత్మాజ్యోతిరావు** పూలేసాంఘిక దురాచారాలైన బాల్య వివాహాలు, అంటరానితనం,వివక్షలపైఅలుపెరగని పోరాటం చేశారు. సత్యశోధక సమాజాన్ని స్థాపించి ఎందరికో విద్యను అందించడంతోపాటు, సమాజాన్ని అభ్యుదయ మార్గంలో నడిపారు.రచయితగా, సంస్కరణోద్యమశీలిగా చరిత్రలో నిలిచారు. బడుగు,బలహీన, అణగారిన వర్గాల కోసం తనజీవితాన్ని పణంగాపెట్టిన మహాత్మ జ్యోతిరావు పూలేకు భారతరత్న ప్రకటించాలి. తన ఇంటిలోనే తొలి మహిళా ఉపాధ్యాయుని తయారు చేసిఎందరికో ఆదర్శంగా నిలిచారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఏప్రిల్11న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక పండుగ దినంగా, సెలవుదినంగా ప్రకటించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

### ఒత్తిడిలేనిదెవరికి?

**విద్యార్థులు** పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడిని ఎలా జయించాలో ఈమధ్య ప్రముఖులు చర్చా కార్యక్రమాలు ఏర్పాటుచేస్తూ పరిష్కార మార్గాలు తెలియచేస్తున్నారు.అయితే ఈ ఒత్తిడిని ఒక్కవిద్యార్థులే కాదు. ఉద్యోగులు, నిరుద్యోగులు,వ్యాపారస్తులు,మహిళలు, యువతులు, బాలికలు, రాజకీయ నాయకులు ఇంకా ఇలా ఎందరో ప్రతినిత్యంఒత్తిడితో సతమతమవుతున్నారు. కొందరు ఒత్తిడినితట్టుకుని ఎలాగోలా బతికేస్తున్నారు.చాలా మంది మద్యం,మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారు. అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. అయితే ఒత్తిడిని జయించడానికి ఎన్నోమార్గాలు ఉన్నాయి.

-మిథునం, హైదరాబాద్

### గురుకుల జూనియర్ కళాశాలలు

**గురుకులాలలో** హైస్కూల్, జూనియర్ కళాశాలలు కలిసి ఉండడం వలన పరిపాలన విధానంలో ప్రిన్సిపాల్‌లకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. క్రమశిక్షణ లోపిస్తుంది. పర్యవేక్షణసరిగ్గా ఉండడంలేదు. కొన్ని ప్రాంతాలలో ట్రైబల్ వెల్ఫేర్ విద్యాసంస్థలలో హై స్కూల్, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఒకే చోట ఉంటున్నాయి. వేరువేరుగా ప్రిన్సిపాల్‌లను విడివిడిగా నియమించాలి. విద్యార్థులపై ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచవచ్చు. వచ్చే విద్యా సంవత్సరంనుండి ఈ విధానాన్ని ప్రారంభించాలి.

- రాపాక రవీందర్, జనగాం

### సభ్యుల పెంపుదల తేలికకాదు

**పార్లమెంటు** సభ్యుల పెంపుదల అంత తేలిక కాదు. జనాభా ప్రాతిపదిక ఒక పాయింట్ అయితే, జనాభా పెరుగుదల సేకరణ తరువాతే డీలిమిటేషన్ ప్రక్రియ మొదలు కావాలి. తరువాత పార్లమెంటులో అన్నిపార్టీల వారితో విస్తృతంగా చర్చ జరగాలి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమ్మతి పొందాలి. చివరకు చట్టం చేయాలి. ఈ ప్రోసెస్ చాలా శ్రమతో, కాలయాపనతో కూడినది. కేంద్రం ఈ పెంపుదల ఆలోచనను బయట పెట్టగానే తొందరపడి తమిళనాడు ముఖ్యమంత్రి హడావిడిగా బి.జె.పియేతర రాష్ట్ర ముఖ్యమంత్రులందరితో సమావేశం నిర్వహించారు. పాల్గొన్న సభ్యులందరూ కేంద్ర ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. అందరూ ఘాటు ఘాటుగా మాట్లాడేశారు. ఆలు లేదు చూలులేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టుంది ఈ అనవసరపు తొందరపాటు చర్య.అయితే ఒక్క ముఖ్య విషయం ఇక్కడ గుర్తించాలి. కేంద్రంలో ఎన్.డి.ఎ. ప్రభుత్వానికి కావలసినంత మెజారిటీఉందికదాని రాష్ట్రాల అభిప్రాయాలను విస్మరిస్తే పరిస్థితులు విషమంగా పరిణమిస్తాయి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మత రాజకీయాలు

**తమ** వద్దకు వచ్చే రోగులని ఆరోగ్యవంతులని చేసి పంపాలని వైద్యులు అనుకుంటారు. అలానే విద్యను బోధించే గురువులు, బట్టలుకుట్టే దర్జీలుతమ వృత్తిధర్మాలనునెరవేర్చాలని చూస్తారు. అవసరార్థం తమ వద్దకు వచ్చిన వారి కులం, మతం తెలుసుకునే ప్రయత్నంచేయరు.ఎవరికైనా తమసేవలను అందించడానికి సిద్ధం అంటారు. కళాకారులకి కూడా కులమతాల పట్టింపులుండవు. తామున్న రంగాలకు న్యాయం చేయాలని చూస్తారు. మనదేశంలో స్థిరపడి కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవ చేసిన విదేశీయులు ఎందరో ఉన్నారు. అయితే ఈ మధ్య కొందరు కుల మతాలను తరచు ప్రస్తావిస్తున్నారు.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### రిజర్వేషన్ గడువు పెంచాలి

రైల్వే రిజర్వేషన్ ఇంతకుముందు మూడు నెలల ముందు చేసుకునే సౌకర్యంఉండేది.కానిఇప్పుడు రెండునెలలకు కుదించారు. జనప్రయాణరద్దీదృష్ట్యా మళ్లీ90రోజులు పెడితే బాగుంటుంది. మామూలు ప్రయాణాలు కాకుండా తిరుమల సేవా, దర్శన టిక్కెట్లు, రైలు టిక్కెట్ల సమన్వయం కాకుండా ఉంది. దీనివలన90రోజుల ముందే రిజర్వేషన్ సౌకర్యంగా ఉంటుంది.

-తిరుమల దేవి, హైదరాబాద్

మన విన్నపం

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# మావోయిస్టుల నియంత్రణలో పోలీసు పాత్ర

*ప్రజారక్షకుడిగా పోలీసును ప్రజలు గుర్తించిన నాడు ఎలాంటి ఉద్యమాలైనా చరిత్ర గమనంలో విఫలమైనవిగా కలిసిపోక తప్పదు. పోలీసుల పాత్ర సైద్ధాంతిక దృక్పథంతో పనిచేసే వారి పట్లముఖ్యంగా ఎన్నుకున్న విధానాలు విభిన్నంగా కనపడినా, ప్రజలకోసం చేసేవిగా కనపడినప్పుడు మరో విధంగా ఉండకతప్పదు. బలప్రయోగం లొంగుబాటు చర్యలు వారిపట్ల పనికిరావు. మారిన కాలంలో పోలీసులు కేవలం అణచివేతకే ఉన్నారన్న ముద్రను తొలగించుకోక తప్పదు. పోలీసు, రక్షణకోసం ప్రజాహితం కోసం సహాయకంగా ఉండటంతోపాటు చట్టాన్ని అధిగమించే వారిని నియంత్రించడానికి ఉన్నాడన్న పేరును తెచ్చుకోవాలి. అప్పుడే ప్రజలకు పోలీసు దగ్గరవుతాడు.*



రావులపాటి సీతారాంరావు

గడిచిన రెండుమూడు సంవత్సరాలలో మావోయిస్టుల ప్రతి ఘటనతోపాటు వారి అణచివేతను కూడా ప్రభుత్వాలు క్రమపద్ధతిలో చేస్తుండటం అందరూ గమనిస్తూనే ఉన్నారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాలు క్రమేపీ ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాల వల్లనో, మావోయిస్టు విధానాలపట్ల ఆకర్షణ లేకపోవడం వల్లనో బాగా తగ్గిపోయాయి. ఎక్కువ మంది మిలిటెంట్లు, మావోయిస్టులు, అడవులలో అనారోగ్యం పాలిటబడి, వయసు పైబడటం వల్ల ప్రభుత్వాలకు లొంగిపోతున్నారు. జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు. అయితే అసలు సిసలైన పరిష్కారాన్ని అటు మావోయిస్టులూ, ఇటు ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల ఇంకా ఈ సమస్య అప్పుడప్పుడూ తలెత్తుతూనే ఉన్నది. మిలటరీ పరిష్కారం అంటే ప్రభుత్వ అణచివేత ధోరణి. అదే విధంగా మావోయిస్టుల బుల్లెట్ సిద్ధాంతం ఈ మారిన కాలంలో, కాలం చెల్లిన సొల్యూషన్లుగానే పరిగణించాలి. విద్యార్థులు, యువత ఇది వరకటి మాదిరి ఈ ఉద్యమ ధోరణికి ఆకర్షితులు కాకపోవడం వల్ల మావోయిస్టుల సంఖ్య క్రమేపీ గణనీయంగా తగ్గిపోతున్నది. యువతకు ఉద్యోగాలు దేశంలో కాకపోయినా ఇతర దేశాలలో ఎక్కువ సంఖ్యలో లభిస్తుండటంతో అటు వైపు దారిమళ్లించారు. ట్రైబల్ ప్రాంతాలలో కూడా యువకులకు విద్యాబుద్ధులు అమరటంతో, మావోయిస్టుల ప్రభావానికి లోనుగాకుండా పట్టణాలకు దారి పట్టి మెరుగైన జీవన విధానాలను వెతుక్కుంటున్నారు. అర్బన్ ఏరియాస్‌లోకూడా మావోయిస్టుల స్లీపర్ సెల్స్ బాగా తగ్గిపోవడం వల్ల వారు పట్టణాలలో బలహీనపడ్డారు. పౌరహక్కుల సంఘాలు కూడా ప్రస్తుత పరిస్థితులలో అచేతనావస్థలో ఉన్నాయి. ఇన్ని పరిణామాల మధ్య కేంద్రప్రభుత్వం దృఢవైఖరి వల్ల మావోయిస్టులు నిశ్శేష్టులవటంతో ఉద్యమం నీరుకారే పరిస్థితి ఏర్పడింది. ఈ మధ్యబస్తర్, చత్తీస్‌ఘడ్‌లో జరిగిన రెండు ఆపరేషన్లలో దాదాపు 30 మంది మావోయిస్టులు హతమయ్యారు. దీనితో దాదాపు 100మందికి వారి హతుల సంఖ్య పెరిగింది. దాదాపు 20 సంవత్సరాలపైబడి కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టులు చేస్తున్న ఉద్యమాన్ని ప్రస్తుతం సంకట పరిస్థితిలోకి ప్రభుత్వాలు నెట్టి వేశాయి. మళ్లీ వారు తలెత్తే పరిస్థితి, ఈ ఛాలెంజిని అధిగమించే పరిస్థితి రానున్న కాలంలో ఉంటుందా అన్నది అనుమానాస్పదంగానే మారింది. నిజానికి 2000 సంవత్సరం అటూ ఇటుగా మావోయిస్టుల పోరాటం ఎప్పుడైతే ప్రభావిత రాష్ట్రాల ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా దేశ భద్రతకు, సామాన్యుల రక్షణకు ఛాలెంజీగా పరిగణించి దిద్దుబాటు చర్యలు ముఖ్యంగా పోలీసులు క్రమపద్ధతిలో శిక్షణ పొంది (ఉదాహరణకు అవిభక్త ఎ.పిలో గ్రేహౌండ్స్ నిర్మాణం, శిక్షణ) ఎదురుదాడితోపాటు, వారి ఆనుపానులు కనుక్కోవటమేగాకుండా వారికి సహాయపడే మిలిటెంట్లుస్లీపర్ సెల్స్‌తో సహా ఏరివేత కార్యక్రమం, ఎన్‌కౌంటర్లు తలపెట్టారో, మావోయిస్టులు కేవలం చత్తీస్‌ఘడ్ లాంటి ప్రాంతాలకే, వారి ఉనికి కోసం పరిమితమయ్యారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వాలు మార్పులకు లోనయినా, నక్సలైట్లుగా



పిలవబడే మావోయిస్టులను నియంత్రించటంలో వెనుకడుగు వేయలేదు. చర్చల పేరిట అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమం ఒకవిధంగా మావోయిస్టుల నాయకత్వాన్ని బలంగా దెబ్బతీసింది. తెలుగు రాష్ట్రాలలోని పోలీసులు ప్రాణాలు పోగొట్టుకోటానికి కూడా సిద్ధపడి రాష్ట్రాల భద్రతను కాపాడటం నిజంగా హర్షణీయం. అందుకే ఈ రాష్ట్రాలలో మావోయిస్టులు దాదాపు కనుమరుగయ్యారు. హింస ద్వారా, బుల్లెట్ ద్వారా రాజ్యాధికారం పొందాలనే కమ్యూనిస్టు మావోయిస్టుల భావజాలానికి కాలం చెల్లిందని, భారతదేశంలో ప్రజాస్వామ్య పాలనను హెచ్చుమందిప్రజలు ఆమోదించారన్న నగ్నసత్యాన్ని వారు కాదనలేని తప్పని పరిస్థితి. అడవి ప్రాంతాలలో ట్రైబల్స్ నివసించే ప్రాంతాలలో చదువులేని అమాయక ప్రజానీకాన్ని ముఖ్యంగా యువతను మిలిటెంట్లుగా మార్చి, బలం ఉన్నట్లు ప్రజామోదం పొందాలనుకోవటం, ఇప్పటి పరిస్థితుల్లో ప్రజానీకానికి ఆమోదయోగ్యం కాదు. కొలంబియాలోని రివెల్యూషనరీ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (ఎఫ్.ఎ.ఆర్.సి), నేపాల్‌లోని మావోయిస్టులు అనుభవం వల్ల ఈ పద్ధతికి స్వస్తిచెప్పారు. అందువలనే మావోయిస్టులు మనదేశంలో కూడా వారి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని జనజీవనంలో భాగమై ట్రైబల్ ప్రజల బాగోగులు చూడ ప్రయత్నిస్తే ఎవరూ కాదనలేరు. కేవలం బలప్రయోగం ద్వారానే వారు మూఢనమ్మకాలతో వారి భావజాలం ద్వారా ఫలితాలు రాబట్టాలంటే సాధ్యం కాని పరిస్థితులలో భారతదేశమే కాదూ మిగతా ప్రభావిత దేశాలు కూడా ఉన్నాయి. అయితే మనదేశంలోని ప్రభుత్వాలు కూడా బలప్రయోగం ద్వారా కాకుండా సామరస్య ధోరణిలో ప్రజలు శాంతియుత పద్ధతులతో,ప్రజాస్వామ్య పరిధిలో సంక్షేమంతోపాటు, అభివృద్ధి అందరికీ సాధించటం సాధ్యమే అన్నది చేతల ద్వారా నిరూపించటం ఒకలక్ష్యంగా పెట్టుకోవాలి. ఏపనికైనా జనామోదం అవసరం.అది సాధించుకోవాలి. అలాకాకుండా కేవలం మిలటరీ పద్ధతులు అవలంబిస్తే మావోయిస్టులు, వారి సిద్ధాంతాలకు ఊపిరి పోసినట్లవుతుంది. ఆ ఎరుకతో రాష్ట్రాలలోని పాలకులు, కేంద్రంలో అధికారంలో ఉన్నవారు, ప్రజాహిత పాలన సాగిస్తే మావోయిస్టులకు ఉనికే ఉండదు. లొంగిపోతున్న మావోయిస్టులు గత చరిత్రను మర్చిపోయి జనసామాన్యంలో కలిసిపోయే విధంగా పరిస్థితులూ, సౌకర్యాలను కల్పించాలి. సాల్వాజుడుం కాంపెయిన్ అనుభవం ఇంకా ప్రభుత్వంమీద పడ్డ ఆరోపణను తొలగించలేకపోతున్నది. ఎన్‌కౌంటర్లలో క్రాస్‌ఫైర్‌లో చాలా మంది అమాయక ట్రైబల్స్ మిలిటెంట్లుగా భావించబడి, బలైపోయారన్న అపవాదును ప్రభుత్వాలు మూటగట్టుకోకూడదు. త్వరితగతిన మావోయిస్టుల ప్రభావిత అడవి ప్రాంతాలలో, రవాణా సౌకర్యంతోపాటు, విద్యా వైద్యశాలలు నిర్మించాలి. కొన్నిచోట్ల తిరుగుబాట్లు ఎదుర్కోవాల్సి వచ్చినా, తలపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు, అణిచివేత బదులు, అభివృద్ధి పథంలో ప్రయోజనాలను ప్రభుత్వం తరపున చేపట్టే కార్యక్రమాలను ముందుండి అందచేయడం వలనే! ప్రజారక్షకుడిగా పోలీసును ప్రజలు గుర్తించిన నాడు ఎలాంటి ఉద్యమాలైనా చరిత్ర గమనంలో విఫలమైనవిగా కలిసిపోక తప్పదు. పోలీసుల పాత్ర సైద్ధాంతిక దృక్పథంతో పనిచేసే వారి పట్లముఖ్యంగా ఎన్నుకున్న విధానాలు విభిన్నంగా కనపడినా, ప్రజలకోసం చేసేవిగా కనపడినప్పుడు మరో విధంగా ఉండకతప్పదు. బలప్రయోగం లొంగుబాటు చర్యలు వారిపట్ల పనికిరావు. మారిన కాలంలో పోలీసులు కేవలం అణచివేతకే ఉన్నారన్న ముద్రను తొలగించుకోక తప్పదు. పోలీసు, రక్షణకోసం ప్రజాహితం కోసం సహాయకంగా ఉండటంతోపాటు చట్టాన్ని అధిగమించే వారిని నియంత్రించడానికి ఉన్నాడన్న పేరును తెచ్చుకోవాలి. అప్పుడే ప్రజలకు పోలీసు దగ్గరవుతాడు. ●

# వాతావరణ హెచ్చరికలపై అవగాహన అవసరం

కింజరాపు అమరావతి

రెండువేల ఇరవైనాలుగు సంవత్సరం అత్యంత వేడి సంవత్సరం అని డబ్ల్యూఎంఒ ఇటీవల నిర్ధారించింది. సంక్లిష్ట పరస్పర చర్యలను అర్థం చేసుకోవడం, అంచనా వేయడం కోసం ప్రభావవంతమైన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం చాలా అవసరం. వాతావరణ హెచ్చరిక కేంద్రాల ఖచ్చితమైన వాతావరణ సూచన, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ప్రజలను అప్రమత్తం చేస్తాయి. ఇది వారి జీవనోపాధి అల్లకల్లోలం కాకుండా కాపాడుతుంది. మానవ ప్రేరిత వాతావరణ మార్పు మరింత తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు దారితీస్తున్నందున, ప్రభావవంతమైన బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థల అవసరం గతంలో కంటే చాలా ముఖ్యమైనది. రాబోయే తుఫానులు, వరదలు లేదా కరువుల గురించి ప్రజలను హెచ్చరించే, సహాయక చర్యలను అందించే వ్యవస్థలు విలాసవంతమైనవి కావు. కానీ జీవితాలను రక్షించే, ఆర్థిక నష్టాలను తగ్గించే, పెట్టుబడిపై దాదాపు పది రెట్లు రాబడిని అందించే ఖర్చుతో కూడుకున్న సాధనాలు. ముందస్తు హెచ్చరికల వలన ఈ సమస్యలను పూర్తిగా పరిష్కరించలేకపోయినా చాలా వరకూ నష్టాన్ని నివారించవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఇప్పటికే మరణాల సంఖ్యను తగ్గించడంలో సహాయపడ్డాయి. ప్రమాదకర వాతావరణం, నీరు లేదా వాతావరణ సంఘటనల వల్ల కలిగే నష్టాలను తగ్గించాయి. వాతావరణ ప్రమాదాలు పెరుగుతున్న కొద్దీ వీటి ఆవశ్యకత పెరుగుతూనే ఉంది. అయితే అత్యాధునిక సాంకేతికతతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేయాలంటే ప్రపంచంలో కొన్ని దేశాలకు మాత్రమే సాధ్యం అవుతుంది. అల్ప ఆదాయ దేశాలు ఈ వ్యవస్థలు నిర్మించుకోలేవు. ఇది ప్రపంచ దేశాల మధ్య అంతరాలను సృష్టిస్తుంది. కానీ అన్ని దేశాల ప్రజల ప్రాణాలను కాపాడటం, జీవనోపాధిని రక్షించడం, సమాజ స్థితిస్థాపకతను బలోపేతం చేయడం లాంటివి అన్నిదేశాల ఉమ్మడిబాధ్యత. దీనికొరకై ఈ అంతరాలను తగ్గించడం లేదా మూసివేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందువలన ఏడాది ఇతివృత్తంగా "ముందస్తు హెచ్చరిక అంతరాన్ని కలిసి మూసివేయడం"గా తీసుకోవడం జరిగింది. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను పెంపొందించడంలో ప్రపంచ సహకార ప్రాముఖ్యతను ఈ థీమ్ నొక్కి చెబుతుంది. ముందస్తు హెచ్చరిక అంతరాన్ని కలిసి తగ్గించడం ద్వారా, మనం సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే ప్రపంచాన్ని నిర్మించగలము. బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ప్రపంచ స్థితి ( గ్లోబల్ స్టేటస్ ఆఫ్ మల్టీ హజార్డ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్ ఎంహెచ్ఇడబ్ల్యూఎస్) 2024 నివేదిక ప్రకారం 2015 నుండి ప్రపంచం అత్యధిక స్థాయిలో ముందస్తు హెచ్చరిక కవరేజీని నివేదించింది. తక్కువ సమగ్రమైన ఎంహెచ్ఇడబ్ల్యూఎస్ ఉన్న దేశాలు విపత్తు సంబంధిత మరణాల నిష్పత్తిని కలిగి ఉన్నాయని, ఇది గణనీయమైన నుండి సమగ్ర కవరేజ్ ఉన్న దేశాల కంటే దాదాపు ఆరు రెట్లు ఎక్కువగా ఉందని, దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ విపత్తు ప్రభావిత వ్యక్తులను కలిగి ఉన్నాయని నివేదించింది. 2024నాటికి 108 దేశాలు బహుళ ప్రమాదముందస్తు హెచ్చరిక వ్యవస్థలకు కొంత సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపాయి. ఇది 2015లో 52 దేశాల కంటే రెట్టింపు కంటే ఎక్కువ. అందరికీ ముందస్తు హెచ్చరికలు అనేది 2027 చివరి నాటికి ప్రజల్ ప్రాణాలను రక్షించే ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా భూమిపై ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రమాదకరమైన వాతావరణం, నీరు లేదా వాతావరణ సంఘటనల నుండి రక్షించేలా చేయాలని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అందరికీ ముందస్తు హెచ్చరికల వ్యవస్థ అందుబాటులోనికి తేవడానికి నాలుగు విషయాలు ప్రధానమైనవి. అవి ఒకటి విపత్తు ప్రమాద పరిజ్ఞానం కలిగి ఉండాలి. రెండు ప్రమాదాల గుర్తింపు, పరిశీలనలు, పర్యవేక్షణ, విశ్లేషణ అంచనా వేయగలగాలి. మూడు హెచ్చరిక సమాచారాన్ని వ్యాప్తి చేయగలగాలి. నాలుగు ప్రతిస్పందించడానికి సంసిద్ధత కలిగి ఉండాలి. అయితే అంచనా సామర్థ్యాలు గణనీయంగా అభివృద్ధి చెందినప్పటికీ, పరిశీలన నెట్‌వర్క్‌లు, అంచనా ఖచ్చితత్వం, అధికనాణ్యత వాతావరణ, జలసంబంధమైన డేటాను పొందడంలో అంతరాలు అలాగే ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో జాతీయ వాతావరణ జల సంబంధమైన సేవలను బలోపేతం చేయడం వాతావరణ అనుకూలతకు మాత్రమే కాదు, ఇది ప్రపంచ స్థితిస్థాపకత, భద్రత ఆర్థిక స్థిరత్వానికి కూడా అవసరం. అన్ని దేశాలలో వాతావరణ సంబంధిత ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలకు స్థితిస్థాపకత, అనుకూల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం వాతావరణ మార్పు చర్యలను జాతీయ విధానాలు, వ్యూహాలు, ప్రణాళికలలో సమగ్రపరచడం, వాతావరణ మార్పుల తగ్గింపు, అనుసరణ, ప్రభావ తగ్గింపు ముందస్తు హెచ్చరికపై విద్య, అవగాహన పెంచడం, మానవ సంస్థాగత సామర్థ్యాన్ని మెరుగుపరచడం చేయాలనియుయన్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో పదమూడవది తెలుపుతుంది. 2030 కల్లా ఇవి సాధించాల్సిన అవసరం ప్రపంచ దేశాల అన్నింటి మీద ఉంది. ●

# నేటితరానికి ధర్మబిక్షం స్ఫూర్తికావాలి

బొమ్మగాని నాగభూషణం

ఒక పార్టీ బిఫారమ్స్ గెలిచిన ప్రజాప్రతినిధి రేపు ఏ పార్టీలో ఉంటాడో తెలియని రోజులు, అధికారంలో ఉంటే ఒక రకంగా అధికారం కోల్పోతే మరో రకం మాట్లాడే నేతలే మనకు నిత్యం దర్శనమిస్తుంటారు. నేటి రాజకీయ వ్యవస్థ కప్పలతడ్కెడ రాజకీయాలతో కుప్పకూలిపోతున్న దశలో నిజాయితీ. రాజకీయాలకు ప్రతినిధులుగా ఉన్న త్యాగధనులు ఎవరైనా ఉన్నారంటే వారే ధర్మబిక్షం. ప్రజాప్రతి నిధులుగా కొనసాగిన నాటితరం నేతల జీవిత చరిత్రలను నేటి తరానికి తెలియజెయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అటువంటి త్యాగమూర్తులలో ఒకరైన ధర్మబిక్షం 14వ వర్ధంతి సందర్భంగా స్మరించుకుందాం. 1930లోనే సూర్యాపేట మిడిల్ స్కూల్ విద్యార్థిగా బిక్షం అనే ఒక సామాన్య గీతకార్మిక కుటుంబం నుంచి వచ్చిన బొమ్మ గాని గోపమ్మ, ముత్తి లింగయ్య దంపతుల కుమారుడు నిజామ్ నవాబు జన్మదినోత్సవాలను పాఠశాలలో జరుపుటకు హెడ్మాష్టర్ ఖరీముల్లా ఖాన్ ఇచ్చిన ఫర్మానాను ధిక్కరించడమే కాదు నిరసనతో బహిష్కరించి సంస్థానంలో సంచలనానికి దారి తీసిన ఘనుడాయన. 1938లో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆరంభమై అగ్నికణంలా ఎగిసిన వందేమాతర ఉద్యమానికి నల్లగొండ హైస్కూలు విద్యార్థిగా నాయకత్వం వహించినందుకు బడినుండి బహిష్కరించారు. ఇలాంటి చదువులను తానే బహిష్కరిస్తున్నానంటూ తిరిగి సూర్య పేటకు చేరి ఆర్యసమాజ ఉద్యమాన్ని అందుకొన్న సమాజ సేవకుడు బిక్షం.పేదరికంతోనో దూరభారం వలననో చదువు కోలేని విద్యార్థులకోసం హైదరాబాద్ రెడ్డి హాస్టల్ స్ఫూర్తిగా సూర్యాపేటలో హాస్టల్ నెలకొల్పి పేద బడుగులకే కాదు ఉప్పునూతల పురుషోత్తమ రెడ్డి, మందడి ప్రభాకర్ రెడ్డి (సినీ యాక్టర్) వెదిరె రామ్మోహన్ రెడ్డి, కట్టా చినవెంకట్ రెడ్డి మల్లు వెంకట నర్సింహ్మారెడ్డి వంటి ఉన్నత వర్గాల వారికి హరిజన వాడలో మహాత్మాగాంధీ స్ఫూర్తితో రాత్రి వయోజన కేంద్రాలను నిర్వహించి ఎడ్ల గోపయ్య మాజీ ఎం.ఎల్.ఎ తదితరులనెందరినో అక్షరాస్యులుగా, రాజకీయ చైతన్యవంతులుగా మలిచిన విద్యావేత్త బిక్షం. ఒక చేతితో దాన మడిగి, రెండో చేతితో విద్యార్థుల విద్యకోసం ధర్మం చేసిన బిక్షం కేవలం బిక్షం కాదని అతడు ధర్మబిక్షం అని సూర్యా పేటలో బిక్షం స్థాపించిన వసతిగృహం వార్షికోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాటి హైదరాబాద్ నగర కొత్వాల్ రాజబహదూర్ వెంకట రామిరెడ్డి ఇచ్చిన ధర్మ బిరుదుతో తల్లిదండ్రులు పెట్టిన పేరు బిక్షం కాస్తా నాట నుండి ధర్మబిక్షంగా మారింది. రష్యా విప్లవ ప్రభావాలు, దేశంలో స్వాతంత్ర పోరాటాలు అన్నింటికంటే ముఖ్యంగా రష్యా విప్లవ రచయిత మక్సింగోర్కి రచించిన



ధర్మబిక్షం

నవల తాను కమ్యూనిష్టుగా మారడానికి దోహదం చేసిందంటారు ధర్మబిక్షం. నల్లగొండ జిల్లాలో తొలి కమ్యూనిష్టు సెల్ను ఏర్పాటు చేసిన ఘనత కూడా ధర్మబిక్షానికే దక్కుతుంది. నల్లగొండ జిల్లాలో ఆయన ముద్రలేని కార్మిక, ఉద్యోగ సంఘాలు లేవు అంటే అతిశయోక్తికాదేమో, నాగార్జునసాగర్ డ్యామ్ నిర్మాణం జాతికి గర్వ కారణమే అయితే డ్యామ్ నిర్మాణంలో పాలుపంచుకున్న కార్మికుల హక్కులు కూడా ముఖ్యమేనంటూ వారి పక్షాన సంఘంపెట్టి పోరాడిన కార్మికనేత ధర్మబిక్షం. మూడుసార్లు ఎం.ఎల్.ఏగా గెలిచిన సాదాసీదాగా ఆఫీసులకైనా. అసెంబ్లీకైనా రిక్షాపైనే ప్రయాణం చేసిన సామాన్యప్రజల ప్రతినిధి ధర్మబిక్షం మొదటిసారి పార్లమెంట్‌కు పోటీలో దిగుతూ నేను ధనవంతున్ని కాదు నన్ను గెలిపించుకోవాలంటే మీరే నాకు ఓటు వేయాలి నా ప్రచారానికి, నామినేషన్కు నోటు మీరే ఇవ్వాలి అని ఆయన ఎన్నికల ప్రచారంలో చేసిన విజ్ఞప్తికి స్పందించి అప్పటిక ప్పుడు ప్రజలు నామినేషన్కు సరిపడ డబ్బును విరాళం ఇచ్చారు. ఓట్లువేసి అత్యధిక మెజారిటీతో ధర్మబిక్షాన్ని గెలిపించుకున్నారు. రెండవ పర్యాయం నల్లగొండ లోక్‌సభ బరిలో 480 మంది అభ్య ర్థులు పోటీచేయగా న్యూస్ పేపరంతటి బ్యాలెట్ పత్రంలో ధర్మబిక్షం ఎన్నికల గుర్తు కంకి కొడవలిని గుర్తించి ఓటువేసి ప్రజలు ఆయనను 76వేల ఓట్ల మెజారిటీతో గెలిపించారు. ఇది ధర్మబిక్షం పట్ల ప్రజల ప్రేమను చిహ్నమే కాదు భారత ఎన్నికల చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచి పోతుంది. ప్రజల కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో ఐదున్నర సంవత్సరాలు జైలు జీవితం గడుపుతూనే చెంచెల్‌గూడ జైల్ ఔరంగాబాద్ జైళ్లలో ఒకవైపు సంస్థానంలో సాయుధ పోరాటానికి మద్దతుగా, మరోవైపు జైలులో మగ్గుతున్న రాజకీయ ఖైదీల హక్కుల కోసం పోరాటాలు చేసిన నేత బొమ్మగాని ధర్మబిక్షం, పోలీసుల టార్చర్లను చీకటి జైలు గది నిర్బంధాలను చిరునవ్వుతో భరించిన త్యాగశీలి ప్రముఖ కమ్యూనిష్టు నేత ధర్మబిక్షం, స్వాతంత్ర ఉద్యమానికి మద్దతుగా నూలు వడికి, విదేశీవస్తువుల బహిష్కరించి గ్రంథాలయోద్యమాలను నడిపిన స్వాతంత్ర పోరాట సిపాసి ధర్మబిక్షం. భారత దేశానికి స్వాతంత్రం సిద్ధించిన రోజున కూడా ఆయన జైలు గోడల నడుమ రాజకీయ ఖైదీగా జైలు జీవితం అనుభవించారు ధర్మబిక్షం. భారత ప్రభుత్వం ఆయనను స్వాతంత్ర్య సమరయోధునిగా గుర్తించి తామ్రపత్రంతో సన్మానించింది. ఆయన సేవలను, ఆయన ఆదర్శాలను, పార్లమెంట్ సభ్యుల బృందం కలిసినప్పుడు ప్రస్తావించిన నాటి ప్రధాని పి.వి.నర్సింహ్మారావు ధర్మబిక్షం స్వార్థమెరుగని నాయకుడు అని, ప్రజల కోసమే తప్ప తన కోసం ఏనాడు సిఫారసులు చేయమని కోరని నిస్వార్థ రాజకీయ నాయకుడని ప్రసంసించడం ఈసందర్భంగా గుర్తుచేసుకోవడం సముచితము. ధర్మబిక్షం వంటి నాయకుని స్ఫూర్తి నిరంతరం ప్రజలకు అందాలంటే ఆయన కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై నెలకొల్పడం, ఆయన జీవిత చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశంగా బోధించడం. వారి జయంతి, వర్ధంతులను ప్రభుత్వం నిర్వహించడం వంటి కనీస బాధ్యతలు నేటి ప్రభుత్వాలు గుర్తిస్తే సమాజానికి మేలు జరుగుతుంది. ●

# కొకైన్‌తో పట్టుబడిన నైజీరియన్



కొకైన్‌తో పట్టుబడిన నైజీరియన్

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాత వార్త:** స్టూడెంట్ వీసాతో భారత్‌కు వచ్చి వీసా గడువు ముగిసిన తరవాత అక్రమంగా భారత్‌లో వుంటూ డ్రగ్స్ దందాలు సాగిస్తున్న ఓ నైజీరియన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి ఏడు గ్రాముల కొకైన్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర మంగళవారం మీడియాకు వెల్లడించారు. నైజీరియాలోని ఎనుగు ప్రాంతానికి చెందిన గ్యుడ్‌క్యు గాడ్విన్ ఇఫెనిల్ ఊరఫ్ గాడ్విన్ (34) 2015లో స్టూడెంట్ వీసాపై భారతకు వచ్చి ఎపిలోని కాకినాడలో ఫార్మసీ కాలేజీలో చేరాడు. ఇతని వీసా గడువు 2016లో ముగియగా దానిని పొడిగించుకోకుండా అక్రమంగా భారత్‌లో ఉంటూ తనే దేశానికి చెందిన డ్రగ్స్ స్మగ్లర్లతో దోస్తీ చేసి, వారితో కలిసి మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ చేయసాగాడు. 2022లో ధూల్‌పేట్‌లో ఆ బ్కారీ పోలీసులు ఇతన్ని కొకైన్‌తో పట్టుకోగా ఆ కేసులో అరెస్టయి బెయిలుపై విడుదలైన గాడ్విన్ తన మకాంను ముంబాయిలోని కాగరకు మార్చాడు. అక్కడి నుంచి దేశ వ్యాప్తంగా పలు నగరాలలో తనకున్న పరిచయాలతో కొకైన్ సహా ఇతర మాదకద్రవ్యాలను అమ్మసాగాడు. కాగా ఇతని గురించి సమాచారం అందుకున్న సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి నిఘా వుంచగా కాచిగూడ వద్ద పట్టుబడ్డాడు. ముంబాయి నుంచి ఏడు గ్రాముల కొకైన్‌ను కాచిగూడలో తనకు తెలిసిన వ్యక్తికి ఇచ్చేందుకు వచ్చిన గాడ్విన్ దొరికిపోయాడు. నిందితుడి వద్ద నుంచి కొకైన్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. పట్టుబడ్డ నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం కాచిగూడ పోలీసులకు అప్పగించారు.

# ఛత్రపతి శివాజీ, శంభాజీలపై అనుచిత వ్యాఖ్యలు

## మహారాష్ట్ర జర్నలిస్టు ప్రశాంత్ కోర్టక్కర్ హైదరాబాద్‌లో అరెస్టు

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** ఛత్రపతి శివాజీ, ఆయన తనయుడు శంభాజీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు నాగ్‌పూర్‌కు చెందిన చరిత్రకారుడు ఇంద్రజిత్ సావంత్‌ను బెదిరించిన కేసులో నిందితుడుగా వున్న మహారాష్ట్రకు చెందిన జర్నలిస్టు ప్రశాంత్ కోర్టక్కర్‌ను హైదరాబాద్‌లో ఇక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఐదు రోజులుగా కోర్టక్కర్ కోసం కొల్హాపూర్ పోలీసులు గాలిస్తుండగా అతను హైదరాబాద్‌లో వున్న విషయం తెలుసుకుని నగర పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హైదరాబాద్ పోలీసులు కోర్టక్కర్‌ను అదుపులోకి తీసుకుని, వెంటనే దీనిపై కొల్హాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. కొల్హాపూర్ పోలీసులు హుటాహుటిన హైదరాబాదుకు వచ్చి కోర్టక్కర్‌ను తమ వెంట తీసుకువెళ్లారు. కోర్టక్కర్‌ను అరెస్టు చేశామని, అతన్ని కోర్టులో హాజరు పరుస్తామని కొల్హాపూర్ జిల్లా ఎస్‌పి మహేంద్ర పండిట్ మీడియాకు తెలిపారు. కోర్టక్కర్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా వుండడంతో అతనిపై కొల్హాపూర్‌లోని జూనా రజ్వాడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యిందని దీనిపై విచారిస్తున్నామని ఆయన తెలిపారు.

# క్రికెట్ బెట్టింగ్‌తో యువకుడు బలి

## గౌడవెల్లిలో రైలు కిందపడి ఆత్మహత్య

**మేడ్చల్, మార్చి 2, ప్రభాతవార్త:** క్రికెట్ బెట్టింగ్ మోజులో ఓ యువకుడు అప్పుల పాలై చివరకు ప్రాణాలు తీసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్ల పోచంపల్లికి చెందిన సోమేశ్ (29) మూడు రోజుల క్రితం క్రికెట్ బెట్టింగ్ ఆడి సుమారు రూ. 2 లక్షలు వరకు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో అతను తీవ్ర మనోవేదనకు గురై సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి పోయాడు. అతని పరిస్థితి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు సోమేశ్‌కు ఫోన్ చేసి ఇంటికి రమ్మని బ్రతిమిలాడారు. కాని నిరాశతో ఉన్న అతను తాను డబ్బుల కోసం కాదని, తాను మనస్తాపానికి గురయ్యానని, తాను డబ్బు సంపాదన కోసం ఎన్ని సార్లు క్రికెట్ ఆటలో బెట్టింగ్ చేసినా తనకు ఎలాంటి లాభం చేకూరకపోగా అప్పుల పాలయ్యానని స్నేహితులతో చెప్పాడు. ఇక తాను బ్రతకడానికి ఇష్టపడటం లేదని, చనిపోవడమే తన శరణమని వారికి తను గోడు తెలుపుకున్నాడు. దీంతో అతని మిత్రులు చావే అన్నింటికి పరిష్కారం కాదని ఏదైనా బ్రతికుండి సాధించుకోవాలని అతనికి చెప్పినా వినకుండా రాత్రి ఇంటికి రాని అతను మంగళవారం ఉదయం గౌడవెల్లి గ్రామ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌లో పల్లాని జీవితాలు పాడు చేసుకోవద్దని పక్క పోలీసులు అప్రమత్తం చేస్తున్న క్రమంలో క్రికెట్ బెట్టింగ్‌తో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం సంచలనం మారింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతదేహాన్ని నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సోమేశ్ (ఫైల్)

# రాజీవ్ యువ వికాసం పథకంలో రేషన్‌కార్డ్ నిబంధనను తొలగించాలి

## ప్రభుత్వానికి ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాస పథకంలో రేషన్ కార్డు నిబంధనను తొలగించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. రాజీవ్ యువ వికాస పథకంకు దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డు తప్పనిసరని ప్రభుత్వం ప్రకటించిందని.. కానీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు రేషన్ కార్డులు జారీ చేయలేదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. గత 11 సంవత్సరాలుగా యువకులకు రేషన్ కార్డులో పేరు కూడా లేదని, ఇలాంటి తరుణంలో యువత ఎలా రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తులు చేసుకుంటారని ప్రశ్నించారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే చాలా తక్కువ మందికి దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుందని... రేషన్ కార్డు లేని నిరుద్యోగ యువకుల గురించి ప్రభుత్వం స్పష్టం వైఖరి చెప్పాలన్నారు. రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తులు రేషన్ కార్డులు లేని వారు కూడా దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ది దారులు, రాజీవ్ యువ వికాస పథకంకు దరఖాస్తు చేసుకోవడానికి మీ సేవ కేంద్రాలకు వెళ్తే, ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో గత ప్రభుత్వంలో దరఖాస్తు మూలంగా రిజెక్ట్ అవుతున్నాయన్నారు. వాస్తవానికి గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి నేటికీ లబ్ది చేకూరలేదన్నారు. కేవలం పాలకులు మాటల గారడీతో కాలయాపన చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. కేటాయింపులు వేరు... నిధుల మంజూరు వేరు అనేలా వ్యవహరించిన పాలకుల తీరు సరి కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో యువత పాత్ర, త్యాగాలు మరువలేనివని.. తెలంగాణ సాధించుకున్న తరువాత వారి పట్ల గత ప్రభుత్వం .. నది దాటే వరకు ఓడ మల్లయ్య, దాటిన తర్వాత బోడ మల్లయ్య అనే విధంగా ప్రవర్తించిందని.. ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలాగా యువతను మోసం చేసే కాంగ్రెస్ అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రేషన్ కార్డు లేకున్నా రాజీవ్ యువ వికాస్ పథక దరఖాస్తుకు అనుమతించాలని వారు డిమాండ్ చేశారు.

# శాతవాహన వర్సిటీకి ఇంజినీరింగ్, లా కాలేజీల మంజూరు

## వచ్చే యేడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభం

## సర్కారుకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీతోపాటు, లా కాలేజీ రాబోతున్నాయి. కరీంనగర్‌లో కొనసాగుతున్న శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీతోపాటు, లా కాలేజీని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా లా కాలేజీని మంజూరు చేస్తూ జీవో నంబర్ 18ని, కొత్త ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేస్తూ జీవో నంబర్ 19ని జారీ చేశారు. బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఫలితంగా హుస్నాబాద్‌కి శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి మంజూరు చేస్తూ జీవో నెంబర్ 19 ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాతవాహన యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కాలేజీతోపాటు, లా కాలేజి మంజూరు చేయడానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసి శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. శాతవాహన యూనివర్సిటీకి లా కాలేజి మంజూరు చేస్తూ జీవో నెం 18 జారీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘ నిరీక్షణ తరువాత శాతవాహన యూనివర్సిటీకి ఇంజనీరింగ్, లా కాలేజి మంజూరు కావడం పట్ల హుస్నాబాద్, కరీంనగర్ ప్రజలు విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. పెద్దపల్లి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి మేరకు శాతవాహన యూనివర్సిటీకి హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజి, లా కాలేజి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం 2025-2026 విద్యా సంవత్సరం నుండి హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ స్థాపనకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతి ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. బిటెక్(సిఎస్ఇ), ఆర్టిఫిషియల్‌ఇంటెలిజెన్స్,(ఐటి), (ఈసిఈ) ప్రతి ప్రోగ్రామ్‌లో 60మంది విద్యార్థులకు అడ్మిషన్లను ఇవ్వనున్నారు. హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, శాతవాహన వర్సిటీ నిర్మాణానికి రూ.44.12 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం 2025-2026 విద్యా సంవత్సరం నుండి కాలేజ్ ఆఫ్ లా ఏర్పాటుకి అడ్మినిస్ట్రేటివ్ అనుమతి ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో సంవత్సరం 60 సీట్ల చొప్పున 120 సీట్లలో అడ్మిషన్లు తీసుకోనున్నారు. శాతవాహన యూనివర్సిటీలో లా కాలేజికి రూ. 22.96 కోట్లు మంజూరు చేశారు.

# బిజెపి మహిళా మోర్చా అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం



**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని కోరుతూ బిజెపి మహిళా మోర్చా మంగళవారం నాడు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. ఓవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో బిజెపి మహిళా మోర్చా నాయకులు పెద్ద సంఖ్యలో ఒక్కసారిగా గన్ పార్క్ నుంచి అసెంబ్లీ వైపు దూసుకు వచ్చారు. అయితే బిజెపి మహిళా మోర్చా నిర్వహించిన అసెంబ్లీ ముట్టడిపై పోలీసులకు ముందుగానే సమాచారం వుండడంతో శాసనసభ వద్ద మహిళా పోలీసు సిబ్బందితో అదనపు బలగాలను మొహరించారు. అయితే పోలీసు బందోబస్తును దాటుకుని బిజెపి మహిళా మోర్చాకార్యకర్తలు అసెంబ్లీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు బలవంతంగా అడ్డుకుని సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ముట్టడికి నాయకత్వం వహించిన అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని దుయ్యబట్టారు. బడ్జెట్‌లో మహిళలకు పూర్తిగా అన్యాయం చేసిందని, ఎలాంటి కేటాయింపులు చేయలేదని ఆమె ఆరోపించారు. మహిళలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారో...? రేవంత్ రెడ్డి సర్కారు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. దీంతో పాటు తులం బంగారం, నెలకు 2500 రూపాయల నగదు బదలాయింపు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు . ఓవైపు రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నా వాటిని ప్రభుత్వం అరికట్టలేక పోతోందని ఆమె ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో వెంటనే మహిళలకు తగిన కేటాయింపులు చేయాలని, దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని ఆమె కోరారు.

# విద్యుత్ వినియోగంలో 59 శాతం పెరుగుదల

## క్షేత్రస్థాయిలో పర్యటించిన ఎస్పీడిసిఎల్ సిఎండి ఫరూఖీ

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అనూహ్యం గా కరెంటు డిమాండ్ పెరిగింది. వివిధ జిల్లాల్లో 12 నుండి 59 .36 శాతం విద్యుత్ వినియోగంలో పెరుగుదల చోటు చేసుకుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం క్షేత్ర స్థాయిలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖి విస్తృతంగా పర్యటించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి ఈ యాసంగి సీజన్‌లో కరెంటు సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు తెలిపారు. గతంతో పోల్చుకుంటే విద్యుత్ అంతరాయాల్లో సైతం భారీ క్షీణత నమోదైందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది, ఇది రాష్ట్రంలో ఆర్థిక వృద్ధి, పారిశ్రామిక విస్తరణ మరియు వ్యవసాయ రంగంలో పెరిగిన కార్యకలాపాలకు సూచనగా నిలుస్తోందన్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4:39 గంటలకు, తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గరిష్ట స్థాయి 17,162 మెగావాట్లకు చేరుకుందని వెల్లడించారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యధికమని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో గరిష్ట డిమాండ్ మార్చి 8న 15,623 మెగావాట్లుగా ఉందన్నారు. అయితే ఈ సంవత్సరం ఈ రికార్డు మరింత మెరుగై, రోజువారీ విద్యుత్ వినియోగం కూడా 331.161 మిలియన్ యూనిట్లకు చేరిందని తెలిపారు. గత మూడు యాసంగి సీజన్లలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగినట్లు వివరించారు.

2024-25తో పోల్చుకుంటే పలు జిల్లాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుదల చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లో 12 నుండి 59.36 శాతం విద్యుత్ వినియోగంలో పెరుగుదల నమోదైందన్నారు. పెరిగిన విద్యుత్ వినియోగం. ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలు వేసవి కాలంలో పెరిగిన వినియోగం, వ్యవసాయ రంగంలో 24 గంటలూ ఉచిత విద్యుత్ సరఫరా, పారిశ్రామిక మరియు ఐటీ రంగాలలో వృద్ధి, అలాగే పట్టణ ప్రాంతాల్లో గీజర్లు, ఎయిర్ కండిషనర్ల వంటి విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరగడం. దీనికి తోడు విద్యుత్ సంస్థల్లో పనిచేసే ప్రతి సిబ్బంది ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు అనునిత్యం అప్రమత్తంగా వుంటూ, అహర్నిశలు కృషి చేయడం కూడా ఒక కారణమని ఫరూఖి తెలిపారు. తాము తీసుకున్న చర్యల కారణంగా బ్రేక్ డౌన్స్, విద్యుత్ అంతరాయాలు వ్యవధి కూడా బాగా క్షీణించిందని తెలియచేశారు. గతేడాదితో పోల్చుకుంటే విద్యుత్ అంతరాయాలు బ్రేక్ డౌన్స్ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ పరిధిలో 24.01 తగ్గగా, రాష్ట్రము మొత్తం మీద 23.64 శాతానికి తగ్గుదల చోటు చేసుకుందన్నారు. గతంతో పోల్చుకుంటే విద్యుత్ అంతరాయం పునరుద్ధరించే సమయంలో కూడా బాగా మార్పు వచ్చింది. గతంలో గాలి వాన వలన విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు కొన్ని ప్రాంతాల్లో పునరుద్ధరించడానికి గంటల కొద్దీ సమయం పట్టేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యాలు విద్యుత్ అంతరాయాలు, బ్రేక్ డౌన్స్ పునరుద్ధరణ

# ఇద్దరు మహిళలు దుర్మరణం

# పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

**టేకుమట్ల, మార్చి 25, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ (టి) శివార్లో అతివేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్ (టి) గ్రామానికి చెందిన మోకిడి పూలమ్మ (45) మోకిడి సంధ్య(30) అనే మహిళలు వరి పొలంలో కల్తులు చేరుతున్న క్రమంలో చిట్యాల నుంచి టేకుమట్ల వైపు పత్తి గింజల లోడుతో వస్తున్న లారీ టీఎస్ 05 యు బి 7 999 అనే నెంబర్ గల లారీ అతివేగంగా వస్తు పొలంలో పనిచేస్తున్న కూలీల పైకి దూసుకెళ్లిందని, పత్తి బస్తాల లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి పొలంలో పడటంతో పొలంలో పనిచేస్తున్న మహిళలపై పత్తి బస్తాలు పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కాగా ఇద్దరు మహిళలు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో రామకృష్ణాపూర్( టి ) గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# 30న హుజూర్‌నగర్‌లో సిఎం రేవంత్ పర్యటన ఖరారు

## భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

## సన్న బియ్యం పంపిణీ ప్రారంభానికి రంగం సిద్ధం

## సభాస్థలిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ


సభ స్థలాన్ని ఏర్పాట్లను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంకఅలాకు వివరిస్తున్న జిల్లా కలెక్టర్

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), మార్చి 25, ప్రభాతవార్త :** సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణానికి ఈనెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రానున్నారు. ఉగాది పండుగ రోజు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేందుకు అందరూ సిద్ధం కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. దీంతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నర్సింహాతో కలిసి మంగళవారం హుజూర్నగర్ పట్టణంలోని సభ స్థల పరిశీలన చేశారు. కలెక్టర్, ఎస్పీ ఇద్దరూ ఇతర వివిధ శాఖల జిల్లా ఉన్నత అధికారులతో పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో ఉండి ముఖ్యమంత్రి కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. సభ జరిగే ప్రాంగణం, హెలిప్యాడ్ దిగే స్థలాన్ని వారు పరిశీలించారు. హెలిపాడ్ దిగే వద్ద అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి ఆ లైన్ ద్వారా సరఫరా అయ్యే విద్యుత్తును వేరే మార్గం ద్వారా సరపరా చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిపాడ్ నుంచి సభా వేదిక వరకు అప్రోచ్ రోడ్డును వేయాలని దీంతోపాటు అక్కడ బారికేడ్లను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. వీటితో పాటు కార్యక్ర మానికి వచ్చి వీఐపీలు అధికారుల పార్కింగ్ ల కోసం స్థలాన్ని కూడా పరిశీలించారు. ఎలిఫెంట్ అప్రోచ్ రోడ్లను ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సభకు భారీ సంఖ్యలో జన సమీకరణ జరిగి అవకాశం ఉండ టంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పలుచోట్ల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. పార్కింగ్ స్థలాలకు వెళ్లే రోడ్లలో గుంతలు పూడ్చి చదువు చేయాలని దారి పొడవున కంపచెట్లు లేకుండా తొలగించాలని, ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పార్కింగ్ స్థలంలో రెండువైపులా దారులు ఉండే విధంగా తయారు చేయాలని మున్సిపల్ కమిషనర్ కి సూచించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలిప్యాడ్ వద్ద పార్కింగ్, వీఐపీ లకు ప్రోటోకాల్, సభా వేదిక వద్ద తాసిల్దారులకు ఇన్చార్జి విధులు కేటాయించినట్లు తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని వాటిని పర్య వేక్షించాలని ఆయన ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల కోసం చల్లని త్రాగునీరు మజ్జిగ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి సెక్టార్ కు ఎంపీడీవో, ఎంపీ ఓ లు ఇన్చార్జిగా ఉంటారని వారికి సహాయకులుగా పంచాయతీ సెక్రెటరీలు ఉంటారని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బంది సహాయంతో ప్రజలకి త్రాగునీరు మజ్జిగ అందజేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమంలో అధికారులందరూ ఐడి కార్డులు ధరించాలని, సమాచార శాఖ ద్వారా తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలపై కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మధ్యాహ్నం అనంతరం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రవరసరఫరాల శాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంక అలా హుజూర్నగర్ పట్టణానికి వచ్చారు. జిల్లా కలెక్టర్ జాయింట్ సెక్రెటరీ ప్రియాంక అలా కు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, ఆర్ అండ్ బి డి ఇ రమేష్, సిఐ చరమందరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ఎమ్మార్వో నాగార్జున రెడ్డి, పట్టణ ఎస్సై ముత్తయ్య, అన్ని మండలాల కు చెందిన తహసిల్దార్ లు, ఎస్ఐలు, ఎంపీడీవోలు, ఎంపీవో లతో పాటు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# మొత్తానికి సాధించారు..

## అసెంబ్లీ లాబీల్లో వివేక్‌తో మల్లారెడ్డి ఆసక్తికర చర్చ

*ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 25:* తెలంగాణ అసెంబ్లీ లాబీల్లో ఆసక్తికర చర్చ సాగింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య సరదా సంభాషణ కొనసాగింది.

మల్లారెడ్డి: నమస్తే మంత్రిగారు

వివేక్: థాంక్స్ మల్లన్న

మల్లారెడ్డి: వివేక్.. మొత్తానికి సాధించారు. సిఎం, డిప్యూటీ సిఎం కంటే ముందే ఢిల్లీ వెళ్లి వచ్చారు.

వివేక్: లేదు. నేను వేరే పనిమీద వెళ్లాను.

మల్లారెడ్డి: రాష్ట్రంలో వివేక్, కోమటిరెడ్డి కుటుంబాల హడావుడి మాత్రమే నడుస్తోంది.

వివేక్: బిఆర్ఎస్ హయాంలో కెసిఆర్, మల్లారెడ్డి కుటుంబాలది నడిచింది కదా (నవ్వుతూ).

మల్లారెడ్డి: మేము అధికారం కోల్పోయాం, ఇప్పుడు మాదేం నడవడంలేదు.

# ఇజ్రాయిల్ హత్య, ఎంఎంటిఎస్‌లో అత్యాచారయత్నాన్ని ఖండిస్తున్నాం

## బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంతోపాటు, రాష్ట్రంలో దారుణాలు, హత్యలు కొనసాగుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాదు నడిబొడ్డున దస్తగిరి అనే కామాంధుడు అత్యాచారానికి పాల్పడుతున్న నేపథ్యంలో, బాధిత కుటుంబాన్ని కాపాడే ప్రయత్నం చేసిన ఇజ్రాయిల్ అనే న్యాయవాది పట్టపగలే అతి దారుణంగా హత్యకు గురయ్యారని అన్నారు. ఎంఎంటిఎస్ రైలులో ఒంటరిగా ప్రయాణిస్తున్న యువ తిపై మహేష్ అనే మరో కామాంధుడు అత్యాచారయత్నానికి పాల్పడుతుంటే కదిలే రైలు నుండి దూకి తన మాన, ప్రాణాలను కాపాడుకుని తీవ్ర గాయాలతో హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నదని.. ఇలాంటి ఘటనలను రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ ఘటనల్లోని నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. వరుసగా జరుగుతున్న ఘటనలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం తీవ్రంగా విఫలమైందని.. హోం మంత్రిత్వ శాఖ ముఖ్యమంత్రి దగ్గరే ఉన్నప్పటికీ, ఇలాంటి హత్యలు, ఆరాచకాలు, కామాంధుల దౌర్జన్యాలను అరికట్టడంలో పోలీస్ యంత్రాంగం తీవ్రంగా విఫలమవుతుందని.. వాటిని అరికట్టేందుకు ముఖ్యమంత్రి తగ చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

# సంగీత విద్వాంసుడు ఉషాకాంత్ ఇకలేరు

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు, గీత రచయిత ఉషాకాంత్ మంగళవారం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. సాంస్కృతిక రంగంలో ఆయన స్థానం ఎంతో విశిష్టమైనది. బహు ముఖ ప్రజ్ఞాశాలి. సంగీతంలోని అనేక విభాగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. బుధవారం జూబ్లీ హిల్స్ లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు వివరించారు. ఉషాకాంత్ అద్భుతమైన కచేరీలలో సంగీత బ్యాలెట్లు శ్రీ దత్త గాథ, కల్యాణ రామం, గీత గోవిందం, ఆండాళ్ కళ్యాణం, మరియు సప్తచల సంకీర్తనలు ఉన్నాయి. టీటీడీ ప్రాజెక్టు పలికేది భాగవతమాత కలదు, చిలక పలుకులు (తెలుగు నర్సరీ రైమ్స్) ఎన్నో ప్రశంసలు పొందిన మ్యూజికల్ ఆల్బమ్ ఇది.


ఉషాకాంత్ (ఫైల్)

ఆయన ఎన్నో ప్రతి ష్టాత్మక అవార్డులు అందుకున్నారు. వాటిలో ఘంటసాల అవార్డు (2003), శివ గంగ (మ్యూజికల్ బ్యాలెట్), చలోఢిల్లీ (పిల్లల చిత్రం) కోసం జాతీయ అవార్డులు ఉన్నాయి. ఉషాకాంత్‌కు కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ (అపోలో హాస్పిటల్స్‌లో సీనియర్ కన్సల్టెంట్) గాయకుడు సంగీతకర్త కూడా. కోడలు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సుశీల, నృత్యకారిణి, అల్లుడు సుందర్ లక్ష్మణ్, మహతి మ్యూజిక్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్, కూతురు రాధికా లక్ష్మణ్, గాయని, మనవరాలు రోహిణి, ఐటీ కన్సల్టెంట్, నర్తకి, గాయని, మనవడు శ్రీనిగమ్, వైద్యుడు, గాయకుడు.

**దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ**
(తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన - 17/2024-25
కొత్త స్పెసిఫికేషన్ నం.106/24-25 మరియు 104/24-25, ST కేటగిరీ క్రింద రీకాల్. CE/OP/రూరల్ జోన్ ఈ క్రింది విధంగా: వివరాలు, కొత్త స్పెసిఫికేషన్ నం.106/24-25 మరియు 104/24-25, ST కేటగిరీ క్రింద రీకాల్. 1. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం: 26.03.2025 మ.14.00 గం.నుండి. 2. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ & సమయం ఆన్‌లైన్: 08.04.2025 మ.14.00 గం.వరకు. 3. బిడ్ దాఖలు చివరి తేదీ & సమయం: 08.04.2025 మ.14.30 గం.వరకు. 4. DDs/BGs తో హార్డ్ కాపీల కొరకు చివరి తేదీ & సమయం: 09.04.2025 మ.14.00 గం. 5. టెక్నికల్ బిడ్ తెరచు తేదీ & సమయం: 09.04.2025 మ.15.00 గం.వద్ద 6. ప్రైస్ బిడ్ తెరచు తేదీ & సమయం: 15.04.2025 మ.15.00 గం. వద్ద. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org దయచేసి వీక్షించండి. మరియు CE/OP/రూరల్ జోన్/గగన్ విహార్, నాంపల్లి, హైదరాబాద్ యొక్క కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్ నెం.040-29301311.
సం/- చీఫ్ ఇంజనీర్, ఆపరేషన్, రూరల్ జోన్, TGSPDCL, గగన్ విహార్, నాంపల్లి, హైదరాబాద్
DIPR.No.12174-PP/CL/Advt/1/2024-25, తేది: 25.03.2025

**FINKURVE FINANCIAL SERVICES LIMITED**
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202/A, Kamala Mill Compound, Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
**PUBLIC NOTICE**
ఫిన్‌కుర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం 29.03.2025 న 10:00 గంటలకు Finkurve Financial Services Limited లోనిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేయడం H. No. 2-2-66, 2nd Floor, Burmashell Road, Gandhi Chowk, Beside Harsha Hotel, Khammam, Telangana-507003. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో, విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
**KHAMMAM ARVOG F : KHAM-49420.**
For More Details, Contact : Kandula Vijaya Babu, Mob. 9440473167
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

**FINKURVE FINANCIAL SERVICES LIMITED**
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202/A, Kamala Mill Compound, Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
**PUBLIC NOTICE**
ఫిన్‌కుర్వ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం 29.03.2025 న 10:00 గంటలకు Finkurve Financial Services Limited లోనిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేయడం # # H.No 11-2-30,1st Floor, Near Congress Bhavan, Wyra Road, Khammam - 507001. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
**SREE MAHEERA KHAMMAM :**
**SREE-20342, SREE-28152, SREE-98332, SREE-50877, SREE-74738, SREE-55389.**
For More Details, Please Contact : Kakkerla Sukumar : Mob. 9704858037
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

# మహిళలంటే ఎనలేని గౌరవం



**మనసు కష్టపడితే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటా: స్పీకర్ ప్రసాద్‌కుమార్**

**సబ్జెక్టు నుంచి డీవియేట్ కాకపోయినా అవమానించారు: సునీతాలక్ష్మారెడ్డి**

**మిస్‌కమ్యూనికేషన్ జరిగింది.. మిమ్మల్ని కాదు : మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** 'మహిళలంటే తనకు ఎనేలని గౌరవం ఉందన్నారు. తనకు 8 మంది సోదరీ మణులు ఉన్నారని, మహిళలను గౌరవిస్తానని చెప్పారు. మిమ్మల్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు. తాను ఈ సీటు మీద ఉండి తమను అన్నానని అనుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడేటప్పుడు ఇరువైపుల నుంచీ రన్నింగ్ కామెంట్ వస్తున్నది. దీంతో వారు మాట్లాడేది నాకే వినబుద్ధి అవుతలేదు. మీకు వినబడుతున్నదా అని అన్నాను. మిమ్మల్ని ఉద్దేశించి అలా అనలేదు. మీ మనసు కష్టపడితే ఆ వ్యాఖ్యలను విత్‌డ్రా చేసుకుంటున్నాను' స్పీకర్ ప్రసాద్‌కుమార్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీ మొదలు కాగానే బిఆర్ఎస్ సభ్యులు నిలుచొని నిరసన వ్యక్తం చేయసాగారు. దీనితో సునీతా లక్ష్మారెడ్డికి మాట్లాడాలని అవకాశం ఇచ్చారు. "స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయని నర్సాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న మీరు అలా మాట్లాడటం బాధకరమన్నారు. తాను ఏం తప్పు చేశానని, మీకు ఎందుకు అలా వినాలనిపించలేదని స్పీకర్‌ను ప్రశ్నించారు. విషయంపైనే మాట్లాడానుతప్ప ఎక్కడా పరిధి దాటలేదన్నారు. అయినా తనను అలా వినబుద్ధికావడం లేదని ఎలా అంటారన్నారు. తనపై వ్యాఖ్యలను స్పీకర్ ఉపసంహరించుకోవాలన్నారు. శాసన సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుంది సునీతా లక్ష్మారెడ్డి ఆవేదనతో అన్నారు. నిన్న మీరు అన్నటువంటి మాటలు చాలా బాధాకరం. తాను మాట్లాడుతున్న సందర్భంలో సబ్జెక్టునుంచి ఎక్కడా డీవియేట్ కాలేదు. మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై మాట్లాడుతానని ముందే సమాచారం ఇచ్చాను. అవకాశం కోసం సాయంత్రం వరకు నిరీక్షి ంచాను రాత్రి 8 గంటలకు మాట్లాడేందుకు తనకు అవకాశం కల్పించారు. రెండు నిమిషాల్లో పూర్తిచేయాలన్నారు. తాను మాట్లాడుతుండగా నాకే వినబుద్ధి అవడలేదని, మీరంతా ఎలా వింటున్నారో అని మీరు అనడం నాకు చాలా బాధకలిగించింది. ఒక మహిళగా, సీనియర్ సభ్యురాలినైనా తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ మాట్లాడలేదు. ఎందుకంటే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులు అంతా మాట్లాడినప్పటికీ నేను ఏనాడు నా పరిధిదాటలేదు క్రమశిక్షణతో ఒకరితో వేలు పెట్టి చూపించుకునేలా ప్రవర్తించలేదని ఆమెగద్గద స్వరంతో అన్నారు. జీరో అవర్‌లో ఒకటే సబ్జెక్ట్ మాట్లాడాలని, అసభ్య పదజాలం మనం ఉపయోగించకూడదని కొత్తగా వచ్చిన మా సభ్యులకు చెబుతాను వారిని క్రమశిక్షణగా ఉండేలా బోధిస్తాను అని ఆమె అన్నారు. ఒకరికి చెప్పగలిగిన స్థాయిలో ఉన్న తనను మీరు మాట్లాడిన మాటలు చాలా బాధ కలిగించాయి. సబ్జెక్టును మించి ఒక విషయం కూడా బయటకు జరుగలేదు. అలాంటి సమయంలో మీరు మాట్లాడిన మాటలు నాకు బాధ కలిగించాయి. సభలో నిరసనల మధ్య తనకు సరిగా వినపడలేదని, వాకౌట్ చేసి బయటకు వెళ్లిన తర్వాత మా సభ్యులు చెప్పారు. నేను ఎప్పుడూ కూడా ఒకరితో మాటపడలేదు, ఎక్కడున్నా క్రమశిక్షణతో ఉన్నాను. తాను తప్పేంమాట్లాడానో చెప్పండి. నా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడానే తప్ప మరో విషయం కాదు. మీ వ్యాఖ్యలు మంచిగనిపిస్తే రికార్డుల్లో కొనసాగించండి. లేదంటే ఉపసంహరించుకోవాలి. సభాపతిగా మా హక్కులు కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌ది. అధికార పక్షానికి నచ్చకపోతే బాగాలేదని చెప్పాలి. గతంలో కూడా మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారని, అయినప్పటికీ నిలుచుని మౌనంగా నిరసన తెలిపాం.

ఇలాంటివి మరోసారి జరగకూడదని, సభా సంప్రదాయాలకు మంచిదికాదు అని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు లక్ష్మారెడ్డి సూచించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ఈ అంశంపై ప్రశాంతరెడ్డి ప్రసంగిస్తున్నప్పుడు మాట్లాడుతూ సోమవారం రాత్రి జరిగిన సంఘటన రన్నింగ్ కామెంటరీ, అరుపులు ఉండటంతో స్పీకర్ దీనిపై స్పందిస్తే ఒక సభ్యురాలు తనను అన్నట్లు పొరపడ్డారని సభలో అందరు హుందాగా ఉండాలని కోరారు.

# కోనోకార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలి

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 25:** హరితహారంలో భాగంగా పెట్టిన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంత్రులు ఆయా శాఖల పద్దులను ప్రవేశపెట్టారు. వీటిపై శాసనసభలో చర్చ జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ హయాంలో 200 కోట్ల చెట్లను పెట్టామని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా అటవీ ప్రాంతం ఏడు శాతం పెరిగిందని తెలిపారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ.. బిఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో హరితహారంలో భాగంగా 200 కోట్ల మొక్కలు నాటామని చెబుతు న్నారని, అందులో ఆక్సిజన్ పీల్చి కార్బన్‌డైఆక్సైడ్ వదిలే హానికరమైన కోనోకార్పస్ మొక్కలు కూడా ఉన్నాయని తెలిపారు. వాటిమీద కనీసం పిచ్చుకలు కూడా వాలడానికి ఇష్టపడవని చెప్పారు. దీనికి బిఆర్ఎస్ ఎమ్మెల్యే.. అవి కొన్ని మొక్కలు మాత్రమే కలిశాయని, పెరిగిన 7 శాతంలో అవి తక్కువేనని చెప్పారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ.. కొన్ని కాదు.. పెద్దమొత్తంలో అవే ఉన్నాయని, హైవే రోడ్ల వెంట, డివైడర్లపై కూడా అవే ఉన్నాయని చెప్పారు. అలాగే ప్రభుత్వం వాటిని వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని స్పీకర్ సూచించారు.

# అధికారంలో ఉన్నప్పుడు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ గురించి ఆలోచించని బిఆర్ఎస్ : మంత్రి సీతక్క



**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ తీరు ఆత్మస్తుతి పరనింద అన్నట్లుగా ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారంలో ఉన్నంత కాలం ఏనాడే బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ గురించి ఆలోచించని బిఆర్ఎస్ కేవలం ఎన్నకల షెడ్యూల్‌కు మూడు రోజులు ముందు ఈ పథకాన్ని ప్రారంభించి రాజకీయ పరంగా ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించిందని, ఆమె మండి పడ్డారు. మంగళవారం విద్యాశాఖ పద్దుపై చర్చ సందర్భంగా మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యలపై మంత్రి సీతక్క మండిపడ్డారు. పిడికెడు పాఠశాలల్లో ఈ పథకాన్ని ప్రారంభించి ప్రచారం చేసుకున్నారే కాని దీని కోసం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. మూడున్నర కోట్లు పెండింగ్‌లో ఉన్న బిల్లులను మా ప్రభుత్వం వచ్చాకే చెల్లించిందని గుర్తుచేశారు. గత ప్రభుత్వ పాలనలో విద్యా శాఖ దుస్థితి ఎలా ఉందో స్వయంగా కెసిఆర్ మనువడే ప్రపంచానికి చెప్పారని గుర్తు చేశారు. ముక్కు మూసుకుని గౌలిదొడ్డి పాఠశాలను సందర్శించి ఇటువంటి పాఠశాలను ఎక్కడా చూడ లేదని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. పాఠశాలల సంఖ్యను పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న గత ప్రభుత్వం కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆమె విమర్శించారు.

# అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం ఇవ్వాలి : సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, మార్చి 25 ,ప్రభాతవార్త :** అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావను కొనసాగించాలని మాజీ విద్యాశాఖ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఏ సబిత ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె అసెంబ్లీలో విద్యాశాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ.. కొడంగల్ మాత్రమే అల్పా హారం ఇస్తున్నారని తెలిపారు. అదే విధంగా పదోతరగతిలో గ్రేడింగ్ విధానం తొలగిస్తున్నారన్న ఆమె బాసర ట్రిపుల్ ఐటీలో గ్రేడింగ్ విధానంతోనే ప్రవేశాలు జరుగుతున్నట్లు గుర్తు చేశారు.



కస్తూర్బా పాఠశాలలను డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేయాలని, 17 మోడల్ పాఠశాలల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గతంలో రేవంత్‌రెడ్డి చెప్పారని, కాని కేవలం 11 వేల టీచర్ పోస్టులు మాత్రమే భర్తీ చేశారన్న ఆమె మిగతా టీచర్ పోస్టులు ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు.

## మద్యం తాగి వాహనం నడపడం నేరమైతే

# దాన్ని అమ్ముకొని ప్రభుత్వాన్ని నడపడం నేరం కాదా?

## ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా నిలదీత

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** 'మద్యం తాగి వాహనం నడిపితే నేరమైతే మద్యం అమ్ముకొని ప్రభుత్వం నడపడం నేరం కాదా' అని నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. బడ్జెట్ పద్దులపై మాట్లా డుతూ గుజరాత్, బీహార్ రాష్ట్రంలో వలే సంపూర్ణ మద్య పాన నిషేధం విధించాలని కోరారు. మత్తురహిత రాష్ట్రంగా మార్చాలని డ్రగ్స్ గంజాయి మత్తుపదార్థాలు విద్యార్థులకు సులభంగా తెలంగాణలో అందు బాటులోకి వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఖిలా రామాలయాన్ని అభివృద్ధి పరచాలని సూచించారు. ముస్లింలకు హజ్‌యాత్రకు ఎలాగైనే సబ్సిడి ఇస్తున్నారో చార్‌ధామ్, తిరుపతి ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్లే హిందువులకు కూడా నియోజకవర్గానికి వంద మందికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రాత్రిపూట బస చేసేందుకు వీలుగా కుంటాల తదితర పర్యాటక క్షేత్రాలలో వసతులు కల్పించాలని ఆయన సూచించారు. దేవాదాయ శాఖకు వెయ్యికోట్ల బడ్జెట్‌పెట్టాలని అన్నారు. దేవాలయభూములు ఎన్నిక కబ్జాకు గురయ్యాయో లెక్కలు చెప్పాలని కోరారు. తెలంగాణలోని జానపద కళారూపాలు 120 వరకు అంతరించిపోయే ప్రమాదం ఉందనివాటిని కాపాడాలని సూచించారు. ఇటీవల అన్యదేశ మతస్తుల దాడులలో కూలిపోయిన తెలంగాణ లోని గుడులను పునఃనిర్మాణం చేసి గట్టి బందోబస్తు వాటికి ఏర్పాటు చేయాలని ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు.



# వర్గీకరణలో మాలల జనాభాను తగ్గించి చూపారు

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 25, ప్రభాతవార్త:** మాలలకు ఈ నెల 18వ తేదీ చీకటిరోజని, తప్పులతడకగా ఉన్న జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎస్సీ వర్గకరణ చేసి దళితులను విభజించి, రాజ్యాంగం కల్పించిన సమాన, విస్తృత అవకాశాలను అందుకోకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని ఎస్సీల జనాభా 54,32,680గా ఉంటే షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదికలో మూడు గ్రూప్‌లకు కలిపి జనాభాను 52,17,580గా చూపించి మాలల జనాభాను 2,15,100 మందిని తగ్గించి చూపించి మాలలకు అన్యా యం చేశారని ఆయన విమర్శించారు.

మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో జి.చెన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 10యేళ్లు దాటినా ఉమ్మడి రాష్ట్రంలోని 2011 జనాభా లెక్కలు తీసుకోవడంతో మాల లకు తీరని అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, జంగా శ్రీనివాస్, బంగి ఆనందరావు, ఎం.సరళ, ఎం.శ్రీకాంత్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఒయులో ఆంక్షలపై బిఆర్ఎస్ వాయిదా తీర్మానం

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలపై అసెంబ్లీలో చర్చించాలంటూ బిఆర్ఎస్ పార్టీ వాయిదా తీర్మానం ఇవ్వగా.. విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను హరించేలా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల ప్రాథమిక ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ర్యాలీలు, ధర్నాలు నిరసనలపై ఆంక్షలు విధించడంపై శాసన సభలో చర్చించాలని సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు ప్రతిపాదించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు టి.హరీశ్‌రావు, కాలేరు వెంకటేశ్వర్లు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, విజయుడు సంతకం చేసిన వాయిదా తీర్మాణం అభ్యర్థనను తెలంగాణ శాసనసభ కార్యదర్శికి ఇచ్చారు. శాసన సభలో సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలపై వాయిదా తీర్మానం ఏజెన్సీల ద్వారా కాకుండా కార్పొరేషన్ల ద్వారా వేతనాలు చెల్లించాలని వాయిదా తీర్మానం ఇచ్చారు. యేటా ఇంక్రిమెంట్లు, ఉద్యోగ నోటిఫికేషన్‌లో వెయిటేజ్ ఇవ్వాలని పదవీ విరమణ పొందిన సిబ్బందికి రూ.10 లక్షల పరిహారం ఇచ్చి పదవీ విరమణ తర్వాత కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని వాయిదా తీర్మానంలో ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు, మాజీ సర్పంచుల బిల్లుల, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై శాసనసభ బిజెపి పక్షనేత వాయిదా తీర్మానం ఇచ్చారు.

## దొంగే, దొంగ..! దొంగ..! అని అరిస్తే

# తగు రీతిలో సమాధానమిస్తా

## ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త :** 'దొంగే దొంగ..! దొంగ..! అని అరిస్తే ఐ విల్ గివ్ ఫిట్టింగ్ రిప్లే(సరైన సమాధానం నేను ఇస్తా) అంటూ ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశాంతరెడ్డిని హెచ్చరించారు. శాసనసభలో ఎక్సైజ్ ఆదాయం విషయంలో చర్చ సందర్భంగా మాట్లాడుతూ 2014లో తెలం గాణలో తొమ్మిదివేల కోట్ల రూపాయలు అబ్కారీ ఆదాయం ఉండేదని దానిని 43వేలవరకు పెంచింది తొమ్మిదన్నరేళ్ల బిఆర్ఎస్ పాలన కాదా అని జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. తొమ్మిదేళ్లలో 25వేల కోట్లకు ఎక్సైజ్ ఆదాయం 400 శాతం పెరిగిందని ఆయన తెలిపారు. యేటా 40శాతం ఆదాయం పెంచారని దుయ్యబట్టారు. టాక్స్ రేట్లు పెంచి ఆదాయం పెంచారని జూపల్లి గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అక్రమ దందాను ఫామ్‌హౌజ్‌లో నాన్‌డ్యూటీ మందును నియంత్రించడం ద్వారా సిసికెమెరాలతోనిఘా పెంచడంద్వారా వాటిని అరికడుతామని తెలిపారు. లీకేజి తగ్గించి ఆదాయం పెంచుతామని శ్రీధర్‌బాబు చెప్పడంతో ప్రశాంతరెడ్డి వెంటనే లేచి" మా శ్రీధర్‌బాబు చిలుకపలుకులు పలుకుతుండు కానీ ముందుగా బెల్ట్‌షాపులు బంద్‌చేసి మీ టార్గెట్ 50వేలకు పెట్టుకోండని అన్నారు. టూరిజం కేవలం మహబూబ్‌నగర్, ములుగు జిల్లాలకు మాత్రమే పరిమితం చేయవద్దని ప్రశాంత్‌రెడ్డి కోరారు. బ్రాహ్మణ పరిషత్‌ను బలోపేతం చేయాలని సూచించారు. బ్రాహ్మణులు విదేశి విద్యకోసం ఫీజులు రాక అల్లలాడుతున్నారని వారిని ఆదుకోవాలని సూచించారు.



# మాధవి హత్య కేసు దర్యాప్తులో పురోగతి

## పోలీసులకందిన డిఎన్ఎ రిపోర్ట్

## హతురాలి డిఎన్ఎ తల్లి, పిల్లల డిఎన్ఎతో సరిపోలినట్లు నిర్ధారణ



**హైదరాబాద్ (సరూర్ నగర్), మార్చి 25, ప్రభాత వార్త:** తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి భార్య మాధవి దారుణ హత్య కేసులో కీలకమైన పురోగతి లభించింది. నేర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా మృతదేహమే నామరూపాల్లేకుండా అయిన మాధవి హత్యోదంతంలో ముఖ్యమైన డిఎన్ఎ రిపోర్ట్ పోలీసుల చెంతకు చేరింది. హత్య జరిగిందనడానికి బలమైన సాక్ష్యంగా ఉపకరించే ఈ డిఎన్ఎ రిపోర్ట్ నేర రుజువులో కీలకంగా మారనుంది. హత్య జరిగిన ఇంట్లో పోలీసులకు లభ్యమైన టిష్యూస్‌ను దర్యాప్తు చేస్తున్న పోలీసులు డిఎన్ఎ పరీక్షలకు పంపగా హత్యకు గురైన మాధవి డిఎన్ఎ ఆమె తల్లి, పిల్లల డిఎన్ఎతో సరిపోయినట్లు రిపోర్ట్‌లో వెల్లడైంది. దీంతో హంతకుడైన ఆమె భర్త గురుమూర్తి చేసిన దారుణానికి ఈ రిపోర్ట్ ఉపకరించనుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వర కాలనీకి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తి గత జనవరి నెలలో తన భార్య మాధవిని హత్య చేసి ఆ తర్వాత శరీరాన్ని ముక్కలు ముక్కలు చేసి ఎలక్ట్రిక్ హీటర్‌తో బకెట్‌లో ఉడికించి మాంసం ముద్దలతో పాటు ఎముకలను పొడి చేసి స్థానిక చెరువులో పారేసిన సంగతి కలకలం సృష్టించిన సంగతి అందరికీ తెలిసిందే. నేరాన్ని నిందితుడు అంగీకరించినా తగినన్ని సాక్ష్యాలను, ఆధారాలను సేకరించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. హత్యకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు దొరకుండా గురుమూర్తి చేసిన పని అందరినీ విస్తుబోయేలా చేసింది. అయితే ఇంట్లో సేకరించిన టిష్యూస్‌ను డిఎన్ఎ పరీక్షలకు ల్యాబ్‌కు పంపిన పోలీసులకు నేరం రుజువుకు సంబంధించి కీలకమైన ఆధారం లభ్యమైంది. రిపోర్టులో డిఎన్ఎ మాధవి తల్లి, పిల్లల డిఎన్ఎతో మ్యాచ్ కావడం పోలీసులకు ఊరటనిచ్చింది. ఈ బలమైన సాక్ష్యంగా కేసు పురోగతిలో కీలకం కానుంది. మొత్తం మీద హంతకుడైన గురుమూర్తికి కఠిన శిక్ష పడేటట్లు పోలీసు అధికారులు సీరియస్‌గా ఈ కేసును దర్యాప్తు చేయిస్తున్నట్లు తెలిసింది.

# పద్దుపై చర్చలో ఏం కావాలి.. ఏం చేయాలో అడగాలి..

## ప్రశాంత్‌రెడ్డి తీరుపై డిప్యూటీసిఎం మల్లు భట్టి విక్రమార్క అభ్యంతరం



**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** అసెంబ్లీలో డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ డిమాండ్ పద్దు చర్చలో ఏం కావాలి, ఏం చేయాలి అడగాలేకానీ పదేళ్ల ఆర్ అండ్ బిలో ఏంచేశారనే అంశం వాడుకొంటే ఎట్లా? ప్రశాంత్‌రెడ్డి శాసనసభ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు కూడా అని అభ్యం తరం తెలిపారు. డిమాండ్ మీద మాట్లాడండి, పాతది జనరల్ డిస్కషన్‌లో మాట్లాడుకోవచ్చని కోరారు. ప్రశాంతరెడ్డి తిరిగి మాట్లాడుతూ డిప్యూటీ సిఎం ప్రశ్నోత్తరాల సమయంలో లేరు స్పీకర్ పద్దుల సమయంలో మాట్లాడలని అన్నారు. బడ్జెట్ సమయంలో దేవరకొండ సభ్యులు బాలునాయక్ ఓ మాట అన్నారని ప్రశాంతరెడ్డి గుర్తుచేసుకొని ఆయన నియోజకవర్గంలో అబివృద్ధిచేసిన కొత్తరోడ్లు డబుల్ రోడ్లను వాటి నిడివి సహా తెలిపారు.

శ్రీదర్‌బాబు లేచి రోడ్లు ఎప్పుడైనవో అన్ని వివరించాలని మేం ఉన్నప్పుడు కూడా రోడ్ల విస్తరణ జరిగిందని తెలిపారు. ట్రిబుల్‌ఆర్ నేషనల్ హైవేకు నెంబరే రాలేదని భూసేకరణకు అడ్డుగా మారిందని ప్రశాంతరెడ్డి తెలపారు. ట్రిబుల్ ఆర్ సృష్టికర్త అంకురార్పణచేసిందే కెసిఆర్ ప్రతిపాదన చేసిందే కెసిఆర్ అని ఆయన సభకు వివరణ ఇచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా కెసిఆర్ వెంట ఢిల్లీకి వెళ్లారని గతం గుర్తుచేశారు. భూసేకరణ కోసం 80శాతం త్రిడి నోటిఫికేషన్ వేశామని అన్నారు. నేషనల్ హైవే నెంబర్ రాకపోవడంతో భూసేకరణ చేయడానికి ప్రతిబంధకమైంది అందువల్ల టెండర్ ప్రక్రియకూడా పూర్తికాలేదని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. భూసేకరణ కాదు, పర్యావరణ అనుమతులు లేవు ఎలా పనులు మొదలవుతాయి. దక్షిణ ట్రిబుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చుతున్నారు. దీనితో ప్రజల మీద 15వేల కోట్ల భారం పడబోతున్నదని ప్రశాంత్‌రెడ్డి హెచ్చరిచారు. హామ్ రోడ్లపై కూడా స్పష్టతలేదని ఆయన వివరించారు.

# గిరిజనుల సంస్కృతీ వారసత్వాలకు వేదికగా ట్రైబల్ మ్యూజియం



## బ్రోచర్‌ను ఆవిష్కరించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త :** భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో గిరిజనుల గొప్ప సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి తెలియ జేయడానికి మరింత అవకాశం ఏర్పడిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాచలం ట్రైబల్ మ్యూజియం బ్రోచర్‌ను మంగళవారం శాసనసభ ఆవరణలో ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లా డుతూ ఈ మ్యూ జియం గిరిజన సంప్ర దాయాలను, వేష భాష లను, జీవన విధానాన్ని, హస్తకళలను, ప్రజా గీతాలను, ఆచార వ్యవహారాలను ప్రత్యేకంగా ప్రదర్శించేందుకు ఉపయోగపడుతుందన్నారు. భద్రాచలంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మ్యూజియంను ప్రారంభిస్తామని వెల్లడించారు. భద్రాచలం రామాలయం ఒక పవిత్ర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది.

దేశం నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి దర్శనం చేసుకుం టున్నారు. ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతో భద్రాచలం పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఇది స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని మంత్రి తెలిపారు. గిరిజన సం స్కృతి పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, 'గిరిజనుల జీవన విధానం, వారి సంప్రదాయాలు క్రమంగా మాయమ వుతున్నాయని,మన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి ఇలాంటి మ్యూజియం ఎంతో అవసరం' అని మంత్రి అన్నారు. గిరిజన కళాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటేందుకు, వారి చేతిపనులకు విస్తృత మార్కెట్‌ను అందించేందుకు ఈ మ్యూజియం దోహదపడుతుందన్నారు. భద్రాచలం చుట్టుపక్కల ఉన్న గిరిజన గ్రామాల అభివృద్ధికి ఇది ఒక కీలకమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు.

# ప్రాథమిక స్థాయి నుంచి వర్సిటీ వరకు విద్యను బలోపేతం చేయండి

## కల్లు రంగాన్ని గీత పరిశ్రమగా గుర్తించండి

## టూరిజంతో ఉపాధి అవకాశాలు మెరుగు

## సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త :** 'శ్రీధర్‌బాబు చదువుకున్నోడు స్మార్టుగా ఉంటారు విద్యారంగం విషయం ఆయనకు చెబితే ఏదైనా సంస్కరణలకు ఉప యోగ పడుతుంది' అంటూ సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అనడంతో సభలో నవ్వులు విరిసాయి. మంగళ వారం ప్యానల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి తనను ఉద్దేశించి మాట్లాడాలని కూనంనేని సాంబశివరావును కోరారు. ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ వరకు విద్యను బలోపేతం చేయడానికి టిచర్స్ నుంచి మొదలు కొని ప్రొఫేసర్‌లవరకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. మెడికల్ కాలేజీలు ఓపెన్ చేశారు కానీ ఎక్కడ బోదనా సిబ్బందిని నియామకం చేయలేదని ఆవేదన చెందారు. ఇంజనీరింగ్ విద్యకూడా సరిగాలేదని ఆవేదనచెందారు. ఫిన్‌లాండ్ డెన్మార్క్ దేశాలలో విద్యను బలోపేతం చేసినట్లు మనం చేయాలని సూచించారు. విద్యారంగం నుంచి వచ్చినవారిని విసిలుగా నియమించాలని ఐఎఎస్‌లను విసిలుగా నియామకం చేయడం తగదని అన్నారు. బెల్ట్‌షాపులు పూర్తిగా ఎత్తివేయాలని కల్లురంగంను పరిశ్రమగా గుర్తించాలని సూచించారు. పన్నుల ఎగవేత జరగకుండా చూడాలని సూచించారు. తెలంగాణలో కళాకారులకు పింఛను చెల్లించాలని సూచించారు. భద్రాచలం నుంచి కొత్తగూడెం వరకు పర్యాటక రంగంగా అభివృద్ధిచేయడానికి అవకాశం ఉందని ఆయన సూచించారు. కాంట్రాక్టు కార్మికులను ఔట్‌సోరింగ్ ఉద్యోగులను విద్యాశాఖ,ఎండోమెంట్ టూరిజంశాఖలోఉన్నవారి సర్వీసు క్రబద్ధీకరణ చేయాలని కోరారు. విద్యాశాఖలో లెక్చరర్లను ప్రొఫేసర్లను టీచర్లను వివిధ పేర్లతో నియామకాలు చేసి శ్రమదోపిడిచేస్తూ ఉద్యోగభద్రత లేకుండా అనిశ్చితికి గురిచేస్తున్నారని ఆయన ఆవేదనచెందారు. రిటైర్డు అయ్యు కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు ఒక ఉద్యోగం ఇవ్వడంతో పాటు వారికి పదిలక్షల పదవివిరణ ఆర్థిక ప్రయోజనం కల్పించాలని ఆయన సూచించారు. కొమటిరెడ్డిహయంలో డబుల్‌రోడ్ల వచ్చాయని గత పదేళ్ళలో రోడ్లు గుంతల మయం ఉండేవని ఆవేదనచెందారు. టూరిజం ఖర్చులేని శాఖ అని ఉపాధిపెంచుతుందని ఆయన తెలిపారు.

# వైఫల్యాలను బయట ప్రశ్నిస్తే కేసులు, అసెంబ్లీలో నిలదీస్తే సస్పెన్షన్లు

## రెండు లక్షల రుణమాఫీపై చేతులెత్తేసిన సర్కారు

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయట ప్రశ్నిస్తే పోలీసు కేసులు, అసెంబ్లీలో ప్రశ్నిస్తే సస్పెన్షన్‌లు చేస్తున్నారని మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మెదక్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరా పార్కు దగ్గర ధర్నాలకు అనుమతించడం లేదని, ఆశా వర్కర్లను సొమ్మసిల్లేలా పోలీసులతో కొట్టిస్తున్నారని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ మీద ప్రభుత్వం చేతులెత్తేసిందని, రుణమాఫీ అయినవాళ్లు తక్కువ, కానివాళ్లు ఎక్కువ అని ఎద్దేవా చేశారు. ఆరు నెలలైనా ఇప్పటికీ అందరికీ మాఫీ కావడం లేదని, అక్కా చెల్లెళ్లకు దగా, నిరుద్యోగులకు దగా, రైతులకు దగా, ఆసరా పెన్షన్ దారులకు దగా చేస్తున్నారని అన్నారు. అసెంబ్లీలో మేం అడుగుతుంటే ప్రతి దాడులు చేస్తున్నారు, సమాధానం ఇవ్వడం లేదన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయాన్ని ఎత్తివేశారని, రైతులు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను నిలదీ యాలని, రుణమాఫీ మీద వానాకాలం రైతు బంధు ఎగ్గొట్టారని, యాసంగి రైతుబంధును ఊరించి, ఊరించి వేస్తున్నారని అన్నారు. రిటైరైన ఉద్యోగులకు డబ్బులివ్వమంటే ఉండవన్నారు. ఈరోజు 25వ తారీఖు, అంగన్ వాడీలకు జీతాలు పడలేదన్నారు. 1వ తారీఖునే జీతాలిస్తామని చెబుతున్నారని, మాటలే తప్ప చేతలు లేవు అని అన్నారు. డబ్బుల్లేవని అంటున్నారని, 20 వేల కోట్లతో హెచ్ఎండీఏలో టెండర్లు ఎట్లా పిలుస్తున్నారన్నారు. ఫ్యూచర్ సిటీపేరు మీద మా నిరుద్యోగులకు భృతి ఇవ్వమంటే డబ్బుల్లేవని అంటున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రైతాంగం ఎక్కడికక్కడ రైతుబంధు, రుణమాఫీపై సంపూర్ణ రుణమాఫీ అయ్యేదాకా కాంగ్రెస్ పార్టీ వెంట పడుతూనే ఉంటామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



## సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి

## రూ.37,16,500 విరాళం ఇచ్చిన ఎస్‌బిఐ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 25:** రాజ్ భవన్‌లో గవర్నర్ సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి ఛైర్మన్ జిష్ణు దేవ్ వర్మకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి గాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎలోహెచ్‌ఓ కోటి ఉద్యోగులు విరాళంగా అందించిన రూ. 37,16,500/ చెక్కును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ ఎస్‌బిఐ ఉద్యోగుల కృషిని అభినందించారు. వారి సహకారం ఉన్నతమైనదని, ఇలాంటి సహాయం ఇతర సంస్థలు మరియు పౌరులు అనుసరించడానికి ప్రేరణనిస్తుందన్నారు. గత 10 సంవత్సరాలుగా వారు చేస్తున్న సహాయానికి వారి అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేష్ కుమార్, ఎస్‌బిఐ డిజిఎం అండ్ సిడిఓ జితేంద్ర కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మిస్‌వరల్డ్ 2025 పోటీలకు

## మిస్ ఫెమినా విజేత నందినీగుప్తా



**కోట(రాజస్థాన్), మార్చి 25:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించనున్న మిస్‌వరల్డ్ 2025 పోటీలకు రాజస్థాన్ నుంచి గత యేడాది మిస్‌ఫెమినా ఇండియాగా గెలిచిన నందినీగుప్తా పాల్గొంటున్నట్లు ప్రకటించారు. రాజస్థాన్‌లోని కోటలో జన్మించిన ఆమె గత ఏడాది ఫెమినా మిస్ ఇండియా విజేతగా నిలిచింది. అంతకు ముందు మిస్ రాజస్థాన్ 2023లోను కూడా విజేత గా నిలిచిన గుప్తా వచ్చే మే ఏడవ తేదీనుంచి 31వ తేదీ వరకూ హైదరా బాద్‌లోజరిగే మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొం టున్నట్లు ప్రకటించింది. గతంలో 1996లోను, గత ఏడాది 2023లోకూడా ఈ పోటీలు భారత్‌లో నిర్వహించారు. హైదరాబాద్‌లో తొలిసారి నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. 71వ మిస్‌వరల్డ్ పోటీలు న్యూఢిల్లీ, ముంబయిలో విజయ వంతం కావడంతో ఇప్పుడు మిస్‌వరల్డ్ పోటీలు తెలం గాణలో నిర్వహిం చేందుకు నిర్వాహకులు ముందుకువచ్చారు. మిస్‌వరల్డ్ సిఇఒ ఛైర్మన్ జూలియా మోర్లే ఆధ్వర్యంలో ఈ పోటీలు ఈసారి తెలంగాణలో అత్యంత ఘనం గా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతు న్నాయి. అంతర్జాతీయంగా హైద రాబాద్ నగరానికి గుర్తింపు ఉన్నదని చరిత్రాత్మక ప్రాధాన్యత కూడా ఉందని విభిన్న గ్రామీణశైలి కూడా ఉందని అందుకే ఈసారి ఇక్కడ నిర్వ హించాలని నిర్ణయించినట్లు సిఇఒ జూలియా తెలిపిన సంగతి తెలిసిందే.



## కేన్సర్ బాధితుడి మాటలకు మంత్రి శ్రీధర్‌బాబు కన్నీళ్లు!

### కోరిక మేరకు క్రికెట్ కిట్ అందజేత

### అన్నగా అండగా ఉంటానని భరోసా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 25:** "సార్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా... నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్' క్యాన్సర్ తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి. వింటే మనసున్న ప్రతి మనిషికీ గుండె చెమర్చక మానదు. ఈ మాటలకే ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఏకంగా కన్నీళ్లు పెట్టుకున్నారు. భూపాలపల్లి జిల్లా పాలిమల మండలం సర్వాయ్ పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ క్యాన్సర్ తో బాధపడుతూ...ఖాజాగూడలోని స్పర్శ్ హాస్పిస్ లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా ఆసుపత్రికెళ్లి పరామర్శించారు. నేనున్నానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నితిన్ మాటలకు కన్నీళ్లు పెట్టుకున్న శ్రీధర్ బాబు.. అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. సొంతన్నగా వెంట నిలుస్తానని, ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి అంటూ నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

# గచ్చిబౌలి భూములపై వాస్తవాలు ఇవీ..

## అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 25:** కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు ఓ ప్రకటన చేశారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలోని సర్వే నెం. 25లో ఉన్న 400 ఎకరాల భూమి గురించి వచ్చిన కొన్ని వార్తలు వాస్తవాలు వక్రీకరించేలా ఉన్న నేపథ్యం లో ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ 400 ఎకరాల భూమిని 2003లో క్రీడా సౌకర్యాల అభివృద్ధి పేరిట ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ కు కేటాయించిందని తెలిపారు. ఐఎంజీ అకాడమీస్ ప్రాజెక్టును ప్రారంభించలేదని, 2006లో అప్పటి మా కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించి కేటాయింపును రద్దు చేసిందని తెలిపారు. ఐఎంజీ అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ కేటాయింపు రద్దు పై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, 07.03.2024 న హైకోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు ఇచ్చిందని వివరించారు. దానిపై ఐఎంజీ అకాడమీస్ ప్రైవేట్ లిమిటెడ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. 03.05.2024న సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా ధృవీకరణ జరిగిందన్నారు.శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్‌లు రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఈ 400 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా ధృవీకరించారు. ఈ భూమికి అటవీ శాఖకు ఏ సంబంధం లేదని, ఇది పూర్తిగా ప్రభుత్వ భూమి అని స్పష్టం చేశారు. టీజీఐఐసికు భూమి కేటాయింపు జరిగిందన్నారు. ప్రభుత్వం ఈ 400 ఎకరాల భూమిని కొత్త భూ కేటాయింపు విధానం ప్రకారం 26.06.2024న టీజీఐఐసికి కేటాయించిందని రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తరువాత 01.07.2024న రెవెన్యూ అధికారులు ఈ భూమిని అధికారికంగా టీజీఐఐసికి అప్పగించారని తెలిపారు. టీజీఐఐసి అభివృద్ధి చేస్తున్న 400 ఎకరాల భూమిలో బఫెలో లేక్ లేదా పీకాక్ లేక్ లు లాంటి ప్రకృతి ప్రదేశాలు లేవని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. టీజీఐఐసి ఈ భూమిలోని రాతి నిర్మాణాలు, పుట్టగొడుగు ఆకారపు అపురూపమైన రాయిని గ్రీన్ జోన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిందని తెలిపారు. ఈ మేరకు పర్యావరణ పరిరక్షణ ప్రణాళికను కూడా సిద్ధం చేసి అమలు చేయనుందని పేర్కొన్నారు.

టీజీఐఐసి హైదరాబాద్ విశ్వవిద్యాలయ భూమిని ఆక్రమించలేదని, అలాగే నీటి వనరులు లేదా రాతి నిర్మాణాలను తొలగించలేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమిలో, టీజీఐఐసి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని యోచిస్తోందన్నారు. ఈ అభివృద్ధి, సుస్థిర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తోందన్నారు. టీజీఐఐసి ఈ భూమిలో ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కోసం టెండర్లను ఆహ్వానించడానికి ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు.

# అన్నదాతల ఆత్మహత్యలు కొనసాగితే అందాల పోటీలా?

## అసెంబ్లీలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 25:** రాష్ట్రంలో అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్న విషాదకరమైన పరిస్థితుల్లో అందాల పోటీలు నిర్వహించడం పట్ల భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీలో ప్రభుత్వం పైన ధ్వజమెత్తారు. ఒకవైపు రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటే ప్రభుత్వం అందాల పోటీలకు ప్రాధాన్యత ఇవ్వడం పైన కేటీఆర్ ప్రశ్నించారు. అంతర్జాతీయ పోటీల యొక్క రిలవన్స్ పూర్తిగా పోయింది, కానీ దాన్ని ఏదో అంతర్జాతీయ ఈవెంట్ సాధించినంత గొప్పగా ప్రచారం చేసుకుంటుంది ఈ ప్రభుత్వం అని విమర్శించారు. అందాల పోటీల వలన ఆదాయం కానీ ఉద్యోగాలు కానీ ఎట్లా వస్తాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మిస్ వరల్డ్ పోటీలకు 55 కోట్లు ఖర్చు పెడితే తప్పా అని మాట్లాడుతున్న ప్రభుత్వం 46 కోట్ల రూపాయలను ఫార్ములా ఈ కోసం ఖర్చు పెడితే ఏ విధంగా నష్టం జరిగిందో చెప్పాలన్నారు. ఫార్ములా ఈ రేసుని ఏకపక్షంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా రద్దు చేయడం వలన రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకి 46 కోట్ల రూపాయల నష్టం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఫార్ములా ఈ మూర్ఖత్వ నిర్ణయం వలన నష్టం జరిగిందన్నారు. ఫార్ములాఈ వలన రాష్ట్రానికి ఎలక్ట్రానిక్స్ రంగంలో అనేక పెట్టుబడులు వచ్చాయన్నారు. జహీరాబాద్ తో పాటు రంగారెడ్డి, వెనకతల, మహబూబ్నగర్ వంటి చోట్ల ఎలక్ట్రానిక్స్ రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చాయి, టెస్లా వంటి కంపెనీ రాష్ట్రం వైపు చూసిందన్నారు. 33 సంవత్సరాల టివోటి పద్ధతిలో అవుటర్ రింగ్ రోడ్డుని ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తానేమో తప్పని చెప్పారు, కానీ టూరిజం పాలసీలో మాత్రం 99 సంవత్సరాలకు ప్రభుత్వ భూములు, ఆస్తులను లీజుకు ఇవ్వడం ఏ విధంగా న్యాయమైతది చెప్పాలన్నారు. గతంలో ఔటర్ రింగ్ రోడ్డు అంశంలో విమర్శించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు టూరిజం అంశంలో ద్వంద ప్రమాణాలను పాటిస్తున్నదన్నారు.

దేశంలోని అతిపెద్ద డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఎందుకు టూరిజం సర్కిల్ లో పెట్టాలని లేదు దానికి తాళాలు వేసి ఎందుకు ఉంచారో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని తాళాలు వేసి బందిగా ఏందుకు ఉంచుతున్నారో చెప్పాలన్నారు.. ఆయన జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న అంబేద్కరిస్టులు విగ్రహ సందర్శనకు వస్తున్నారని, అప్పుడైనా కనీసం తెరుస్తారో లేదో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. మా ప్రభుత్వహయంలో 10 ఏండ్లు టూరిజంను బాగా అభివృద్ధి చేశామని, కానీ ఏంజరగలేదన్నట్టు టూరిజం మంత్రి జూపల్లిగారు మాట్లాడుతున్నారన్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తెచ్చామని, హైదరాబాదులో కూలీ కుతుబ్షా టూంబ్స్ తో పాటు మోజం జహీ మార్కెట్ వంటి అనేక టూరిజం ఆకర్షణలను అభివృద్ధి చేశామన్నారు,.మాజీ మంత్రి జానా రెడ్డి గారు ప్రారంభించిన టూరిజం ప్రాజెక్ట బుద్ధవనంని మేము పూర్తి చేసామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయక సాగర్, కొండపోచమ్మ వంటి టూరిజం అట్రాక్షన్లను డెవలప్ చేసామన్నారు. ప్రపంచ మహాసభలను నిర్వహించడం, గ్లోబల్ ఆంట్రపెన్యూర్ సమ్మిట్ వంటి సమావేశాలను నిర్వహిస్తే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు అమెరికా అధ్యక్షుడు కూతురు ఇవాంక ట్రంప్ వంటి ప్రముఖులు హాజరయ్యారన్నారు. టూరిజం శాఖ మంత్రి నియోజకవర్గం కొల్లాపూర్ లో కూడా అనేక టూరిజం డెవలప్మెంట్ కార్యక్రమాలు చేశామని, వరంగల్ లో మేము ప్రారంభించిన కాళోజి ఆడిటోరియం ని కూడా దాదాపుగా పూర్తి చేసామని, మిగిలిన ఐదు పది శాతని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తున్నామని చెప్తుందన్నారు.

# న్యాయవ్యవస్థపై కేంద్రం పెత్తనం పెరిగింది

**జస్టిస్ వర్మ ఉదంతం న్యాయవ్యవస్థకే కళంకం**

**పాన్‌పరాగ్‌కు అమితాబ్‌బచ్చన్ ప్రచారమా?**

**మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** గత కొన్నేళ్లుగా న్యాయవ్యవస్థపై కేంద్రం పెత్తనం పెరిగి పోయిందని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శిం చారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వర్మ అవినీతి ఉదంతం భారతదేశ న్యాయవ్యవస్థకే కళంకంగా మారిందన్నారు. ఢిల్లీ న్యాయమూర్తి అవినీతికి పరాకాష్టగా అతని ఇంటిలో వంద కోట్ల కరెన్సీ బయటపడడంతో ప్రపంచం నివ్వెర పోయిందన్నారు. న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ప్రాంగణంలో మంగళవారం నారాయణ మీడియాతో మాట్లాడారు. జస్టిస్ వర్మ చేస్తున్నది వ్యాపారం కాకపోయినా వందల కోట్ల రూపాయలు ఇంటిలో ఉన్నాయంటే.. అదంతా అవినీతి సొమ్మేనని అర్థమవుతోందని నారాయణ పేర్కొన్నారు. వ్యవహారం బయటకు వచ్చిన నాలుగు రోజుల అనంతరం ఢిల్లీ ఫైర్ డిపార్టుమెంటు అధికారులను మేనేజి చేసి అక్కడ కాలిన నోట్లు ఏమీ దొరకలేదని చెప్పిస్తున్నారని తెలిపారు. కాలిన నోట్ల కట్టలు బయట పడినా తప్పుడు రిపోర్టులు ఇచ్చిన ఫైర్ డిపార్టు మెంటు అధికారులనే ఫైర్ చేయాలని నారాయణ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధానిగా నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి న్యాయవ్యవస్థ స్వతంత్రను కోల్పోతున్నదని మండిపడ్డారు. మోడీ పడగ నీడన న్యాయవ్యవస్థ ఉందని విమర్శించారు. మాజీ సీజేఐ జస్టిస్ చంద్ర చూడ్ ఇంట్లో జరిగిన వ్యక్తిగత పూజా కార్యక్రమానికి ప్రధాని మోడీ వెళ్లవచ్చునా అని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే కేంద్ర ప్రభుత్వపు ఒత్తిడి న్యాయవ్యవస్థపై తీవ్రంగా పెరుగుతోందన్నారు. ఆఖరుకు కొలీజియం కూడా మోదీ కనుసన్నల్లోకి వెళ్లినట్టు తెలుస్తోందని నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. న్యామూర్తులు పాలకులకు అనుకూలమైన తీర్పులు ఇచ్చి .. పదవీ విరమణ చేసిన వెంటనే ఎంపీలుగా, ఇతర ఉన్నత పదవులు పొందుతున్న ఉదంతాలు చూస్తున్నామన్నారు. ఇది న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని దిగజారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రుల్లో 33 శాతం మందిపై వివిధ కేసులు ఉండగా 94 మందిపై రేప్ కేసులున్నట్టు పేర్కొన్నారు.

మోడీ ప్రభుత్వం న్యాయవ్యవస్థతో పాటు ఆర్‌బీఐ, సీబీఐ, ఈసీ వంటి అన్నింటినీ నిర్వీర్యం చేసినట్టు తెలిపారు.

మోడీ ప్రభుత్వం రాజ్యాంగం అందించిన ఫెడరల్ (సమాఖ్య) స్ఫూర్తిని తీవ్రంగా దెబ్బ కొడుతోందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే డీలిమిటేషన్‌ను ముందుకు తెచ్చిందన్నారు. ఇది దేశాన్ని దక్షిణాది, ఉత్తరాధి అని రెండుగా విభజిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది దక్షిణాదికి సంబంధించిన సమస్య కాకూడదని... గతంలో ఇందిరా గాంధీ ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా పాలన సాగిస్తుంటే ఎన్‌టీఆర్ దాన్ని అడ్డుకోవడం కోసం ఉద్యమించారని, దానికి వామపక్షాలు సహా ఇతర శక్తులు మద్దతుగా నిలిచాయని నారాయణ గుర్తు చేశారు. తాజాగా మోడీ పాలనలో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలుగుతోందని.. తానేది చెబితే అది జరగాలని, ఒకే నేత, ఒకే పార్టీ అంటూ మోడీ నియంతృత్వం దిశగా సాగుతున్నారని మండిపడ్డారు. దేశంలో అన్ని వర్గాలకు, రాష్ట్రాలకు సమాన అవకాశాల్ని హక్కుల్ని రాజ్యాంగం ఇచ్చిందని గుర్తు చేశారు. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న మోడీ ప్రభుత్వం విధానాల్ని ప్రజల్లో ఎండగట్టాల్సి అవసరం ఉందన్నారు. డబ్బుల కోసం సమాజానికి హాని చేసే గుట్కా, పాన్ పరాక్ తదితర ప్రకటనల్లో నటిస్తున్న సినిమా హీరోల తీరు దారుణమని నారాయణ పేర్కొన్నారు. అమితాబ్, శారుక్ అనేక మంది ఆ ఆతరుహా ప్రకటనల్లో నటించడాన్ని ఆక్షేపించారు. మంచి సంపాదన ఉన్నా డబ్బుల కోసం ఇటువంటి చవక బారు ప్రకటనలు ఇవ్వడం మంచిది కాదన్నారు. పాన్ మసాలాలు, గుట్కాలు కుడా ఆహారం పదార్థాలే అనే ఒక తీర్పు ఆధారంగా.. ఆ కంపెనీల ప్రకటనల్లో నటించడం దారుణమన్నారు.

# బెట్టింగ్ యాప్స్ కేసులో కీలక పరిణామం

## సినీతారలు ప్రమోట్ చేసిన యాప్స్ గుర్తింపు

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. దీనిపై విచారిస్తున్న పోలీసు లు మంగళవారం నాడు కీలక పురోగతి సాధిం చారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న సినీ నటులపై ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు వేరు వేరువేరుగా కేసులు నమోదు చేయడం తెలిసిందే. దీనిపై విచారణ చేబట్టిన సైబరా బాద్ పోలీసులు సినీ నటుడు ప్రమోట్ చేసిన యాప్‌లను గుర్తించారు. ఇందులో జంగిల్ రమ్మి అనే యాప్‌కు దగ్గుబాటి రానా, ప్రకాష్ రాజ్‌లు ప్రమోట్ చేయగా ఏ23 యాప్ కోసం విజయ్ దేవరకొండ, యోలో 247 యాప్ కోసం మంచు లక్ష్మి, ఫెయిర్ ప్లే లైన్ కోసం కన్నడ నటి ప్రణీతచ జీట్ విన్ యాప్ కోసం నిధి అగర్వాల్, ఆంధ్ర 365 యాప్ కోసం నటి, యాంకర్ శ్యామల, టివి నటి విష్ణు ప్రియ, రీతు చౌదరి, యూ ట్యూబర్లు హర్ష సాయి, టేస్టీ తేజా, బయ్యా సన్నీయాదవ్ ప్రమోట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మియాపూర్ పోలీసులు సినీతారలతోపాటు 19 మంది బెట్టింగ్ యాప్ యజమానులపై కేసులు నమోదు చేయడం తెలిసిందే. కాగా పంజాగుట్ట పోలీసులు 11 మంది యూ ట్యూబర్లు, టివి నటులపై కేసులు నమోదు చేశారు.

## బోర్లు తవ్వుకోకుండా అడ్డుపడుతున్న అటవీ అధికారులు

### ఇల్లందు శాసనభ్యుడు కోరం కనకయ్య

**హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త :** పోడువ్యవసాయం చేసుకొనే గిరిజన రైతులు ప్రభుత్వం వారికి ఇచ్చిన భూములలో నీటి వసతి ఏర్పాటు చేసుకోకుండా అటవీ అధికారులు అడ్డకొంటున్నారని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆరోపించారు. అటవీశాఖ అధికారులకు సరైనా మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు. తన నియోజకవర్గంలో సుమారు 89877 ఎకరాల పోడుభూములకు విద్యుత్ లైన్‌వేసుకోవడానికి కూడా అనుమతి ఇవ్వడంలేదని ఆయన ఆవేదనచెందారు. ఆర్‌వోఆర్ పట్టాలు పోడు రైతులకు ఇవ్వాలని చనిపోయినవారి వారసులకు వారసత్వంగా వచ్చేలా చేయాలని సూచించారు. బోర్లు వేసుకొనేందుకు అనుమతులు కూడా ఇవ్వాలని కోరారు.

## నీరాకేఫ్‌ను కల్లుగీత కార్పొరేషన్‌కు అప్పగించిన ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 25,ప్రభాతవార్త :** తెలంగాణలోని రేవంత్ రెడ్డి సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ప్రాంతంలోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన నీరా కేఫ్‌ను.. కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు అప్పగించింది. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ సందర్భంగా.. కీలక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు సహకరించిన ఎమ్మెల్సీ, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు కల్లుగీత విభాగం అధ్యక్షులు నాగరాజు గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఎక్సైజ్, పర్యాటక శాఖలతో సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం.. నీరా కేఫ్‌ను పర్యాటక శాఖ నుంచి తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్‌కు బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నీరా కేఫ్‌ను నిర్మించిన భూమి.. పర్యటక శాఖకు సంబంధించినది కావడంతో.. దాని నుంచి వచ్చే ఆదాయంలో 30 శాతం టూరిజం శాఖకు చెల్లించాలని పేర్కొంది. బీసీ సంక్షేమ శాఖ, పర్యాటక శాఖ, రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొరేషన్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## అదనంగా మినీఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు

### నాణ్యమైన ఆహారాన్ని అందించేలా చర్యలు

### ఫుడ్‌సేఫ్టీ విభాగం సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఫుడ్‌సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. అందులో భాగంగా ఫుడ్‌సేఫ్టీని బలోపేతం చేయడం కోసం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేహాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్షను నిర్వహించారు. ఈ సమీక్షలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వి కర్ణన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, ఐపిఎం డైరెక్టర్ శివలీల, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ పంకజా, ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ వంటకాల బ్రాండ్ ఇమేజ్‌ని పెంచేలా ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని కార్యదర్శి ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ తయారీదారులందరూ విధిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను కలిగి ఉండేలా ఫుడ్ సేఫ్టీ అధికారులు అవగాహనను కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్‌సేఫ్టీలో భాగంగా సేకరించిన ఆహార శాంపిల్స్‌ను పరీక్షించడానికి అదనంగా మినీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కార్యదర్శి క్రిస్టినా ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ తయారీ దారులు, రెస్టారెంట్, హోటల్ నిర్వాహకులు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా ఫుడ్‌సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో అదనపు సిబ్బందినీ పూర్తిస్థాయిలో త్వరలోనే నియమిస్తామన్నారు. జిహెచ్‌ఎంసి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో సీనియర్ అధికారులను ఫుడ్ సేఫ్టీ నియంత్రణపై పర్యవేక్షకులుగా నియమిస్తామన్నారు.

# మన ఊరు మన బడిలో పెద్ద స్కాం

## అసెంబ్లీలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్



**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్లో ప్రొహిబిషన్ ఎక్కడుందని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రొహిబిషన్ ఎక్కడా లేకపోవడంతో దాన్ని ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ పేరుగా మార్చాలని సూచించారు. శాసనసభలో మంగళవారం వివిధ పద్దులకు సంబంధించి జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ మద్యం విషయంలో రాష్ట్రంలో అత్యధిక రెవెన్యూ వస్తుందన్నారు. మందు తాగుతున్నారు, తాగిస్తున్నారని విమర్శించారు. చిన్నా పెద్దా ఎలక్షన్ సమయంలో మద్యం వినియోగం పెరుగుతుంది, కానీ ఇందులో ప్రొహిబిషన్ ఎక్కడ ఉంది సార్ అంటూ నిలదీశారు. అలాగే గత ప్రభుత్వ హయంలో మన ఊరు మన బడి పథకంలో పెద్ద స్కాం జరిగిందని ఆరోపించారు. అది కాళేశ్వరం కంటేపెద్ద స్కామ్ అని పేర్కొన్నారు. మన ఊరు మన బడిపథకంలో అమలులో లోపాలు చోటు చేసుకున్నాయన్నారు. మన ఊరు మన బడి లో ఏమి పని జరగలేదని, జరిగిన దానికి నిదులు విడుదల కాలేదని విమర్శించారు. మన ఊరు మన బడిపథకంలో బెంచీల కొనుగోళ్లలో స్కాం జరిగిందని చెప్పారు. ఈ స్కాంపై ప్రశ్న వేద్దాం అనుకుంటే ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ.14, రూ.18, రూ.20వేల ఒక్కో బెంచ్ కొన్నారు. రూ.5వేలకే ఒక బెంచ్ వస్తదని, అటువంటి దాన్ని రూ.20వేల పెట్టీకొన్నారని చెప్పారు. ఈ అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

**సభలో నవ్వులు పూయించిన అక్బర్**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఎంఐఎం నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో నవ్వులు పూయించారు. అక్బరుద్దీన్ ప్రసంగం ప్రారంభించగానే గడియారం వైపు ప్యానెల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్ రెడ్డి చూస్తారు. అది గ్రహించిన అక్బరుద్దీన్ మీరు టైమ్ చూస్తున్నారు. ఎక్కువ సేపు మాట్లాడనని స్పీకర్‌ను కోరారు. వెంటనే స్పీకర్ టైమ్ రాయాలి కాదా అంటూ సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో సభలో స్పీకర్‌తో పాటు, సభ్యులు సరదాగా నవ్వారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు జైబాపు, జైభీమ్ జై సంవిధాన్

### ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జై బాపు,జై బీమ్ జై సంవిదాన్ నినాదంతో రాహుల్‌గాంధీ ప్రజలను జాగృతం చేయాలని సంకల్పించారని ఎమ్మెల్సీ డా.బల్మూరి వెంటకట్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఖైరాతాబాద్ డీసీసీ ఆధ్వర్యంలో జై బాపూ, జై బీమ్, జై సంవిధాన్ పాదయాత్ర సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ దేశంలో మతం పేరుతో ఒవైపు బావోద్వేగాలు పెంచి పోషిస్తూ మరోవైపు అంబేద్కర్ రాజ్యాంగం స్థానంలో మనువాద ఆలోచనలతో రాజ్యాంగాన్ని అమలు చేసే కుట్రచేస్తున్నదని ఆయన విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందని ఆరోపించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ఆశయాలకు తగ్గట్టుగానే మన రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ విధానాలను రూపొందిస్తుందన్నారు.

# హైవే ట్యాంకర్‌ను ఢీకొన్న ఇన్నోవా.. ఇద్దరు మృతి

**అనంతగిరి, మార్చి 25, ప్రభాతవార్త:** ఖమ్మం కోదాడ జాతీయ రహదారిపై ఇనోవా కారు హైవే ట్యాంకర్ లారీనీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలం శాంతినగర్, బొజ్జ గూడ తండా గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేళ్లచెరువు మండలం వేపల సింగారం గ్రామానికి చెందిన సోము కృష్ణారెడ్డి, అమ్మిరెడ్డి పద్మ, ఉపేందర్ రెడ్డి, బ్రహ్మారెడ్డి నలుగురు పని నిమిత్తం ఖమ్మం వెళ్లి కోదాడ కు తిరిగి వస్తున్నారు.

ఈ క్రమంలోనే ఖమ్మం కోదాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జరుగుతున్న పనులలో లారీ వాటర్ ట్యాంకర్ తో మొక్కలకు నీళ్లను కొడుతుంది. ఈ క్రమంలో లారీ ఒకేసారి ముందుకు మూవ్ ఇవ్వడంతో వెనక నుండి కారు వచ్చి ఢీకొనట్లుగా స్థానికులు తెలుపుతున్నారు.

దీంతో అక్కడికక్కడే సోము కృష్ణారెడ్డి అమ్మి రెడ్డి పద్మ మృతి చెందారని ఉపేందర్ రెడ్డి బ్రహ్మారెడ్డికి తీవ్ర గాయాలైనట్లుగా సమాచారం.మృతదేహాలను తరలించారు.కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు.

# ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 43 కేసుల కేటుగాడు అరెస్టు

**హైదరాబాద్, మార్చి 25, ప్రభాతవార్త:** స్టాక్ ఎక్స్ఛేంజిలో లాభాలు గడించాలని ఆశతో వుండే వారిని తెలివిగా ఎంచుకుని వారికి పలానా కంపెనీల్లో పెట్టుబడులు పె ట్టాలని సూచిస్తూ నిండా ముంచుతున్న మరో నేరగాడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి కవిత మంగళ వారం మీడియాకు వెల్లడించారు. హరియాణాలోని గురుగాంకు చెందిన హిమాంషు స్వామి (28) ఓ అకౌంటెంట్. అయితే ఇతను ఢిల్లీ సహా పలు ప్రాంతాలలో గల బ డా సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి వారికి మ్యూల్ బ్యాంకు ఖాతాలు ఇస్తూ వారి నుంచి సైబర్ నేరాల కేసుల్లో సంపాదించే డబ్బుల్లో కమీషన్ తీసుకుంటున్నాడు. ఇ తనిపై 43 కేసులున్నాయి. కొన్ని కేసుల్లో ఇతను నేరుగా నేరాలు చేయగా ఇంకొన్నింట్లో సహాయకుడుగా వున్నాడు. హైదరాబాద్ కు చెందిన ఓ 48 ఏళ్ల ఇంజనీర్ హిమాంషు స్వామి మాటలు నమ్మి 20 లక్షల వెయ్యి రూపాయలు పోగొట్టుకున్నాడు.

మొదల్లో బాధితుడికి కొంతమేర లాభాలు చూపిన స్వామి ఆ తరువాత భారీ పెట్టు బడుల పేరిట 20 లక్షల వెయ్యి రూపాయలు కాజేశాడు. తాను సూచించిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని నమ్మించి ఈ డబ్బులను సైబర్ నేరగాడు కాజేశాడు. చి వరకు తాను మోస పోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దీనిపై విచారణ చేబట్టగా స్వామి బాగోతం రట్టయ్యింది.

నిందితుడిని హరియాణాలోని అతని సొంత ఊరిలో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు. నిందితుడి వద్ద మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. ఇతనిపై హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో ఇటువంటివి ఆరు కేసులున్నాయి. ఈ తరహా మోసాల ప ట్ల అందరు జాగ్రత్తగా వుండాలని డిసిపి కవిత కోరారు.

# 'నీలఖి'కి యంగ్ సెన్సేషన్ అవార్డ్

'బ్యూటీ' చిత్రంతో నీలఖి త్వరలోనే ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఈ సినిమాను గీతా సుబ్రమణ్యం, హలో వరల్డ్ ఫేమ్ వర్ధన్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో అంకిత్ కొయ్య, నీలఖి హీరో హీరోయిన్లుగా నటించారు. నీలఖి తెలుగులోకి పరిచయం కాక ముందే ఒడిశాలో తన సత్తాను చాటుకుంటున్నారు. ఒడిశాలో నంబర్ వన్ ఛానెల్ అయిన తరంగ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన తరంగ్ సినీ ఉత్సవ్ కార్య క్రమంలో యంగ్ సెన్సేషన్ ఆఫ్ ది ఇయర్ డెబ్యూ ఫీమేల్ కేటగిరీలో నీలఖికి అవార్డు వచ్చింది. ఇక తెలుగులోనూ నీలఖి తన మార్క్ వేసుకుంటారని బ్యూటీ టీం ఎంతో నమ్మకంగా ఉంది. ఇప్పటికే రిలీజ్ చేసిన బ్యూటీ పోస్టర్లు, టీజర్‌లో నీలఖి అందరినీ ఆకట్టుకున్నారు. ఎమోషన్స్ పండించడంలోనూ నీలఖి పర్ఫామెన్స్ బాగుందని టీం ఇదివరకే చెప్పేసింది. ఇక బ్యూటీ సినిమాతో నీలఖి తెలుగులోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. త్వరలోనే బ్యూటీ చిత్రం థియేటర్లోకి రానుంది. వానరా సెల్యులాయిడ్ బ్యానర్ మీద మారుతి టీం ప్రొడక్ట్‌తో కలిసి జీ స్టూడి యోస్ సమర్పిస్తున్న చిత్రం బ్యూటీ. ఈ మూవీకి అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



# 'హోం టౌన్' ట్రైలర్ లాంచ్

ఆహా సబ్‌స్క్రైబర్స్ కోసం వస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ హోం టౌన్. మన ఇంటి చుట్టు అల్లుకున్న జ్ఞాపకాలు, బంధాల నేపథ్యంతో ఈ వెబ్ సిరీస్ రూపొందింది. రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి కీలక పాత్రల్లో నటించిన ఈ వెబ్ సిరీస్‌కు శ్రీకాంత్ రెడ్డి పల్లే దర్శకత్వం వహించారు. నవీన్ మేడారం, శేఖర్ మేడారం నిర్మించారు. ఏప్రిల్ 4వ తేదీ నుంచి హోం టౌన్ వెబ్ సిరీస్ ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. హోం టౌన్ ట్రైలర్ తనకు బాగా నచ్చిందని చెప్పిన విజయ్..వెబ్ సిరీస్ టీమ్‌కు తన బెస్ట్ విశెస్ అందించారు. హోం టౌన్ వెబ్ సిరీస్ ట్రైలర్ ఎమోషన్, ఎంటర్ టైన్‌మెంట్‌తో ఆకట్టుకుంది. ఉపాధి కోసం సొంతూర్లను వదిలి వచ్చినా, ఆ జ్ఞాపకాలను మాత్రం మర్చిపోలేం. మళ్లీ ఆ జ్ఞాపకాలను గుర్తు చేసేలా ట్రైలర్ ఉంది. జ్యోతి ఫొటో స్టూడియో జీవనోపాధిగా ఉన్న రాజీవ్ కనకాల..తన కొడుకు శ్రీకాంత్ (ప్రజ్వల్ యాద్మ)ను విదేశాల్లో చదివించి గొప్ప స్థాయిలో చూడాలనుకుంటాడు. కానీ శ్రీకాంత్ ఫ్రెండ్స్‌తో సరదాగా గడిపే ఓ సగటు మధ్య తరగతి కుర్రాడు, అతనికి చదువుల మీద శ్రద్ధ ఉండదు. ఇక్కడే కుటుంబంలో




సంఘర్షణ ఏర్పడుతుంది. తండ్రి కోరుకున్నట్లు శ్రీకాంత్ విదేశాల్లో చదివేందుకు ఒప్పుకున్నాడా లేదా, కొడుకును విదేశాల్లో చదివించేందుకు మధ్య తరగతి తండ్రి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు అనేది హోం టౌన్ వెబ్ సిరీస్ ట్రైలర్ లో ఆసక్తికరంగా చూపించారు. ఝాన్సీ, అనీ, రాజీవ్ కనకాల, ప్రజ్వల్ యాద్మ తమ పర్ ఫార్మెన్స్ లతో ఆకట్టుకున్నారు. ఈ సిరీస్ కు దేవ్ దీప్ గాంధీ కుందు సినిమాటోగ్రాఫర్ కాగా...సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందించారు.

# 'రాబిన్‌హుడ్' ఫన్ ఎంటర్‌టైనర్

హీరో నితిన్ హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్ టైనర్ రాబిన్‌హుడ్. శ్రీలీల కథానాయికగా నటించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ హై బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకీ కుడుముల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**రాబిన్‌హుడ్ జర్నీ ఎలా స్టార్ట్ అయ్యింది?** భీష్మ సినిమా తర్వాత చిరంజీవి కోసం ఒక కథ అనుకున్నాను. ఆయనకి ఫస్ట్ ఐడియా చెప్తే చాలా ఎక్సైట్ అయ్యారు. నేను చిరంజీవికి ఫ్యాన్ బాయ్‌ని. చాలా అద్భుతంగా ఉండాలని స్టోరీ, స్క్రీన్ ప్లే డెవలప్మెంట్‌కి చాలా సమయం తీసుకుని చేశాను, అయితే ఎక్కడో ఓ దగ్గర చిరంజీవిని సాటిస్ఫై చేయలేకపోయాను. మేము అనుకున్న లాగా అది అవ్వలేదు. మరో కథతో వస్తానని చెప్పాను.



డైరెక్టర్ వెంకీ కుడుముల

**భీష్మ తర్వాత నితిన్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?** భీష్మ సినిమాతో మా మధ్య కంఫర్టబుల్ జర్నీ వచ్చింది. నేను అంతకుముందే అ ఆ సినిమాకి అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేశాను. అప్పటి నుంచి నితిన్ అన్నతో మంచి పరిచయం ఉంది. రాబిన్‌హుడ్ జర్నీ కూడా వండర్ఫుల్‌గా జరిగింది.

**ఇందులో హీరో క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**

ఇందులో హీరో మాన్యుపులేటర్. ఫిజికల్ స్ట్రెంత్ కంటే మెంటల్ స్ట్రెంత్ స్ట్రాంగ్ అని నమ్మేపర్సన్. సినిమాల్లో ఫస్ట్ 20 మినిట్స్ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ చేయడానికి రకరకాల గెటప్స్ అలరిస్తాయి. 20 నిమిషాల తర్వాత కథ మారిపోతుంది. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమానితిన్ కెరీర్‌లో, నా కెరీర్‌లో బెస్ట్ మూవీ అవుతుందని నమ్మకం ఉంది. సినిమా అంతా రెగ్యులర్ ఇంట్రవెల్స్‌లో ఫన్ ఉంటుంది. ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ ఎంటర్టైనర్ ఇది.

**డేవిడ్ వార్నర్ పాత్ర గురించి?** ఇందులో ఒక క్యామియో రోల్ ఇంటర్నేషనల్ స్టార్ చేస్తే బాగుంటుందని అనుకున్నాను. నిర్మాతలు ఎవరని అడిగినప్పుడు డేవిడ్ వార్నర్ అని చెప్పాను. నాకు క్రికెట్ చాలా ఇష్టం. అలాగే డేవిడ్ వార్నర్ ఆట కూడా ఇష్టం. అయితే ఇది సాధ్యమవుతుందని అనుకోలేదు. నిర్మాత రవి చాలా సీరియస్‌గా ట్రై చేసి మీటింగ్ అరేంజ్ చేశారు. నేను చాలా సర్ప్రైజ్అయ్యాను. వార్నర్‌ని ఢిల్లీలో కలిసి ప్రజెంటేషన్ ఇచ్చాను. ఆయన కూడా చాలా ఎక్సైట్ అయ్యారు.

**రాజేంద్రప్రసాద్ క్యారెక్టర్ గురించి?** ఈ సినిమాలో రాజేంద్ర ప్రసాద్‌ది చాలా ఇంపార్టెంట్ రోల్. ఆయన సెక్యూరిటీ ఏజెన్సీ నడుపుతుంటారు.



మృణాల్ ఠాకూర్ నయా లుక్

# 'జయహో రామానుజ' సాంగ్స్ రిలీజ్ ఈవెంట్

లయన్ డా.సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా "జయహో రామానుజ". ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా, సుమన్, ప్రవళ్లిక ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ చిత్ర సాంగ్స్ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ముత్యాల రాందాస్ మాట్లాడుతూ, లయన్ సాయి వెంకట్ నాకు మంచి మిత్రులు. ఆయన జయహో రామానుజ వంటి గొప్ప సినిమాను రూపొందించడం సంతోషంగా ఉంది. పాన్ ఇండియా భాషల్లో తెలుగు, తమిళ, మలయాళ,కన్నడ, హిందీ, సంస్కృతంలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారంటే ఇది చిన్న సినిమా అనకూడదు. ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయడంలో మా వంతు సపోర్ట్ చేస్తాం. జయహో రామానుజ సాయి వెంకట్‌కు మంచి పేరు తీసుకు రావాలని కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత, సినీ జర్నలిస్ట్ సురేష్ కొండేటి మాట్లాడుతూ, "జయహో రామానుజ" సాంగ్స్ లాంచ్‌లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించి సాయి వెంకట్‌కి గొప్ప పేరు తీసుకురావాలని కోరుకుంటున్నా. పుట్టిన రోజు జరుపుకుంటున్న సాయివెంకట్‌కి శుభాకాంక్షలు అందిస్తున్నా అన్నారు.



సింగర్ పద్మ మాట్లాడుతూ, "జయహో రామానుజ" చిత్రంలో నేను పాట పాడాను. ఈ పాట పాడమని సాయి వెంకట్ ఎంకరేజ్ చేశారు. సింగర్ కావాలనే నా కల ఈ చిత్రంతో తీరింది. మీరంతా "జయహో రామానుజ" చిత్రానికి పెద్ద సక్సెస్ఇస్తారని కోరుకుంటున్నా అన్నారు. దర్శకుడు, హీరోడా.లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ, మన తెలుగు రాష్ట్రాల్లో రామాను జాచార్యుల గురించి పెద్దగా తెలియదు. కానీ తమిళనాట ప్రతిఒక్కరికీ ఆయన ఎవరో తెలుసు. చినజీయర్ స్వామి సమతామూర్తి విగ్రహాన్ని మన దగ్గర ప్రధాని, రాష్ట్రపతి వంటి పెద్ద వాళ్లు వచ్చి ఆవిష్కరించినప్పుడు తెలుగు రాష్ట్రాల వారికి బాగా ఆయన గురించి తెలిసింది. తెలుగు ప్రజలకు రామానుజాచార్యుల వారి గొప్పదనం తెలియజేసే ప్రయత్నంలోనే ఈ చిత్రాన్ని రూపొందించాను. వెంకటేశ్వర స్వామికే గురువు లాంటి వారు రామానుజులు. వెంకటేశ్వరుడికి శంఖు చక్రాలు రామానుజాచార్యుల వారే బహూకరించారు. కమల్ హాసన్ సోషల్ మూవీలో 10 పాత్రలు చేశారు. కానీ పౌరాణికంలో ఎవరూ 11 పాత్రల్లో నటించలేదు. నేను "జయహో రామానుజ" చిత్రంలో 11 పాత్రలు చేసి వరల్డ్ రికార్డ్ క్రియేట్ చేస్తున్నా. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయండి అని మిత్రులు ఇచ్చిన సలహాతో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, సంస్కృతంతో పాటు మిగతా ప్రపంచ భాషల్లో రిలీజ్ చేయబోతున్నాం. నా బర్త్ డే సందర్భంగా సాంగ్స్ రిలీజ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. ఈ క్రమంలో నాకు నా మిత్రులు ముత్యాల రాందాస్‌తో పాటు ఇతర ఫ్రెండ్స్ డిస్ట్రిబ్యూషన్‌లో సపోర్ట్ చేస్తున్నారు. నా కూతురు ప్రవళ్లిక సినిమా నిర్మాణంలో ఎంతో పట్టుదలగా పనిచేస్తోంది.

# స్ట్రాంగ్ కంటెంట్‌తో 'సీతన్నపేట గేట్'

వేణుగోపాల్, 8పీఎం సాయి కుమార్, పార్థు, రఘుమారెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "సీతన్నపేట గేట్". ఈ చిత్రాన్ని వైఎంఆర్ క్రియేషన్స్, ఆర్ఎస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వై రాజ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మాస్‌యాక్షన్ ఎంటర్ టైనర్ కథతో రూపొందిన "సీతన్నపేట గేట్" సినిమా ఏప్రిల్ 4వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా ప్రెస్ మీట్‌ను హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వై రాజ్ కుమార్ మాట్లాడుతూ, మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని కార్ల్ మార్క్స్ చెప్పినట్లు మన సమాజంలో చాలా వరకు మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగానే ఉంటున్నాయి. కొన్నిసార్లు ఇవి అక్రమ సంబంధాలుగా మారుతున్నాయి. ఇలాంటి కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా సీతన్నపేట గేట్ సినిమాను రూపొందించాను. ఇప్పుడున్న ట్రెండ్‌కు సరి పోయేలా మాస్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా తెరకెక్కింది అన్నారు. హీరో వేణుగోపాల్ మాట్లాడుతూ, సీతన్నపేట గేట్ సినిమాలో హీరోగా నటించే అవకాశం ఇచ్చిన మా ప్రొడ్యూసర్ ఆర్ శ్రీనివాస్, మా డైరెక్టర్ రాజ్ కుమార్‌కి థ్యాంక్స్. ఈ సినిమాలో నేను చాలా మాస్ రా అండ్ రస్టిక్‌క్యారెక్టర్‌లో కనిపిస్తాను. చాలా స్ట్రాంగ్ ఎమోషన్ ఉన్న క్యారెక్టర్ ఇది. ఈ క్యారెక్టర్‌తో తెలుగు ఆడియెన్స్‌కు దగ్గరవుతానని ఆశిస్తున్నా. ఏప్రిల్ 4న థియేటర్స్‌లోకి వస్తున్న మా సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నా అన్నారు. డైలాగ్ రైటర్ బయ్యవరపు రవి మాట్లాడుతూ, సీతన్నపేట గేట్ సినిమాకు డైలాగ్స్ రాయమని డైరెక్టర్ రాజ్ కుమార్ నన్ను అప్రోచ్ అయినప్పుడు ఈ కథ చాలా యూనిక్‌గా అనిపించింది. వందలఏళ్ల క్రితమే కార్ల్ మార్క్స్ మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలే అని చెప్పాడు. కానీ ఈ కథలో ఈ ఆర్థిక సంబంధాలు కొన్ని సందర్భాల్లో అక్రమ సంబంధాలుగా ఎలా మారుతున్నాయో దర్శకుడు చూపించారు అన్నారు. యాక్టర్ కట్టప్ప మాట్లాడుతూ, సీతన్నపేట గేట్ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ రాజ్ కుమార్‌కి నిర్మాత శ్రీనివాస్‌కి థ్యాంక్స్. మా ఈవెంట్‌లో పాల్గొన్న సముద్రకి థ్యాంక్స్. ఆయన దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నా అన్నారు.డీవోపీ యోగి రెడ్డి మాట్లాడుతూ, సీతన్నపేట గేట్ సినిమా డీవోపీగా నాకు మొదటి మూవీ. ఈ సినిమా కోసం ఒక డిఫరెంట్ కలర్‌లో సినిమాటోగ్రఫీ ఉండాలని మేము ప్లాన్ చేశాం. మూవీ చేసేప్పుడు డైరెక్టర్ నుంచి కంప్లీట్ సపోర్ట్ లభించింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర కాస్ట్ అండ్ క్రూ మెంబర్స్ పాల్గొన్నారు. నటీనటులు: వేణుగోపాల్, 8పీఎం సాయి కుమార్, పార్థు, రఘుమారెడ్డి, యశ్వన్, గంగాధర్, సురభి తివారి, కస్లాయ్ చౌదరి, అనూష జైన్, సుదీక్ష ఝా, తదితరులు.



# కెవిఎన్ ప్రొడక్షన్స్ 'జన నాయగన్'

దళపతి విజయ్ చివరి సినిమా 'జన నాయగన్' జనవరి 9, 2026న విడుదల కాబోతోందని మేకర్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దళపతి విజయ్ సినీ ప్రయాణానికి నివాళిలా ఈ చిత్రం ఉంటుందని మేకర్లు ఇది వరకు చెప్పేశారు. తాజాగా రిలీజ్ డేట్ ప్రకటించి మరింతగా హైప్ క్రియేట్ చేశారు. దళపతి విజయ్ నటిస్తున్న ఈ జన నాయగన్ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి బరిలోకి దించుతున్నారు. సంక్రాంతి సందడి మొదలయ్యే కంటే ముందే బాక్సాఫీస్ వద్ద విజయ్ సందడి షురూ కానుంది. కోలీవుడ్‌లో పొంగల్ అంటే విజయ్ సాధించిన రికార్డులు, వసూళ్ల వర్షం అందరికీ గుర్తుకు వస్తుంటుంది. ఇక చివరగా ఇలా సంక్రాంతి బరిలోకి విజయ్ వచ్చి రికార్డులు సునామీని సృష్టించబోతోన్నారని అందరికీ అర్థమై ఉంటుంది. విజయ్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి స్పందన వచ్చింది. స్టైలీష్ లుక్‌లో విజయ్ తన ఫ్యాన్స్‌ను ఇట్టే కట్టిపడేశారు.



ఫార్స్ ఫిల్మ్ ద్వారా ఓవర్సీస్‌లో ఈ మూవీని భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఇక విజయ్ నటించే చివరి చిత్రం అవ్వడంతో చెన్నై నుంచి చికాగో.. ముంబై నుంచి మెల్‌బోర్న్ వరకు అభిమానుల్లో అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ప్రస్తుతం కేవీఎన్ ప్రొడక్షన్స్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్', 'జన నాయగన్' వంటి భారీ చిత్రాల నిర్మాణంలో బిజీగా ఉంది.


# 'షష్టిపూర్తి' సాంగ్ విడుదల

రూపేష్ కథానాయకుడిగా, నిర్మాతగా మా ఆయి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న సినిమా షష్టిపూర్తి. రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రధారులు. ఆకాంక్ష సింగ్ కథానాయిక. పవన్ ప్రభ దర్శకుడు. ఈ చిత్రానికి మేస్ట్రో ఇళయరాజా సంగీత దర్శకుడు. ఆయన సంగీతంలో తొలిసారి ఆస్కార్ పురస్కార గ్రహీత ఎంఎం కీరవాణి పాట రాయడం విశేషం. ఆస్కార్ అవార్డు విజేతగా నిలిచిన తర్వాత కీరవాణి రాసిన తొలి గీతం కూడా ఇదే కావడం విశేషం. ఇద్దరు దిగ్గజ సంగీత దర్శకుల కలయికలో రూపొందిన ఖిఏదో ఏ జన్మలోదోఖి అంటూ సాగే గీతాన్ని ఈ రోజు ప్రఖ్యాత సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ నేడు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ, మేం ఇళయరాజా గారి దగ్గరకు పాటల రికార్డింగ్ కోసం చెన్నై వెళ్లాం. రెండు పాటలకు బాణీలు అందించారు. సెకండ్ సాంగ్ రికార్డింగ్ టైంలో మూడో పాట కూడా తీసుకోవచ్చు కదా, మళ్ళీ రావడం ఎందుకని రాజా గారు చెప్పారు. సందర్భం చెప్పిన తర్వాత ఆయనొక బాణీ ఇచ్చారు. రెగ్యులర్ టైపు సాంగ్ కాదది. ఆ పాటలో కథ చెప్పాలి. ఆ అమ్మాయి జీవితంలో జరిగిన విషయాలు చెబుతున్నట్టు ఉండాలి. అలాగే, ప్రేమిస్తున్న వ్యక్తికి ఆ అమ్మాయి తాను ఇలా ఉండబోతున్నానని చెప్పాలి. అప్పటికి రెహమాన్, చైతన్య ప్రసాద్‌పాటలు రాశారు. వాటిలో వాళ్ళ స్టైల్ వినబడుతోంది. కొంచెం కొత్తగా వెళదామని అనుకున్నాను. కీరవాణిలో చమత్కారమైన రైటర్ ఉంటారు. ఆయనరాస్తే అందరికీ అర్థమయ్యేలా, సాహిత్య విలువలతో, క్యాచీగాఉంటుందని అనిపించింది. మెల్లగా నా మనసులో మాటను రూపేష్‌కి చెప్పాను. ఆ తర్వాత చైతన్య ప్రసాద్ చెవిలో వేశా. ట్రై చేద్దామని ఆసక్తి చూపించారు. అప్పుడు ఆ తర్వాత మరో ఆలోచన లేకుండా కీరవాణిని సంప్రదించాం. ఆయనకు చైతన్య ప్రసాద్ ఫోన్ చేశారు. వేరే సినిమా రీ రికార్డింగ్ చేయడం కోసం ఆయన చెన్నైలో ఉన్నారు. వెంటనే కలిసి షష్టిపూర్తిలో పాట రాయమని అడిగాం. రాజాకి చెప్పారా? అని కీరవాణి అడిగారు. మీరు ఒకే అంటే చెబుదామని చెప్పాను. బాణీ అడిగారు. పల్లవి రాసి పంపిస్తానని, నచ్చితే పాట రాస్తానని అన్నారు. కీరవాణి దగ్గర నుంచి రాజా స్టూడియో దగ్గరకు వెళ్లే సరికి పల్లవి వచ్చింది. నభూతో న భవిష్యత్. అంత అద్భుతంగా రాశారు. అనన్యా భట్ కూడా పాటను అద్భుతంగా పాడారు. రాజా బాణీలో కీరవాణి సాహిత్యం, అనన్యా భట్ గాత్రం కలిసి పాట అద్భుతంగా వచ్చింది అని అన్నారు.



# '$28^0$సి' ట్రైలర్ సూపర్

పొలిమేర చిత్రం విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా $28^0$సి ఏప్రిల్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఎమోషనల్‌గా సాగే అద్భుతమైన ప్రేమ కథతో తెరకెక్కిన ఈ చిత్రంలో నవీన్ చంద్ర హీరోగా నటించగా, షాలినీ వడ్నికట్టి హీరోయిన్‌గా కనిపించనుంది. $28^0$సి చిత్రాన్ని వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ సాయి అభిషేక్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మ్యూజిక్ నిరంజన్ మాట్లాడుతూ, $28^0$సి సినిమా ఏప్రిల్ 4న రిలీజ్‌కు రెడీ అవుతున్న సందర్భంగా మూవీ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ సినిమా సాంగ్స్ రిలీజై మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్నాయి. సినిమా కూడా సూపర్ హిట్ కావాలని కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత సాయి అభిషేక్ మాట్లాడుతూ, $28^0$సి సినిమా గురించి మాట్లాడాలంటే ఎమోషనల్ అవుతాము. ఈ సినిమాను 2018లో స్టార్ట్ చేశాం. ఆ తర్వాత ఓటీటీకి ఇవ్వాలనే ప్రపోజల్స్ వచ్చాయి. కోవిడ్ టైమ్‌లో సినిమాను రిలీజ్ చేయలేకపోయాం. అయితే మా సినిమాను ఓటీటీ కంటే బిగ్ స్క్రీన్ మీదకు తీసుకురావాలనే పట్టుదలగా ఉన్నాం. నాకో ప్రొడ్యూసర్స్ కూడా సపోర్ట్ చేశారు అన్నారు. డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ, దర్శకుడిగా నేను చేసిన తొలి సినిమా '$28^0$సి. ఈ సినిమా గురించి మాట్లాడాలంటే ఎంతో ఉద్వేగంగా



ఉంది. ప్రతి దర్శకుడికి తన తొలి సినిమా ఇలా చేయాలి అలా చేయాలనే కోరికలు ఉంటాయి. నేనూ ఈ మూవీ కోసం ఎంతో కష్టపడ్డాను. కానీ నేను ఇది నా తొలి సినిమా అని గర్వంగా చెప్పుకోగలను అన్నారు. హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ, $28^0$సి సినిమా మా టీమ్ అందరికీ ఒక ఎమోషనల్ జర్నీ ఇచ్చింది. 2018లో దర్శకుడు అనిల్ విశ్వనాథ్ నాకు ఈ కథ చెప్పాడు. కథ వినగానే ఇంప్రెస్ అయ్యాను. 2019లో సినిమా ఫినిష్ చేసి రిలీజ్‌చేయాలని ప్లాన్‌చేశాం. అయితే కోవిడ్ వల్ల అప్పటి పరిస్థితులు ఎలాఉండేవో మీ అందరికీ తెలుసు. ఓటీటీ ఆఫర్స్ వచ్చినా మా ప్రొడ్యూసర్ సాయిఅభిషేక్ ఇవ్వలేదు. థియేటర్‌లోనే ఈసినిమాను రిలీజ్ చేయాలనిపట్టుదలగా ఉన్నారు. డాక్టర్స్ అయిన ఓజంట ప్రేమకథ.

# అక్రమ వలసదారుల ఏరివేతకు చర్యలు

## ట్రంప్ ప్రకటనతో గ్రీన్‌కార్డు దారుల్లో ఆందోళన




**వాషింగ్టన్, మార్చి 25:** అమెరికాలో అక్రమ వలసదారుల ఏరివేత లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా సోషల్ మీడియా ఖాతాలపై దృష్టి పెట్టిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ పరిధిని మరింత విస్తరించాలని ప్రతిపాదించింది. దానికింద అమెరికాలో నివసిస్తోన్న గ్రీన్‌కార్డుదారులంతా తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అప్పగించాల్సి రావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే వీసా దరఖాస్తుదారులు యుఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌కు తమ ఖాతా వివరాలను వెల్లడించాల్సి ఉంది. కొత్త ప్రతిపాదన అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తోన్న, శాశ్వత నివాసం, ఆశ్రయం కోరుతున్న వారికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ మెరుగైన గుర్తింపు ధ్రువీకరణను సాధ్యం చేస్తుందని, దేశ భద్రతకు సంబంధించిన ముప్పును నివారించేందుకు దోహదం చేస్తుందని అమెరికా ప్రభుత్వం గత నోటీసుల్లో పేర్కొంది. గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు అంటూ అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు లక్షల మంది వలసదారుల్లో, ముఖ్యంగా భారత సంతతి వారిలో గుబులు రేపుతోంది. దీనికి అనుగుణంగానే గత కొన్ని వారాలుగా అమెరికా తమ వలస చట్టాలను కఠినతరం చేయడం వలసదారుల్లో ఆందోళనను పెంచుతోంది. ఇక తాజా ప్రతిపాదన కింద.. అమెరికా విధానాలను విమర్శించేవారు ఆ దేశాన్ని తమ నివాసంగా మార్చుకోకుండా నిరోధించే వీలు కలుగుతుంది. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ, యుఎస్-భారత్ సంబంధాల్లో చురుకైన పాత్ర పోషిస్తోన్న పలువురు భారత సంతతి వ్యక్తులపై ఈ ప్రతిపాదనల ప్రభావం చూపేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాజకీయ అంశాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే పరిస్థితి లేకుండా పోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల యుఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేశారు. హెచ్-1బి, ఎఫ్-1, గ్రీన్‌కార్డు కలిగిన భారతీయులు ప్రయాణాల్లో అప్రమత్తత పాటించాలని సూచించారు. వీరు అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు మరింత ఎక్కువగా ఉంటాయని, సహనంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలకు చెందిన పౌరులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధించాలని ట్రంప్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ ఈ ఆంక్షల జాబితాలో లేనప్పటికీ అమెరికా వెలుపల ప్రయాణాలు చేయాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జనవరి 20న ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయగానే అమెరికా ప్రజల రక్షణకు సంబంధించిన పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. 'గత నాలుగేళ్లలో అమెరికాలోకి అక్రమ వలసదారులు పోటెత్తారు. లక్షల మంది సరైన పత్రాలు లేకుండానే మన సరిహద్దులు దాటి దేశంలోకి వచ్చారు. ఆ తర్వాత ఇక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రత, ప్రజల రక్షణకు ముప్పుగా మారుతున్నారు. అందుకే అక్రమ వలసదారుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం' అని ట్రంప్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# లోక్‌సభలో ఆర్థికబిల్లు 2025 ఆమోదం

**న్యూఢిల్లీ, మార్చి 25:** బడ్జెట్‌సమావేశాల్లో కొత్తగా ప్రవేశపెట్టిన ఆర్థికబిల్లు 2025ను లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లులో తెచ్చిన 35 ప్రభుత్వ సవరణలు కూడా ఆమోదం పొందాయి. వీటిలో ఆన్‌లైన్ వ్యాపారప్రకటనలపై నిషేధించిన ఆరుశాతం డిజిటల్ పన్నుపైనా సవరణలు తెచ్చారు. ఆర్థిక బిల్లును ఆమోదించడం ద్వారా లోక్‌సభలో బడ్జెట్ ఆమోదం ప్రక్రియను పూర్తి చేసినట్లయింది. ఎగువ సభలో ఈ బిల్లు ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. రాజ్యసభ ఆమోదం పొందిన తర్వాత 2025-26 బడ్జెట్‌ప్రక్రియ మొత్తం పూర్తయినట్లు అవుతుంది. కేంద్ర బడ్జెట్ కొతనత సంవత్సరానికిగాను 50.65 లక్షలకోట్లు వ్యయంగాచూపించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత సంవత్సరం కంటే అంచనాబడ్జెట్‌లో 7.4శాతం పెరుగుదల నమోదయింది. మూలధన వ్యయం వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను రూ.11.22 లక్షలకోట్లు ఉంటుందని, మొత్తంగా మూలధన వ్యయం 15.48 లక్షలకోట్లుగా కేంద్ర ఆర్తికశాఖ తన పద్దుల్లో చూపించింది. స్థూల పన్నులరాబడి రూ.42.70 లక్షలకోట్లు కాగా రుణాలు ఇతరత్రా సమీకరణల ద్వారా రూ.14.01 లక్షల కోట్లు ఉన్నాయి. బడ్జెట్ పత్రాలప్రకారం కేంద్ర ప్రాయోజిత పథకాలకోసం రూ.5,41,850.21 కోట్లు కేటాయించారు. ఇక కేంద్ర పథకాలకోసం రూ.16.29 లక్షలకోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో మూలధనవ్యయం పెరుగుదలకు అనేక కారణాలను పొందుపరిచారు. మార్కెట్ రుణాలకు వడ్డీచెల్లింపులు, ట్రెజరీ బిల్లులు, బాహ్య రుణాలు, చిన్నమొత్తాల పొదుపు, ప్రావిడెంట్ ఫండ్స్, సాయుధ దళాలకు మరింతగా ఎక్కువ నిధులు అవసరం రావడం, మూలధన వ్యయం, ఉపాధి కల్పన పథకానికి మరింతగా కేటాయింపులు వంటివి పెరిగాయని కేంద్రం చెపుతోంది. ఇక రాష్ట్రాల వాటా నిధులు బదలిలీపరంగా రాష్ట్రవాటాలు, గ్రాంట్లు,రుణాలు, కేంద్ర ప్రాయోజితపథకాల నిధులువంటి వాటికోసం రూ. 25,01,284 కోట్లు అవుతాయని అంచనా వేసారు. కొత్త బడ్జెట్‌లో ఆర్థికలోటు4.4శాతంగా ఉంటుంది. ప్రస్తుతం ఈలోటు 4.8శా తం గా ఉంది. ఇక 2025-26 సంవత్సరానికి గాను జిడిపి రూ.3,56,97,923కోట్లుగా అంచనా వే సారు. సవరించిన అంచనాలకంటే 10.1శాతం ఎక్కువగా ఉన్నట్లు బడ్జెట్ పత్రాల్లోనే స్పష్టం చేసారు.

# యుఎస్ అధ్యక్షుడు ట్రంప్‌కు పుతిన్ బహుమానం



**మాస్కో, మార్చి 25:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌నకు ఓ కానుకను బహూకరించారట. ఈ విషయాన్ని క్రెమ్లిన్ స్వయంగా ధ్రువీకరించింది. ఇటీవల ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ మాస్కోలో పర్యటించారు. ఈ సమయంలో విట్‌కాఫ్‌కు ట్రంప్ చిత్రపటాన్ని ఇచ్చి దాన్ని ట్రంప్‌నకు అందించాలని కోరినట్లు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వివరించారు. విట్‌కాఫ్ గతవారం ఓ ఇంటర్వ్యూలో ఇదే విషయాన్ని పేర్కొంటూ ఆ బహుమతిని అందమైనదిగా అభివర్ణించారు. 2018లో ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చాక పుతిన్ ఒక సాకర్ బంతిని ట్రంప్‌నకు బహూకరించారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. పెన్సిల్వేనియాలో ప్రచారంలో ఉండగా 20 యేళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో.. ట్రంప్ చెవికి స్వల్పంగా గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి.. వేదికపై నుంచి దించి ఆస్పత్రికి తరలించారు. ఆ ఘటన అప్పట్లో సంచలనమైంది. ఆ విషయం తెలుసుకున్న పుతిన్ ట్రంప్ క్షేమం కోసం అప్పుడు ప్రార్థనలు చేశారని ఇటీవల విట్‌కాఫ్ పేర్కొన్నారు. స్థానిక చర్చికి వెళ్లి, మత గురువును కలిసి, అధ్యక్షుడి కోసం ప్రార్థించారని తెలిపారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించారు. దీనికి ఉక్రెయిన్ అంగీకరించగా మాస్కో సూత్రప్రాయంగా ఓకే చెప్పింది. ఈ క్రమంలో ఇరు దేశాల అధ్యక్షులతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజులపాటు దాడులు నిలిపివేయాలని పుతిన్‌కు సూచించగా ఆయన అంగీకరించారు. అయితే, ఒప్పందం జరిగిన జరిగిన కొన్ని గంటలకే అది ఉల్లంఘనకు గురైంది. ఇదిలా ఉండగా సౌదీ అరేబియాలోని జెడ్డాలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ చర్చల్లో పురోగతి సాధించడం కష్టమని దిమిత్రీ పెస్కోవ్ వ్యాఖ్యానించారు. నల్లసముద్రంలో వాణిజ్య నౌకల భద్రతే తమకు కీలకమన్నారు.

# పరీక్షకోసం బస్సు వెనుకపరుగెత్తిన 12వ తరగతి బాలిక

## వీడియో వైరల్ కావడంతో బస్సు డ్రైవర్, కండక్టర్ల సస్పెన్షన్




**తిరుపత్తూరు, మార్చి 25:** పరీక్షలకు హాజర య్యేందుకాను బస్సుకోసం వేచి ఉన్న 12వ తరగతి విద్యార్థిని బస్సును పట్టుకునేందుకు బస్సువెంట పరుగెత్తిన వైనంపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని బస్సు ఆమె ఎక్కేందుకు అనువుగా ఆపకుండా ముందుకు కదలడంతో బస్సును పట్టుకునేందుకు ఆమె బస్సువెంట పరుగులుతీసింది. తమిళనాడులోని కథకొట్టయి ప్రాంతంలో జరిగిన ఈసంఘటన ప్రభుత్వం దృష్టికి రావడంతో డ్రైవర్‌ను వెంటనే సస్పెండ్ చేసింది. బస్సువెనుక పరుగెత్తుతున్న విద్యార్థినిని చూసి ఎట్టకేలకు డ్రైవర్ బస్సు ఆపి ఆమెను ఎక్కించుకున్నప్పటికీ బస్టాప్‌లో పరీక్షల సమయంలో విదార్థినులపట్ల వ్యవహరించిన తీరుపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటన సోషల్‌మీడియాలో వైరల్ అయింది. వైరల్ అయిన ఈ విడియోను చూసిన రవాణాశాఖ వెంటనే డ్రైవర్ మునిరాజ్‌ను సస్పెండ్ చేసింది. కండక్టర్ అశోక్‌కుమార్‌ను విధులనుంచి తొలగించింది. కండక్టరు కాంట్రాక్టు ఉద్యోగి కావడంతో వెంటనే విధులనుంచి తొలగించింది. ఈ బాలిక నిమ్మియంబట్టు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతోంది. అదే ఆమెకు పరీక్షా కేంద్రం కూడా ఉంది. కొథకొట్టై స్టాప్‌నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. బస్సును ప్రతి స్టాప్‌లోను ఆపాల్సిన బాధ్యత డ్రైవర్‌దేనని ప్రయాణీకులు లేకపోయినా స్టాప్‌లో ఆగివెళ్లాలని అధికారులు చెప్పారు. పరుగెత్తి వస్తున్న బాలికను చూసి కండక్టర్ డ్రైవర్‌ను హెచ్చరించాల్సి ఉందని ఇద్దరూ కూడా విధుల్లో నిర్లక్ష్యం వహించినందున వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బస్సు ఫైనల్ స్టేజికి చేరుకునేలోపే వారిపై చర్యలు తీసుకున్నారు. అయితే ఆ బాలిక సకాలంలోనే పరీక్షలకు హాజరుకాగలిగిందని రవాణాశాఖ అధికారులు చెప్పారు.

# కెనడా ఎన్నికల్లో భారత్,చైనాల జోక్యం

## కెనడా నిఘా సంస్థ డిప్యూటీచీఫ్ హెచ్చరికలు

**న్యూఢిల్లీ, మార్చి 25:** కెనడా జాతీయ ఎన్నికల్లో భారత్,చైనాలు జోక్యం చేసుకునే ప్రమాదం ఉందని కెనడా నిఘా వేగులు అక్కడి ప్రధానికి సమాచారం అందించారు. వచ్చే నెల 28వ తేదీ కెనడా పార్లమెంటు ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ సిఎస్ఐఎస్ వనెస్సా ల్లాయిడ్ మాటాడుతూ ఈ రెండుదేశాలు విస్తృతంగా కృత్రిమమేధను వినియోగిస్తున్నాయని, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించి తమకు అనుకూలమైన పార్టీలకోసం ఇప్పటినుంచే ఈ దేశాలు కుట్రలు చేసే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించారు. ప్రధాని మార్క్ కార్నీ ముందస్తు ఎన్నికలను ప్రకటించడంతో ముందునుంచే కెనడా నిఘా సంస్థలు ఇతర దేశాల ప్రమేయంపై ఆరా తీస్తున్నాయి. కెనడా ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో భారత్ జోక్యంచేసుకునే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, భౌగోళికంగా భారత్‌కు పరపతి ఎక్కువ ఉన్నందున తమ దేశె న్నికల్లో జోకనయంచేసుకునే ప్రమాదం లేకపోలేదని నిఘా సర్వీస్ డిప్యూటి డైరెక్టర్ హెచ్చరించారు. అంతేకాకుండా పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్‌చైనా (పిఆర్‌సి)కూడా కృత్రిమమేథ టూల్స్‌ను వినియోగించి కెనడా ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ప్రమాదం ఎక్కువ ఉందని హెచ్చరించారు. ముందుగా సోషల్ మీడియాను ఉపయోగించి తన ఆసక్తులు, ప్రాధాన్య తలను ప్రచారం చేస్తుందని, చైనా జాతి, సంస్కృతిక, మతపరమైన కెనడా కమ్యూనిటీల్లో వారిని తమ వైపు తిప్పుకుని తమకు అనుకూలమైన వ్యక్తులకు ఓట్లువేసేవిధంగా చర్యలుచేపట్టిందన్నారు. తాజాగా ఆయన చెపుతున్న వివరాలు తమకు అందిన విశ్వసనీయ



సమాచారం అని భారత్,చైనాల జోక్యం ఎక్కువ ఉంటుందన్నారు. కెనడాలో భారతీయ సంతతి ప్రజానీకం మరింత ఎక్కువమంది ఉన్న సంగతి తెలిసిందే. భారత్ నిషేధిత సంస్థగా పేర్కొంటున్న ఖలిస్తానీ ఫోర్స్ కెనడా అడ్డాగా కార్యకలాపాలు సాగిస్తోంది. ఇక్కడినుంచే విదేశాలకు విస్తృతం అవుతున్నదని భారత్ కూడా వాదిస్తోంది. వీటికితోడుగా చైనా జనాభా కూడా కెనడాలో గణనీయంగా ఉంది. ఉత్తర అమెరికా దేశం అయిన కెనడా ఇపుడు అమెరికానుంచి కూడా హెచ్చరికలు అందుకుంటున్నది. ట్యారిఫ్‌లు పెంచుతామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. అక్రమ వలసలు కట్టడిచేయకపోతే 51వ రాష్ట్రంగా అమెరికాలో చేరిపోవాలని, కెనడా ప్రధాని అయినా అధ్యక్షుడు అయినా ఇక 51వ రాష్ట్ర గవర్నర్‌గా కొనసాగుతారని తీవ్రస్థాయిలో హెచ్చరికలుచేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో వచ్చే నెల 28వ తేదీ జరిగే పార్లమెంటు ఎన్నికల్లో భారత్,చైనాల జోక్యం ఎక్కువ ఉంటుందని కెనడా ముందునుంచే హెచ్చరికలు చేస్తోంది.

# వర్షాకాల సమావేశాల్లో కొత్త ఆర్థిక బిల్లు

## కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, మార్చి 25:** కొత్త ఆదాయపు పన్ను బిల్లును పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆర్థికబిల్లు 2025పై లోక్‌సభలో జరిగిన చర్చల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం పార్లమెంటు సెలక్ట్ కమిటీ పరిశీలనలో ఉన్న ఈ బిల్లును వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెడతామని చెప్పారు. వాస్తవానికి ఈ బిల్లును గత ఫిబ్రవరి 13వ తేదీ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సెలెక్ట్ కమిటీ తననివేదికను పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజే పార్లమెంటుకు అందచేస్తుందని, ఆ తర్వాత వర్షాకాల సమావేశాల్లోనే ఈబిల్లును చర్చకు ప్రవేశపెడతామని చెప్పారు. వర్షాకాల సమావేశాలు జులైలో ప్రారంభం అయి ఆగస్టు నెలాఖరువరకూ జరుగుతాయి. సరళీకృతంచేసిన ఆదాయపు పన్ను బిల్లు 1961నాటి పాత ఆదాయపు పన్ను చట్టంతోపోలిస్తే సులువుగా అందరికీ అర్థం అయ్యేలా రూపొందించామని మంత్రి చెప్పారు. అంతేకాకుండా కొత్త బిల్లు వల్ల లిటిగేషన్‌కూడా తగ్గుతుందని వెల్లడించారు. కొత్తబిల్లు సుమారు 2.6 లక్షల పదాలతో ఉందని, పాతచట్టం అయితే 5.12 లక్షల పదాలతో ఉందని ఆమె చెప్పారు. అలాగే కొత్తచట్టంలో సెక్షన్లు కూడా 819 నుంచి 356కి తగ్గించారు. అలాగే అధ్యా యాలు కూడా 47 నుంచి 23కి తగ్గించినట్లు తెలిపారు. ఆదాయపు పన్ను బిల్లు 2025లో 57 పట్టికలు ఉన్నాయని ప్రస్తుతం ఉన్న చట్టం లో 18 పట్టికలు మాత్రమే ఉన్నాయని అలాగే 1200 ప్రొవిజన్లు, 900 వివరణలను తొల గించినట్లు చెప్పారు.

# విదేశంలో బంగారం కొనుగోలుకు హవాలా డబ్బు వినియోగం

## కన్నడ నటి రన్యారావు కేసులో మరో కీలక విషయం

**బెంగళూరు, మార్చి 25:** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ అరెస్టయిన కన్నడ నటి రన్యారావు కేసులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. విదేశంలో ఆమె బంగారం కొనుగోలు చేసేందుకు హవాలా డబ్బును వినియోగించినట్లు విచారణలో తేలింది. స్వయంగా రన్యారావు దీన్ని అంగీకరించినట్లు డిఆర్ఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. బంగారం కొనుగోలు కోసం హవాలా మార్గాల ద్వారా నగదు బదిలీ చేసినట్లు రన్యారావు అంగీకరించారని డిఆర్ఐ తెలిపింది. నటి బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా డిఆర్ఐ తమ విచారణలో తేలిన విషయాలను న్యాయస్థానానికి వివరించింది. కాగా అక్రమంగా బంగారాన్ని తీసుకొస్తూ బెంగళూరు ఎయిర్‌పోర్టులో రన్యారావు అధికారులకు చిక్కిన సంగతి తెలిసిందే. ఆమెను మార్చి 3న అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరో నిందితుడు తరుణ్‌రాజ్‌కు ఆమె ఆర్థిక సహాయం చేసినట్లు విచారణలో తేలింది. ఆమె పంపిన డబ్బుతోనే అతడు దుబాయ్ నుంచి హైదరాబాద్ వెళ్లాడని అధికారులు ఆరోపించారు. బ్యాంకాక్, జెనీవాకు బంగారాన్ని అక్రమంగా రవాణా చేసేవారని పేర్కొన్నారు. హోటల్ వ్యాపారి తరుణ్ రాజ్, రన్యారావు స్నేహితులని, వీరిద్దరూ 2023లో దుబాయ్‌లో విరా డైమండ్ ట్రేడింగ్ ఎల్ఎల్‌సి అనే ట్రేడింగ్ కంపెనీని స్థాపించారని తెలిపారు. వ్యాపార భాగస్వాములుగా కొనసాగుతూ దీనిని నిర్వహిస్తున్నారని విచారణలో తేలింది. ఈ స్మగ్లింగ్ కేసులో రోజుకో కొత్త విషయం బయటకొస్తోంది. ఆమె హవాలా మార్గల్లో నగదు చెల్లించి బంగారం కొనుగోలు చేసినట్లుతాజాగా డిఆర్ఐ అధికారులు ఆరోపించారు.





# జస్టిస్ వర్మ వ్యవహారంపై అఖిలపక్షం సమావేశం: ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

**న్యూఢిల్లీ, మార్చి 25:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ నివాసంలో భారీ ఎత్తున నోట్లకట్టలు బయటపడినఘటన పెనుసంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. విచారణకమిటీ ఒపక్క దర్యాప్తుచేస్తోంది. ఇదే అంశంపై చర్చించేందుకు తాజాగా ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్‌ధన్‌ఖడ్ అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చారు. ఇది చాలా క్లిష్టమైన అంశమని రాజ్యసభాపక్షనేత, ప్రతిపక్షనేతతో చర్చించానని అఖిలపక్ష సమావేశంనిర్వహిస్తే మంచిదని వారు సూచించారని తెలిపారు. వారి అభిప్రాయాన్ని గౌరవించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా జస్టిస్ యశ్వంత్‌వర్మ ఇంట్లో అగ్నిప్రమాదంసందర్భంగా ఈనోట్లకట్టలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు సిజెఐ ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసారు.

# లక్ష కోట్లతో ఢిల్లీ ప్రభుత్వ బడ్జెట్

## రూ.31వేల కోట్లకు పెరిగిన మూలధన వ్యయం

## అటల్ క్యాంటీన్లు, మహిళలకు సాయం కీలక అంశాలు

## గతప్రభుత్వం కంటే మెరుగైన పాలన ఇస్తామన్న సిఎం రేఖాగుప్త



**న్యూఢిల్లీ,మార్చి 25:** రెండున్నరదశాబ్దాల తర్వాత ఢిల్లీ పీఠంపై కాషాయజెండా ఎగురవేసిన బిజెపి రేఖాగుప్త ప్రభుత్వం మొదటిసారి తన బడ్జెట్‌నుప్రవేశపెట్టింది. పది కీలక విభాగాలపై దృష్టిపెట్టి ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు సీఎం రేఖాగుప్తా వెల్లడించారు. మౌలికవనరుల వృద్ధి, మంచినీరు, విద్యుత్; రోడ్ల అభివృద్ధి వంటి మౌలిక సౌకర్యాలను అత్యంత ప్రాధాన్యతా క్రమంలో వృద్ధిచేయాలని నిర్ణయించినట్లు ఆమె అసెంబ్లీలో చెప్పారు. ఆర్థికశాఖను ముఖ్యమంత్రే నిర్వహిస్తుండటంతో ఢిల్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ముఖ్యమంత్రి తన బడ్జెట్‌లో మూలధన వ్యయం ఈసారి 28 వేలకోట్లకు పెంచినట్లు ప్రకటించారు. గత ఏడాది కేవలం 15 వేల కోట్లు మాత్రమే ఉన్న మూలధన వ్యయం గణనీయంగా పెంచామన్నారు. 2025-26 బడ్జెట్ లక్షకోట్లకుగా ఉంటుందని గత ఏడాది కంటే 31.5 శాతం పెరిగిందని ఇదొక చరిత్రాత్మక బడ్జెట్ అన్నారు. ఢిల్లీలో అటల్‌క్యాంటీన్ల ఏర్పాటుకోసం రూ.100 కోట్లు కేటాయించామని, నగరంలో 100 అటల్ క్యాంటీన్లు ఏర్పాటుచేస్తామన్నారు. మురికివాడల వృద్ధికోసం మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.696 కోట్లు కేటాయించామన్నారు. అదేవిధంగా కొత్త బడ్జెట్‌లో ఢిల్లీ ఎన్సీఆర్ కనెక్టివిటీ కోసం రూ.1000 కోట్లు కేటాయిం చామన్నారు. మహిళలకు నెలనెలా రూ.2500 ఆర్తికసాయం కోసం బడ్జెట్‌లో 5100 కోట్లు కేటాయించామని చకెప్పారు. పిఎం జన్ ఆరోగ్య యోజనకింద 2144 కోట్లు కేటాయించామని చెప్పారు.

# పిఎంకిసాన్‌లో అనర్హులను ఏరివేస్తున్నాం..

## పార్లమెంటులో వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్




**న్యూఢిల్లీ, మార్చి 25:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాచేపట్టిన పిఎంకిసాన్‌సమ్మాన్‌నిధి పథకంలో అనర్హుల ఏరివేతపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నదని ఈక్రమంలోనే ఇప్పటివరకూ అనర్హులనుంచి రూ.416 కోట్లు రికవరీచేసినట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.పిఎం కిసాన్‌పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికిరూ.6వేలను మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 2019లోప్రారంభం అయిన ఈ పథకం ద్వారా ఇప్పటివరకూ 19 విడతల్లో రూ.3.68 లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఈప థకం ప్రారంభంలో స్వీయ ధృవీకరణ ఆధారంగా లబ్దిదారుల పేర్ల నమోదుకు అనుమతించారు. ఇప్పటికే 100శాతం ఆధార్‌సీడింగ్ పూర్తిచేయగా ఆధార్, ఆదాయపు పన్నుశాఖ ఆర్థిక మంత్రిత్వ శాఖవద్ద ఉన్న సమాచారంతో అన ర్హులను ఏరివేసే కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో ఐటి చెల్లింపుదారులు ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్నవారు దీనికింద లబ్దిపొందితే వారినుంచి రికవరీ చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలి తప్రాంతాలకు కేంద్రం సూచించింది. ఇదిలా ఉంటే ఈ పథకం ద్వారా లబ్దిపొందే రైతుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం కొనసా గుతుందని, పీఎం కిసాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో స్వయంగా రిజిస్టరు చేసుకోవచ్చని కేంద్ర వ్యవసాయ మంత్రి చౌహాన్ వెల్లడించారు.

# వీసా ఫీజులు పెంచిన బ్రిటన్ సర్కార్!

**లండన్, మార్చి 25:** పర్యాటక వీసాలతోపాటు ఉన్నత చదువులకోసం బ్రిటన్‌కువెళ్లే విద్యార్థులపై ఆర్థికభారం పెరుగుతోంది. విద్యార్థి, విజిటర్‌సహా అన్ని కేటగిరీల వీసాఫీజులను పెంచుతున్నట్లు యుకెప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త ఛార్జీలు 2025 ఏప్రిల్ 9నుంచి అమలులోకి వస్తాయని వెల్లడించింది. విద్యార్థి వీసాలపై గతంలో 115 పౌండ్లు ఉంటే పది శాతం పెరిగి 127 పౌండ్లకు చేరింది. అదే రెండేళ్ల కాలపరిమితి వీసారుముకూడాప ఎంచారు. విద్యార్థి వీసాలపై ఈపెరుగుదల ప్రభావం కనిపిస్తుంది. ప్రధాన దరఖాస్తుదారుసహా వారి డిపెండెంట్లు ప్రస్తుతం 490 పౌండ్లు చెల్లించాల్సి ఉండగా త్వరలో అది 524 పౌండ్లకు చేరనున్నది. చైల్డ్‌స్టూడెంట్లకు ఇదే పెంపు వర్తిస్తుంది. ఆరునెలలనుంచి 11నెలల స్వల్ప కాలపరిమితి ఇంగ్లీషు కోర్సు చదివే విద్యార్థుల ఫీజుకూడా 14 పౌండ్లుపెరిగింది.

# జమిలి ఎన్నికలపై జెపిసి కాలపరిమితి పొడిగింపు



**న్యూఢిల్లీ, మార్చి 25:** జమిలి ఎన్నికల కోసం లోక్ సభలోప్రవే శపెట్టిన రాజ్యాం గ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ కాలపరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. బిజెపి ఎంపి పిపిచౌదరి ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల చివరివారంలో తొలిరోజు వరకూ గడువు పొడిగించింది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వ హించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలోప్రవేశపెట్టిన అంశం తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించాలని ప్రతిపక్షాలు డిమాండ్‌చేసాయి. దీనితో 39 మంది ఎంపి లతో జెపిసి కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసారు. లోక్‌సభ నుంచి 27 మంది రాజ్యసభనుంచి 12 మందిస భ్యులున్నారు. వచ్చేనెల నాల్గవ తేదీతో ఈ కమిటీ కాలపరిమితి ముగియడంతో పదవీకాలం పెంచాలని ఛైర్మన్‌ప్రతిపాదించారు. ఈ అంవంపై పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిగాయి ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ రంజన్‌గగోయ్,ప్రఖ్యాతన్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, ఢిల్లీహైకోర్టు మాజీ సిజెఐ జస్టిస్ ఎపిషాలు కమిటీముందు హాజరయి తమ అభిప్రాయాలుతెలిపారు. జెపిసిగడువు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ తాజాగా ఆమోదం తెలిపింది.

# తీహార్ జైలు మరో చోటుకు మార్పు

## ప్రకటన చేసిన ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్త




**న్యూఢిల్లీ, మార్చి 25:** ఆసియాలోనే అతిపెద్దదైన తీహార్ జైలును మరో చోటుకు మార్చేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఒక ప్రకటన చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో దీనిని ఏర్పాటు చేసేలా ఓ సర్వే, కన్సల్టెన్సీ సర్వీసుల ఏర్పాటుకు రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. జైలు విస్తీర్ణం, అందులో ఉంచే ఖైదీల కారణంగా దాని చుట్టుపక్కల నివసించేవారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఢిల్లీ సిఎం చెప్పారు. ఈ కారాగారాన్ని 1958లో నిర్మించారు. మొత్తం 9 జైళ్లతో 400 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. 1966లో దీని నిర్వహణను పంజాబ్ ప్రభుత్వం నుంచి ఢిల్లీకి బదిలీ చేశారు. దేశ రాజధానిలో ప్రధాన జైలుగా ఇది ఉంది. ఢిల్లీలో ప్రస్తుతం 19వేల మంది ఖైదీలు ఉండగా, తీహార్, మండోలి, రోహిణి ఈ మూడు జైళ్లు 10 వేల మంది ఖైదీల సామర్థ్యంతో ఉన్నాయి. ఇటీవలే ఖైదీల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఖైదీలు జైలు లోపల ఫోన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ఆరు చోట్ల 15 జామర్లను పెడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఐపిఎల్‌లో అత్యధిక ఫైనల్స్ ఆడిన స్టార్స్


ఎంఎస్ ధోని


సరేష్ రైనా


అంబటి రాయుడు


హార్దిక్ పాండ్యా


రోహిత్ శర్మ


రవీంద్ర జడేజా


బ్రావో


పోలార్డ్

## ఫస్ట్ ప్లేస్‌లో ఎంఎస్ ధోనీ

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2008లో ప్రారంభమైనప్పటి నుంచి అనేక మంది ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శనను చూపించారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ జరిగిన ఐపిఎల్ టోర్నీలో అత్యధిక ఫైనల్ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్లు ఉన్నారు. ఆ ఆటగాళ్ల జాబితాలో చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ (ఎమ్ఎస్ ధోనీ) అగ్రస్థానంలో ఉన్నాడు. 2024 సీజన్ వరకు ధోనీ 11 ఐపీఎల్ ఫైనల్స్‌లో పాలొన్నాడు. అతని తర్వాత ఇతర ప్రముఖ ఆటగాళ్లు కూడా అత్యధిక ఫైనల్ మ్యాచ్‌లు ఆడిన లిస్ట్‌లో స్థానాన్ని సంపాదించారు. అటువంటి వారిలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు దిగ్గజ కెప్టెన్‌గా నిలిచిన ధోనీ మొత్తం 11 ఐపిఎల్ ఫైనల్స్ లో పాల్గొన్నాడు. ఇందులో చెన్నైతో పాటు, 2017 సీజన్‌లో రైజింగ్ పుణే సూపర్ జెయింట్ తరఫున కూడా ఫైనల్ ఆడాడు. దీనితో ధోనీ ఐపిఎల్‌లో అత్యధిక ఫైనల్స్ ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. తర్వాత స్థానంలో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తరఫున 8 ఐపిఎల్ ఫైనల్స్‌లో పాల్గొన్నాడు.

2008లో రాజస్థాన్ తరఫున ఆడిన జడేజా తరువాత చెన్నైలో ప్రధాన ఆటగాడిగా మారాడు. ఇక ఐపిఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో ఒకరైన సురేశ్ రైనా చెన్నై సూపర్ కింగ్స్ తరఫున 8 ఫైనల్స్‌లో ఆడాడు. రైనా బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసి చెన్నై విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. అంబటి రాయుడు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ తరఫున 8 ఐపిఎల్ ఫైనల్స్‌లో ఆడాడు. రాయుడు ఐపిఎల్లో ఒక స్థిరమైన బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే కాకుండా, బెస్ట్ ఫినిషర్‌గా కూడా గుర్తింపు పొందాడు.

టీమిండియా మాజీ దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ వంటి జట్ల తరఫున 7 ఐపిఎల్ ఫైనల్స్‌లో ఆడాడు. మరో ప్లేయర్ డ్వైన్ బ్రావో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున 7 ఫైనల్స్ లో ఆడాడు. ఒక మంచి ఆల్ రౌండర్‌గా బ్రావో తన బౌలింగ్, హార్డ్ హిట్టింగ్ బ్యాటింగ్‌తో చెన్నై విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

ఇక హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ తరఫున 6 ఫైనల్స్‌లో పాల్గొన్నాడు. 2022లో గుజరాత్ టైటాన్స్‌కు కెప్టెన్సీ చేసి జట్టును విజేతగా కూడా నిలిపాడు. ముంబై ఇండియన్స్ జట్టు తరఫున 6 ఐపీఎల్ ఫైనల్స్‌లో ఆడిన కీరన్ పొలార్డ్ ముంబై విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

హార్డ్ హిట్టింగ్, ఫినిషింగ్‌లో అతని బ్యాటింగ్ ఆటతీరు అద్భుతంగా ఉండేవి. డెక్కన్ చార్జర్స్, ముంబైఇండియన్స్ తరఫున 6ఫైనల్స్‌లో పాల్గొన్న రోహిత్ శర్మ ఐపిఎల్లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడిగా నిలిచాడు. వీరి తర్వాత సుబ్రమణ్యం బద్రీనాథ్ (చెన్నై సూపర్ కింగ్స్), లసిత్ మలింగ (ముంబైఇండియన్స్), అల్బీమోర్కెల్ (చెన్నై సూపర్ కింగ్స్)లు 5 సార్లు ఫైనల్స్ ఆడారు.

## ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో.. ప్రధాన టోర్నీకి న్యూజిలాండ్



**న్యూఢిల్లీ:** ప్రపంచ కప్ ప్రధాన టోర్నమెంట్‌కు న్యూజిలాండ్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు అర్హత సాధించింది. పది దేశాలు పోటీపడ్డ ఓసియానియా జోన్ నుంచి 2026 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత పొందిన తొలి జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది. ఆక్లాండ్‌లో జరిగిన ఓసియానియా జోన్ ఫైనల్లో న్యూజిలాండ్ 3-0 గోల్స్ తేడాతో న్యూ కాలడోనియా జట్టుపై గెలిచింది. న్యూజిలాండ్ తరఫున మైకేల్ జోసెఫ్ బాక్సల్ (61వ నిమిషంలో), బార్స రూసెస్ (66వ నిమిషంలో), హెన్రీ జస్ట్ (80వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. అయితే ఫైనల్లో ఓడిన కాలడోనియాకు ప్రపంచ కప్ బెర్త్ దక్కించుకునేందుకు మరో అవకాశం మిగిలి ఉంది. ఆసియా, ఆఫ్రికా, ఉత్తర, మధ్య, దక్షిణా అమెరికా జోన్లకు చెందిన ఆరు జట్లు పోటీపడే ఇంటర్ కాంటినెంటల్ ప్లే ఆఫ్ టోర్నీలో విజేతగా నిలిస్తే న్యూ కాలడోనియా జట్టు కూడా ప్రపంచ కప్‌కు అర్హత పొందుతుంది. కాగా 2026లో ప్రపంచ కప్ టోర్నీకి అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఆతిథ్య దేశాల హోదాలో అమెరికా, కెనడా, మెక్సికో ఇప్పటికే ప్రపంచ కప్‌కు అర్హత పొందగా, జపాన్, న్యూజిలాండ్ ఈ మూడు జట్లతో చేరాయి. వందేళ్ల చరిత్ర కలిగిన ప్రపంచ కప్ టోర్నీలో న్యూజిలాండ్ పోటీ పడనుండటం ఇది మూడోసారి.

## సాకర్ ఆసియా కప్ నుంచి భారత్ నిష్క్రమణ



### లెబనాన్ చేతిలో 1-6తో మూడో ఓటమి

**న్యూఢిల్లీ:** ఎఫ్‌సి బీచ్ సాకర్ ఆసియా కప్ ఛాపియన్‌షిప్‌లో భారత్ నిరాశాజనకమైన ముగింపునిచ్చింది. థాయిలాండ్‌లోని పట్టాయాలో జరిగిన ఎఎఫ్‌సి బీచ్ సాకర్ ఆసియా కప్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 1-6 తేడాతో లెబనాన్ చేతిలో ఓడిపోయింది. నాలుగు జట్ల గ్రూప్‌లో భారత్‌కు ఇది మూడో ఓటమి. అంతకుముందు ఆతిథ్య థాయిలాండ్ మరియు కువైట్ చేతిలో ఓడిపోయింది. మరోవైపు, లెబనాన్ తన రెండవ విజయాన్ని నమోదు చేసి ఆరు పాయింట్లతో ముగిసింది. లెబనాన్ తరఫున మహ్మద్ అల్ సలేహ్ (9 పెనాల్టీ), మహ్మద్ హైదర్ (10 ), అహ్మద్ ఎల్ ఖతీబ్ (22 ), మహ్మద్ ఒస్మాన్ (23), మహ్మద్ చోకర్ (32 ), మహ్మద్ మెర్హి (34 ) గోల్స్ చేయగా, భారత్‌కు చెందిన అమిత్ గోదారా (18) స్కోరుతో ప్రత్యర్థి రక్షణను ఛేదించడానికి పదే పదే చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో లెబనాన్ ఆధిక్యంలోకి రావడానికి తొమ్మిది నిమిషాలు పట్టింది. మొహమ్మద్ అల్ సలేహ్ సున్నితమైన ముగింపుతో పెనాల్టీని మలచడం ద్వారా లెబనాన్‌ను ఆధిక్యంలోకి నెట్టివేసిన ఒక నిమిషం తర్వాత, భారత కెప్టెన్ రోహిత్ యేసుదాస్ తన షాట్ క్రాస్‌పీస్‌ను ముద్దాడి అవుట్ అయ్యాడు. అయితే, లెబనాన్ జట్టు మొహమ్మద్ హైదర్ ఎడమవైపు నుండి ఒక చక్కని టచ్‌తో క్రాస్‌ను గైడ్ చేయడంతో దాదాపు వెంటనే స్కోరును 20కి చేర్చింది. రెండవ పీరియడ్‌లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. 18వ నిమిషంలో, అమిత్ గొడారా సతీష్ సుభాష్ ఇచ్చిన కార్నర్ కిక్‌ను గోల్‌గా మలిచి లెబనాన్ డిఫెన్స్‌ను ఆశ్చర్యపరిచాడు. కానీ అత్యధిక స్కోరింగ్ జట్టు లెబనాన్‌ను ఆపడం అంత సులభం కాలేదు. వారు తమ గత రెండు మ్యాచ్‌లలో తొమ్మిది గోల్స్ సాధించారు. అంతేకాకుండా వారి గోల్ తేడాను మెరుగుపరచుకోవడానికి నిరంతరం మరిన్నింటి కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 23వ నిమిషంలో అహ్మద్ ఎల్ ఖతీబ్ సైకిల్ కిక్‌తో అద్భుతంగా మూడవ గోల్ కొట్టాడు. మరుసటి నిమిషంలోనే మొహమ్మద్ ఓస్మాన్ ఆధిక్యాన్ని పెంచాడు. మూడవ మరియు చివరి పీరియడ్‌లో మొహమ్మద్ చోకర్ మరియు మొహమ్మద్ మెర్హి ద్వారా విజేతలు రెండుసార్లు ఎక్కువ గోల్స్ చేసి జట్టును ఓడించారు. భారత్‌కు మార్జిన్‌ను తగ్గించే అవకాశం ఉన్నా కానీ ఈసారి అమిత్ గొడారా ముందు ఓపెన్ నెట్ ఉన్నప్పటికీ బంతిని ఫ్రేమ్‌లో ఉంచడంలో విఫలమయ్యాడు.







## సెంట్రల్ కాంట్రాక్ట్‌లో.. దీప్తి, హార్మన్, మంధానలకు లక్కీ

### 3 గ్రేడ్‌లుగా 19 మంది మహిళా క్రికెటర్లు

**న్యూఢిల్లీ:** కొత్త వార్షిక సెంట్రల్ కాంట్రాక్ట్‌లో పలువురు భారత మహిళా క్రికెటర్లకు చోటు దక్కింది. జాబితాను విడుదల చేసింది. ప్రస్తుత సీజన్ కోసం ఈసారి మొత్తం 16 మంది మహిళా ప్లేయర్స్‌కు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బసిసిఐ) కాంట్రాక్ట్ ఇచ్చింది. ఈ మహిళా క్రికెటర్లను మూడు గ్రేడ్లుగా విభజించారు. ఈ జాబితాలో ముగ్గురు క్రికెటర్లను గ్రేడ్ ఎ లోకి, నలుగురుని గ్రేడ్ బి లోకి, మిగిలిన 9 మందిని గ్రేడ్ సి లోకి చేర్చారు. ఈ కాంట్రాక్ట్ 2024 అక్టోబర్ 1 నుండి 2025 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. బిసిసిఐ విడుదల చేసిన జాబితాలో గ్రేడ్ ఎ లో భారత మహిళా జట్టు కెప్టెన్ హార్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, దీప్తి శర్మ ఉన్నారు. వీరు భారత జట్టుకు ప్రధాన ఆటగాళ్లుగా కొనసాగుతున్నారు. ఈ గ్రేడ్‌లో ఉన్న క్రికెటర్లకు రూ.50 లక్షలు వార్షికంగా అందజేయనున్నారు. ఇక గ్రేడ్ బి లో రేణుకా ఠాకూర్, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, షెఫాలీ వర్మ చోటు దక్కించుకున్నారు. వీరికి సంవత్సరానికి రూ.30 లక్షలు కాంట్రాక్ట్ కింద లభించనుంది. అలాగే గ్రేడ్ సి లో యస్తికా భాటియా, రాధా యాదవ్, శ్రేయంకా పాటిల్, తితాస్ సాధు, అరుందతి రెడ్డి, అమన్ జోత్ కౌర్, ఉమా చేత్రి, స్నేహ రాణా, పూజా వస్త్రకర్ ఉన్నారు. వీరికి సంవత్సరానికి 10 లక్షల రూపాయలు అందించనున్నారు. కాగా బిసిసిఐ మహిళా, పురుష క్రికెటర్లకు ఒకే రకమైన మ్యాచ్ ఫీజును ఇస్తున్నప్పటికీ, వార్షిక కాంట్రాక్ట్‌లో చాలా తేడా ఉంది. పురుష క్రికెటర్లకు ఎ+ గ్రేడ్ కూడా ఉంది. ఇందులో ఉన్న ఆటగాళ్లకు ఏడాదికి రూ.7 కోట్లు అందజేస్తారు. పురుషుల ఎ గ్రేడ్‌లో రూ.5 కోట్లు, బి గ్రేడ్‌లో రూ.3 కోట్లు, సి గ్రేడ్‌లో రూ.1 కోటి అందిస్తారు. దీనితో ఈ కాంట్రాక్ట్ లిస్టుపై మహిళా క్రికెట్ అభిమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పురుషులకంటే మహిళా క్రికెటర్లకు తక్కువ మొత్తాన్ని కాంట్రాక్ట్ కింద చెల్లించడం న్యాయమా? అనే ప్రశ్నలు కూడా చర్చనీయాంశంగా మారాయి.

## భారత్ డబుల్స్ స్పెషలిస్ట్ సుమిత్ గుడ్ బై



**న్యూఢిల్లీ:** భారత డబుల్స్ స్పెషలిస్ట్, 2022 కామన్వెల్త్ గేమ్స్ బ్యాడ్మింటన్ మిక్స్డ్ టీమ్ రజత పతకం గెలుచుకున్న జట్టులో సభ్యుడు బి సుమీత్‌రెడ్డి రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రపంచ అత్యున్నత 17వ ర్యాంకింగ్ సాధించిన సుమీత్, హైదరాబాద్‌కు చెందిన 33 ఏళ్ల మను అత్రితో కలిసి 2016 దక్షిణాసియా క్రీడల్లో డబుల్స్ విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు, రియోఒలింపిక్స్‌కుసైతం అర్హత సాధించారు. అంతేకాకుండా హైదరాబాద్‌లో జరిగిన ఆసియా టీమ్ ఛాంపియన్‌షిప్ పురుషుల జట్టులో కూడా భాగమయ్యాడు. అతను 2014 మరియు 2018 ఆసియా క్రీడలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. మరియు 2015 మెక్సికో సిటీ గ్రాండ్ ప్రిక్స్, 2016 కెనడా ఓపెన్లను గెలుచుకున్నాడు, 2015లో యుఎస్ ఓపెన్ మరియు డచ్ ఓపెన్లలో రన్నరప్‌గా నిలిచాడు. 2017 సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్‌లో అశ్విని పొన్నప్పతో పాటు, సుమిత్ కూడా రెండవ స్థానంలో నిలిచాడు. కాగా సుమీత్‌కు వెన్నుముక ఎముక క్షీణత సమస్యతో సహా కొన్ని ఎదురుదెబ్బలు తగిలాయి, దీని వలన శరీర దిగువ భాగం పక్షవాతం వస్తుందనే భయాలు ఉన్నందున వైద్యులు అతన్ని బ్యాడ్మింటన్ మానేయమని సలహా ఇచ్చారు. 2021లో హైదరాబాద్‌లో తన సొంత బ్యాడ్మింటన్ అకాడమీని ఏర్పాటు చేశాడు. సిక్కి సుమీత్ బ్యాడ్మింటన్ అకాడమీపేరుతో ప్రారంభించిన సుమిత్ భారతదేశ కోచింగ్‌ప్యానెల్లోకూడా భాగం అయ్యాడు.

# అమెరికాలో ఆర్థిక మాంద్యం!

**వాణిజ్యం**

**వాషింగ్టన్, మార్చి 25:** ఆర్థిక కార్యకలాపాలు మందగించడాన్ని ఎత్తి చూపుతూ 2025 మొదటి త్రైమాసికంలో అమెరికా జిడిపి వృద్ధి అంచనాలను ఆర్థికవేత్తలు సవరించారు. వాణిజ్యలోటు పెరగడం, వినియోగదారుల వ్యయం మందగించడం, శీతాకాల కార్యకలా పాలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారడం ఇందుకు కారణమని చెబుతున్నారు. దిగుమతులు పెరగడం, ఎగుమతులు స్తంభించడం తో వాణిజ్యలోటు రికార్డు స్థాయికి చేరుకుంది. ఒక్క జనవరి 2025లోనే వస్తు, సేవల లోటు 131.4 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ అసమతుల్యత విదేశీ వస్తువులకు పెరిగిన డిమాండ్‌ను ప్రతిబింబిస్తుంది. పాక్షికంగా సంభావ్య సుంకాల వల్ల వస్తువుల ఎగుమతులు సవాలుగా మారుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వినియోగ వ్యయం కూడా బలహీనత సంకేతాలను సూచి స్తుంది. విచక్షణతో ఆలోచించి చేసే ఖర్చుపైనే దృష్టిపెడు తున్నారు. చాలా కుటుం బాలు అత్యవసరం కాని కొనుగోళ్ల కంటే అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నా యి. ద్రవ్యోల్బణ ఆందోళ నలు, నిర్దిష్ట జనాభాలో ఆర్థిక ఒత్తిడి వంటి అంశాలు ఈ వైఖరికి దోహదం చేస్తున్నాయి. బ్లూమ్‌బర్గ్ వెయిటెడ్ యావరేజ్ ఆఫ్ ఫోర్‌కాస్ట్ అంచనాల ప్రకా రం ఈ త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ 1.4శాతం వార్షిక వృద్ధి కనబరిచినప్పటికీ 2024 చివరి మూడు నెలల్లో 2.3శాతం తో పోలిస్తే చాలా మందగించింది. ఆర్థిక అనిశ్చితి, తీవ్రమైన శీతాకాల వాతావరణం, అసాధారణంగా ఉండే ఫ్లూ సీజన్ వల్ల అనేక ప్రాంతాల్లో రిటైల్ కార్యకలాపాలకు అంతరాయం కలుగు తుంది. అమెరికా సుంకా లు సహా వాణిజ్య విధా నాలు ఆర్థిక పరిస్థితు లపై కీలక పాత్ర పోషి స్తాయని నిపుణులు భావిస్తున్నారు. ద్రవ్యో ల్బణం, వృద్ధి అనే ద్వంద్వ సవాళ్లను యుఎస్ సెంట్రల్ బ్యాంకు నిశితంగా పరిశీలిస్తూ ద్రవ్య విధాన నిర్ణయాలపై దృష్టిసారిస్తోంది. ఇటీవల ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు వడ్డీరేట్లను ప్రస్తుత స్థాయిలోనే కొనసాగించినప్పటికీ, ఈ యేడాది చివర్లో వడ్డీరేట్ల కోత ఉండొచ్చని అంచనాలున్నాయి. వాణిజ్య ఉద్రిక్తతలు, ద్రవ్య సర్దుబాట్ల పర్యవసానాలతో ఇన్వెస్టర్లు, విధాన నిర్ణేతలు సతమతమవుతున్న నేపథ్యంలో మార్కెట్లో రానున్న రోజుల్లో ఒడుదుడుకులు ఎదురవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ సంవత్సరం ద్వితీయార్థంలో ఆర్థిక మాంద్యం ప్రమాదాలు పెరగవచ్చని చెబుతున్నారు. అందుకోసం ప్రభుత్వ వ్యూహాత్మక ఆర్థిక జోక్యాలు అవసరమని సూచిస్తున్నారు.

## అమ్మకాల్లో టెస్లాను దాటేసిన బివైడి!

**చైనా, మార్చి 25:** చైనా కార్ల తయారీ సంస్థ బీవైడీ నుంచి అమెరికాకు చెందిన టెస్లాకు తీవ్రమైన పోటీ వస్తోంది. తాజాగా వార్షిక ఆదాయాల్లో మస్క్ నేతృత్వంలోని సంస్థను మించింది. షెంజెన్ కేంద్రంగా పని చేసే బీవైడీ గతేడాది 107 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించినట్లు పేర్కొంది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 29శాతం అధికం. ఇక ఇదేకాలంలో టెస్లాకు వచ్చిన ఆదాయం 97.7 బిలియన్ డాలర్లే అమ్మింది. కానీ, దీనిలో హైబ్రీడ్ వాహనాల విభాగంలో మాత్రం భారీ పెరుగుదలను నమోదు చేసింది. ఈసారి ఆ కంపెనీ ఏకంగా 43 లక్షల వాహనాలను ప్రపంచ వ్యాప్తంగా విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. క్విన్ ఎల్‌గా పిలిచే ఈ కారు ధర టెస్లా మోడల్ 3లో దాదాపు సగమే ఉంది. ఇటీవలే ఈ చైనా సంస్థ టెస్లా మోడల్ 3కి పోటీగా ఓ చౌక మోడల్ కారును తీసుకొచ్చింది. చైనా 'ఇవి' మార్కెట్లో దూసుకెళ్లేందుకు వీలుగా దీనిని తీసుకువచ్చినట్లు సమాచారం. దీంతోపాటు బీవైడీ ఈ ఏడాది సరికొత్తగా ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీలను ముందుకు తీసు కొచ్చింది. కేవలం ఐదు నిమిషాలు ఛార్జింగ్ చేస్తే.. 400 కిలోమీటర్లు దూసుకుపోవచ్చు. అదే సమయంలో టెస్లాలో 15 నిమిషాలు ఛార్జింగ్ పెట్టాల్సి రావచ్చు. ఇక బీవైడీ బేసిక్ మోడల్స్‌లో కూడా ఉచితంగా సరికొత్త డ్రైవర్ అసిస్టెన్స్‌ను సిద్ధం చేసింది. దీనికి 'గాడ్స్ ఐ' అని పేరు పెట్టింది. గత కొంతకాలంగా టెస్లా సారథి మస్క్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు నెరపడంతో కూడా ఈ కంపెనీ కార్ల విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మరోవైపు చైనా తయారీ కార్లపై పశ్చిమ దేశాల్లో భారీగా పన్నులు విధిస్తున్నారు.



కావడం గమనార్హం. బీవైడీ విక్రయాల్లో హైబ్రీడ్ వాహనాల జోరు కొనసాగుతోంది. బీవైడీ గతేడాది టెస్లా విక్రయించిన విద్యుత్తు వాహనాల సంఖ్యకు (17.9 లక్షల) దాదాపు సమానంగా 17.6 లక్షల వాహనాలను

## అమ్మకానికి కాగ్నిజెంట్ హెడ్ ఆఫీస్

**వాషింగ్టన్, మార్చి 25:** అమెరికాకుచెందిన ప్రముఖ ఐటి సేవల సంస్థ కాగ్నిజెంట్ టెక్నా లజీ సొల్యూషన్స్ చెన్నైలోని ఓల్డ్ మహాబలిపురం రోడ్ ఒక్కియం తొరైపాక్కంలో ఉన్న 13.68 ఎకరాల ప్రైమ్ ప్రాపర్టీని రూ.612 కోట్లకు విక్రయించింది. నీలాంకరై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ వారం ప్రారంభంలో ఈ అమ్మకం లావాదేవీలు నమోదయ్యాయి. తొరైపాక్కం కాంప్లెక్స్‌లో సుమారు రెండు దశాబ్దాలకుపైగా ఉన్న కాగ్నిజెంట్ ఇండియా ప్రధాన కార్యాలయం లెగసీ ఇక ముగిసినట్లు తెలుస్తుంది. చెన్నైలో కాగ్నిజెంట్ మొదటి పూర్తి యాజమాన్యంలోని క్యాంపస్‌గా ఉన్న ఈ ప్రాపర్టీకి గణమైన చరిత్రఉంది. ఒకప్పుడు కాగ్నిజెంట్ రిమోట్ కార్యకలాపాలకు ఇది ఎంతో తోడ్పడింది. అయితే ప్రస్తుతం అమ్మిన దాదాపు 15 ఎకరాల్లోని నాలుగు లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలంతో కూడిన ఈ కార్యాలయానికి సుమారు రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని గత యేడాది సెప్టెం బరులో ఒకనివేదిక తెలిపింది. ఎంఇపిజెడ్, షోలింగనల్లూరు, సిరుసేరిలోని మూడు సొంత భవనాల్లో కాగ్నిజెంట్ తన కార్యకలాపాలను పటిష్టం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా ఈ విక్రయం జరి గింది. ఈ లావాదేవీని సులభతరం చేయడానికి అంతర్జాతీయ ప్రాపర్టీ అడ్వైజరీ సంస్థ జెఎల్ఎల్‌ను నియమించి గత యేడాది ఆగస్టులో కంపెనీ ఈ ప్రాపర్టీని మార్కెట్లోకి తెచ్చింది. స్థానిక డెవలపర్లు బాశ్యామ్ గ్రూప్, కాసాగ్రాండ్ సహా పలువురు కొనుగోలుదారులతో చర్చించిన తర్వాత బెంగళూరుకు చెందిన రియల్ ఎస్టేట్ బగామానే గ్రూప్ విజయవంతమైన బిడ్డర్‌గా లిస్ట్అయింది. ఈ ప్రాపర్టీ విక్రయంద్వారా స్టాంప్ డ్యూటీతోపాటు రిజిస్ట్రేషన్ ఫీజులకోసం తమిళనాడు ప్రభుత్వానికి రూ.55.08 కోట్లు సమకూరాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.